ప్రజా కలం
Digital Editions
http://prajakalam.com
epaper.prajakalam.com
paperboy.com
www.magzter.com

epaper.prajakalam.in
www.prajakalam.in

ప్రజా కలం

Published From Nizamabad

PRGI No.TELTEL/2010/33275

PRAJA KALAM Telugu Daily తెలుగు దినపత్రిక

ప్రజా కలం
PRAJA KALAM Telugu Daily
Classifieds
5 Lines Rs.250 only
&
Public Notice Advertising
క్లాసిఫైడ్స్ సంప్రదించండి
9010972526

బుధవారం | 28-10- 2026 | సంపుటి: 17, సంచిక: 207, నిజామాబాద్, పేజీలు: 12, వెల: 3/- | ఎడిటర్: కలకొండ రామకృష్ణ



పేదల సొంతింటి కల సాకారం చేయడమే

ప్రభుత్వ లక్ష్యం

అధికారుల పనితీరులో మార్పు రాకపోతే కఠినచర్యలు తప్పవు

భూ సమస్యల పరిష్కారంలో జాప్యాన్ని సహించేది లేదు : భూ సర్వేను పకడ్బందీగా నిర్వహించాలి

క్షేత్రస్థాయిలో సర్వేను పరిశీలించి రైతులకు భూమి విస్తీర్ణంపై స్పష్టత ఇవ్వాలి

రైతులను ఇబ్బందులకు గురిచేస్తే సహించబోం - పెండింగ్ దరఖాస్తులను తక్షణమే పరిష్కరించాలి

రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల, ఆరోగ్య శాఖల మంత్రులు, దామోదర రాజనర్సింహా, పొంగులేటి శ్రీనివాసరెడ్డి

సంగారెడ్డి, ప్రతినిధి అక్టోబర్ 27(ప్రజా కలం): రెవెన్యూ ఉద్యోగులు నక్రమంగా, బాధ్యతాయుతంగా పనిచేసినప్పుడే ప్రజల ముఖ్యంగా రైతుల సమస్యలు తీరుతాయని ఈ విషయంలో ఇప్పటికే పలుమార్లు రెవెన్యూ ఉద్యోగులను ఆదేశించినప్పటికీ పూర్తిస్థాయి ఫలితాలు కనిపించలేదని భవిష్యత్తులో మార్పురాకపోతే అధికారులు, ఉద్యోగులపై కఠిన చర్యలు తీసుకుంటామని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి హెచ్చరించారు. మంగళవారం నాడు ఉమ్మడి మెదక్ జిల్లాలోని రెవెన్యూ, రిజిస్ట్రేషన్, హౌసింగ్ శాఖల పనితీరుపై సంగారెడ్డి జిల్లా పరిషత్ మీటింగ్ హాలు లో ఉమ్మడి జిల్లా కలెక్టర్లు, సంబంధిత శాఖల అధికారులతో మంత్రులు దామోదర రాజనర్సింహా, వివేక్ వెంకటస్వామి లతో కలిసిమంత్రి సుదీర్ఘంగా సమీక్షించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, రాష్ట్రంలో భూ వివాదాలకు శాశ్వత పరిష్కారం చూపడంతో పాటు భూ రికార్డుల్లో పారదర్శకత తీసుకురావడమే లక్ష్యంగా ప్రభుత్వం రీ సర్వే చేపట్టిందన్నారు.

తరువాయి 2వ పేజీలో...

తెలంగాణకు పెట్టుబడులపై

ఫోకస్



గ్లోబల్ సమ్మిట్‌తో రేవంత్ సర్కార్ భారీ ప్లాన్!

డిసెంబర్ 7 నుంచి ఫ్యూచర్ సిటీలో ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్

ఈ నెల 29న ఢిల్లీలో కర్టెన్ రైజర్ కార్యక్రమం

నవంబర్ మొదటి వారంలోగా సమ్మిట్ ప్రణాళికలు ఖరారు చేయాలి

ప్రపంచ స్థాయి పెట్టుబడిదారులు, ప్రముఖులకు ఎలాంటి ఇబ్బందులు కలగకూడదు

కాకతీయ కళాతోరణం, రామప్ప ఆలయం, బతుకమ్మతో తెలంగాణ సంస్కృతికి ప్రాధాన్యం

ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్ ఏర్పాట్లపై ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి సమీక్ష


హైదరాబాద్, అక్టోబరు 27 (ప్రజాకలం) : తెలంగాణ రాష్ట్రాన్ని ప్రపంచ పెట్టుబడులకు ప్రధాన గమ్యస్థానంగా నిలపడంతో పాటు, రాష్ట్ర ప్రతిష్ఠను అంతర్జాతీయ స్థాయిలో మరింత పెంచే లక్ష్యంతో డిసెంబర్‌లో నిర్వహించనున్న ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్ ఏర్పాట్లపై ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి సమీక్ష నిర్వహించారు. ఫ్యూచర్ సిటీలో డిసెంబర్ 7 నుంచి జరగనున్న ఈ గ్లోబల్ సమ్మిట్‌ను ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించాలని, వివిధ దేశాల నుంచి హాజరయ్యే పెట్టుబడిదారులు, పారిశ్రామికవేత్తలు, ప్రముఖ ప్రతినిధులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని విభాగాలు సమన్వయంతో పనిచేయాలని అధికారులను ఆదేశించారు. ఈ గ్లోబల్ సమ్మిట్ తెలంగాణ అభివృద్ధి ప్రస్థానాన్ని, పెట్టుబడులకు ఉన్న అవకాశాలను ప్రపంచానికి పరిచయం చేసే కీలక వేదికగా నిలుస్తుందని సీఎం పేర్కొన్నారు. అంతర్జాతీయ స్థాయిలో రాష్ట్రానికి మరింత గుర్తింపు తీసుకురావడంతో పాటు, వివిధ రంగాల్లో కొత్త పెట్టుబడులను ఆకర్షించేందుకు ఈ సదస్సు దోహదపడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

నవంబర్ మొదటి వారంలోగా ప్రణాళికలు ఖరారు

గ్లోబల్ సమ్మిట్‌కు సంబంధించిన అన్ని ఏర్పాట్లు, కార్యక్రమాల ప్రణాళికలను నవంబర్ మొదటి వారంలోగా ఖరారు చేయాలని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. పలు దేశాలు, రాష్ట్రాల నుంచి హాజరయ్యే ప్రముఖ కంపెనీల సీఈఓలు, పెట్టుబడిదారులు, ప్రతినిధులకు రవాణా, వసతి, సమావేశాలు తదితర అంశాల్లో ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు. సమ్మిట్‌లో నిర్వహించే ప్రధాన కార్యక్రమాలు, ఔత్సాహిక పెట్టుబడిదారులు, వ్యాపారవేత్తలతో సమావేశాలు, రక్షా ఎక్స్‌పో, ఇండియా జాయ్ ఈవెంట్ల నిర్వహణపై అధికారులకు దిశానిర్దేశం చేశారు. ప్రతి కార్యక్రమానికి సంబంధించి స్పష్టమైన కార్యాచరణ రూపొందించి, సమయపాలనతో ఏర్పాట్లు పూర్తి చేయాలని సూచించారు.

తరువాయి 2వ పేజీలో...

కలం కౌంటర్



బీసీ సంక్షేమ శాఖ పథకాల అమలులో

పారదర్శకత, వేగం పెంచాలి



38 ఆత్మగౌరవ భవనాల జీవోల ప్రక్రియ వేగంగా పూర్తి చేయాలి

డిసెంబర్ 9న లబ్ధిదారులకు కుట్టు మిషన్లు అందించేలా కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేయాలి

బీసీ స్టడీ సర్కిల్ లో కమిటీ నివేదిక ఆధారంగా నూతన సంస్కరణలు అమలు చేయాలి

బీసీ సంక్షేమ శాఖ సమీక్షా సమావేశంలో అధికారులకు మంత్రి పొన్నం ప్రభాకర్ ఆదేశాలు

హైదరాబాద్, అక్టోబరు 27 (ప్రజాకలం) : నచివాలయంలో రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ బీసీ నంక్షేమ శాఖపై నమీక్షా నమావేశం నిర్వహించారు. బీసీ సంక్షేమ శాఖ పరిధిలో అమలవుతున్న పథకాలు, గురుకుల పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు, ఆత్మగౌరవ భవనాలు, నిరుద్యోగులకు నైపుణ్య శిక్షణ, బీసీ వర్గాలకు స్వయం ఉపాధి అవకాశాల కల్పన తదితర అంశాలపై అధికారులతో సమీక్షించారు. మహాత్మా జ్యోతిబా ఫూలే విదేశీ విద్యా నిధి పథకం అమలుపై మంత్రి సమీక్షించారు. ఈ పథకం ద్వారా అర్హులైన మెరిట్ విద్యార్థులకు పూర్తి పారదర్శకతతో పెండింగ్ లేకుండా పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాలు, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క సూచనల మేరకు 38 ఆత్మగౌరవ భవనాలకు సంబంధించిన జీవోల ప్రక్రియను వేగంగా పూర్తి చేయాలని మంత్రి పొన్నం ప్రభాకర్ అధికారులను ఆదేశించారు. బీసీ మహిళలకు స్వయం ఉపాధి అవకాశాలు మెరుగుపరిచే లక్ష్యంతో ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇంటింటా కుట్టు మిషన్ల పథకం అమలుపై మంత్రి సమీక్షించారు.

తరువాయి 2వ పేజీలో...

అంబర్‌పేట్ తాసిల్దార్ కార్యాలయంపై

ఏసీబీ నజర్...?



అవినీతి ఆరోపణలపై అధికారుల ఆరా!

ఎమ్మార్వో కార్యాలయంలో బ్రోకర్ల పెత్తనంపై నిఘా

వివిధ పనుల నిమిత్తం వచ్చే సామాన్యుల జేబులు గుల్ల చేస్తున్న వైనంపై ఫోకస్

సిబ్బంది ప్రమేయంతో బ్రోకర్లు డబ్బులు డిమాండ్ చేస్తున్నట్టు పెద్ద ఎత్తున అరోపణలు

వార్తా పత్రికలలో ఎన్ని కథనాలు ప్రచురితమైనా మారని తీరు...

హైద్రాబాద్ అక్టోబర్ 27(ప్రజాకలం ప్రతినిధి) హైదరాబాద్‌లోని అంబర్‌పేట్ తహసీల్దార్ కార్యాలయంపై అవినీతి నిరోధక శాఖ అధికారులు ప్రత్యేక నిఘా ఉంచినట్లు తెలుస్తోంది. గత కొంతకాలంగా ఈ కార్యాలయంలోని పలు విభాగాల్లో పెద్ద ఎత్తున అవినీతి అక్రమాలు జరుగుతున్నాయంటూ బాధితుల నుంచి వచ్చిన వరుస ఫిర్యాదుల నేపథ్యంలో ఏసీబీ ఈ నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం.

ముఖ్యంగా భూములకు సంబంధించి, నాలా కన్వర్షన్లు, వారసత్వ,కుల,ఆదాయ,ధృవీకరణ పత్రాల జారీ, వృద్ధాప్య,ఒంటరి మహిళా పెన్షన్ల వంటి పనుల కోసం వచ్చే ధరఖాస్తుదారుల వద్ద కొంతమంది బ్రోకర్లు,ఇక్కడి కొందరు అధికారులు, సిబ్బంది పెద్ద మొత్తంలో లంచాలు డిమాండ్ చేస్తున్నారని స్థానికులు ఆరోపణలు,జరుగుతున్న పరిణామాలు, బాధితుల నుంచి వస్తున్న విశ్వసనీయ సమాచారంతో రంగంలోకి దిగిన ఏసీబీ నిఘా విభాగానికి చెందిన అధికారులు కార్యాలయ పరిసరాల్లో నిశితంగా పరిశీలిస్తున్నట్లు తెలుస్తోంది.

ఇటీవలి కాలంలో రాష్ట్రవ్యాప్తంగా రెవెన్యూ విభాగంలో వరుసగా జరుగుతున్న ఏసీబీ దాడుల నేపథ్యంలో, అంబర్‌పేట్ తహసీల్దార్ కార్యాలయంపై నిఘా పెట్టడం స్థానికంగా తీవ్ర కలకలం రేపుతోంది.ఒకవేళ ఇదే నిజమైతే మూసీ బఫర్ జోన్ భూమి కబ్జా,కార్యాలయం లోపల,బయట జరుగుతున్న దోపిడి,అవినీతి అక్రమాల వంటి చాలా విషయాలు బయటపడే అవకాశం ఉందని స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వ కార్యాలయాల్లో ఎవరైనా లంచం డిమాండ్ చేస్తే ప్రజలు వెనుకాడకుండా ఫిర్యాదు చేయవచ్చని అధికారులు పేర్కొంటున్నారు. ఫిర్యాదుదారుల వివరాలను పూర్తిగా గోప్యంగా ఉంచుతామని స్పష్టం చేస్తున్నారు.

జవహర్‌నగర్ డంప్‌యార్డు

తరలించే వరకు పోరాటం

రూ.2-3 వేల కోట్లు వెచ్చిస్తే సమస్యకు శాశ్వత పరిష్కారం

ఆధునిక, కాలుష్య రహిత డంప్‌యార్డు ఏర్పాటు చేయాలి

సీఎం రేవంత్‌రెడ్డి చొరవ చూపాలి: ఎంపీ ఈటల రాజేందర్



హైదరాబాద్ సిటీ, అక్టోబరు 27 (ప్రజాకలం): జవహర్‌నగర్ డంప్‌యార్డును తరలించే వరకు ప్రజల పక్షాన పోరాటం కొనసాగిస్తామని మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ అన్నారు. సమస్యకు శాశ్వత పరిష్కారం చూపేందుకు ప్రభుత్వం రూ. 2-3 వేల కోట్లు కేటాయించి సమగ్ర ప్రాజెక్టు చేపట్టాలని డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రత్యేకంగా సమయం కేటాయించి డంప్‌యార్డు సమస్యకు పరిష్కార మార్గం కనుగొనాలని కోరారు.

తరువాయి 2వ పేజీలో...

చామనపల్లి గ్రామం మొత్తానికి భూసేకరణ పునరావాసం కల్పిస్తాం

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హామీ మేరకు భూసేకరణ - రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్

ధర్మారం, అక్టోబర్ 27:(ప్రజా కలం ప్రతినిధి) మండలంలోని చామనపల్లి గ్రామం లో 7 రోజుల్లో సామాజిక ప్రభావ అంచనా సర్వే పూర్తి చేయుటకు 8 ప్రత్యేక బృందాల ఏర్పాటు ప్రతి ఇంటి నిర్మాణం, చెట్లు, బావులు, ఇతర ఆస్తుల వివరాలతో అంచనాలు 3 నుంచి 4 నెలల్లో భూసేకరణ, పరిహారం, పునరావాస ప్రక్రియ పూర్తి చేసేలా చర్యలు ప్రజలకు నిబంధనల పై అవగాహన కల్పించి, మానవతా దృక్పథంతో ప్రక్రియ పూర్తి చేయాలి మేము గత ప్రభుత్వం పాలకుల మాదిరి ఏదో గాలి మాటలు చెప్పి



తరువాయి 2వ పేజీలో...

రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

ప్రభుత్వ విప్ విజయరమణ రావు – దళారులను నమ్మి మోసపోవద్దు

సన్న వడ్లకు క్వింటాలుకు 500 బోనస్

వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించిన ఎమ్మెల్యే

పెద్దపల్లి,అక్టోబర్ 27: (ప్రజాకలం జిల్లా ప్రతినిధి) రైతులకు సాగునీరు,గిట్టుబాటు ధర కల్పించే విషయంలో ప్రభుత్వం ఎక్కడా రాజీ పడకుండా పనిచేస్తోందని రాష్ట్ర ప్రభుత్వ విప్,పెద్దపల్లి శాసనసభ్యులు చింతకుంట విజయరమణ రావు స్పష్టం చేశారు. మండలంలోని పెద్దకల్వల,తుర్కలమద్దికుంట గ్రామాల్లో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన



తరువాయి 2వ పేజీలో...

తెలంగాణకు పెట్టుబడులపై ఫోకస్

మొదటి పేజీ తరువాయి...

తెలంగాణ విజయాలను ప్రపంచానికి చాటాలి

సాంకేతిక పరిజ్ఞానం, ఔషధ పరిశ్రమ, ఏరోస్పేస్ తదితర రంగాల్లో తెలంగాణ సాధించిన విజయాలను ప్రపంచం దృష్టికి తీసుకెళ్లేలా హైదరాబాద్ నగరవ్యాప్తంగా విస్తృత ప్రచార కార్యక్రమాలు చేపట్టాలని సీఎం సూచించారు. రాష్ట్రంలో అభివృద్ధి చెందిన పరిశ్రమలు, సాంకేతిక సంస్థలు, నూతన ఆవిష్కరణలు, పెట్టుబడులకు అనుకూలమైన వాతావరణాన్ని ప్రతిబింబించేలా ప్రచార సామగ్రిని రూపొందించాలని పేర్కొన్నారు. నగరంలోని పలు ప్రాంతాల్లో డ్రోన్ల ఆధారిత ప్రచార కార్యక్రమాలు నిర్వహించే అవకాశాలను పరిశీలించాలని అధికారులకు సూచించారు. వాతావరణ మార్పులు, కృత్రిమ మేధస్సు (ఏఐ) రంగాల్లో అంతర్జాతీయ స్థాయిలో పేరుపొందిన ప్రముఖులను కూడా గ్లోబల్ సమ్మిట్‌కు ఆహ్వానించాలని ఆదేశించారు.

ఏవీజీసీ రంగానికి ప్రత్యేక ప్రాధాన్యం

యానిమేషన్, విజువల్ ఎఫెక్ట్స్, గేమింగ్, కామిక్స్ (ఏవీజీసీ) రంగాలకు సంబంధించి ప్రత్యేకంగా చేపడుతున్న ఏర్పాట్లను అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. సృజనాత్మక పరిశ్రమలు, డిజిటల్ సాంకేతికత, వినోద రంగాల్లో తెలంగాణకు ఉన్న అవకాశాలను అంతర్జాతీయ ప్రతినిధులకు వివరించేలా కార్యక్రమాలను రూపొందించాలని సీఎం సూచించారు. వివిధ రంగాలకు చెందిన నిపుణులు, పెట్టుబడిదారులు, సంస్థల ప్రతినిధుల మధ్య పరస్పర చర్చలకు, కొత్త భాగస్వామ్యాలకు అవకాశం కల్పించేలా సమ్మిట్ కార్యక్రమాలను నిర్వహించాలన్నారు.

తెలంగాణ సంస్కృతికి అద్దం పట్టేలా ఏర్పాట్లు

గ్లోబల్ సమ్మిట్ ప్రాంగణంలో ఏర్పాటు చేసే డిజైన్లు, అలంకరణలు తెలంగాణ చరిత్ర, సంప్రదాయాలు, సాంస్కృతిక వైభవాన్ని ప్రతిబింబించేలా ఉండాలని ముఖ్యమంత్రి సూచించారు. కాకతీయుల కళా వైభవానికి ప్రతీకగా నిలిచే కాకతీయ కళాతోరణం, ప్రపంచ ప్రఖ్యాతి పొందిన రామప్ప ఆలయ శిల్పకళకు ప్రత్యేక ప్రాధాన్యం ఇవ్వాలని పేర్కొన్నారు. తెలంగాణ ఆడపడుచుల సాంస్కృతిక ప్రతీక అయిన బతుకమ్మ పండుగ విశిష్టతను విదేశీ అతిథులు తెలుసుకునేలా ప్రత్యేక డిజైన్లు, ప్రదర్శనలు, ఇతర ఏర్పాట్లు చేయాలని సూచించారు. ఆధునిక అభివృద్ధితో పాటు తెలంగాణ వారసత్వ సంపదను ప్రపంచానికి పరిచయం చేసేలా సమ్మిట్ ప్రాంగణాన్ని తీర్చిదిద్దాలని స్పష్టం చేశారు. ఈ సమీక్షా సమావేశంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు, ముఖ్యమంత్రి ప్రిన్సిపల్ సెక్రటరీ శేషాద్రి, టీజీఐఐసీ ఎండీ శశాంక, పరిశ్రమల శాఖ ప్రత్యేక కార్యదర్శి కృష్ణాదిత్య, ఇన్వెస్ట్ తెలంగాణ సీఈఓ బి. అజిత్ రెడ్డి, ఐటీ శాఖ డిప్యూటీ సెక్రటరీ డి. అనుదీప్‌తో పాటు పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

పేదల సొంతింటి కల సాకారం చేయడమే ప్రభుత్వ లక్ష్యం

మొదటి పేజీ తరువాయి...

భూ సర్వే నిర్వహణకు సంబంధించి పలువురు తహసీల్దార్లు, సర్వేయర్లతో ముఖాముఖి నిర్వహించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. సర్వే కోసం ఎన్ని గ్రామాలను కేటాయించారు, ఇప్పటివరకు ఎన్ని గ్రామాల్లో సర్వే పూర్తయింది, ఏ విధంగా సర్వే నిర్వహిస్తున్నారు, రోజుకు ఎన్ని ఎకరాల భూమిని సర్వే చేస్తున్నారు, సర్వే పూర్తి చేయడానికి ఎంత సమయం పడుతోంది తదితర అంశాలపై ఆరా తీశారు. సర్వే సమయంలో సంబంధిత రైతుకు తన భూమి ఎంత విస్తీర్ణంలో ఉందో స్పష్టంగా తెలియజేయాలని తహసీల్దార్లు, సర్వేయర్లకు సూచించారు. భూమి విస్తీర్ణం, సరిహద్దులకు సంబంధించిన వివరాలను క్షుణ్ణంగా పరిశీలించి, రైతులకు ఎలాంటి సందేహాలు లేకుండా వివరించాలని పేర్కొన్నారు. తహసీల్దార్ నుంచి జిల్లా కలెక్టర్ వరకు రెవెన్యూ అధికారులు సర్వే ప్రక్రియను క్రమం తప్పకుండా పర్యవేక్షించాలని సూచించారు. క్షేత్రస్థాయిలో సర్వే పనుల పురోగతిని స్వయంగా పరిశీలిస్తూ, రైతుల సమస్యలు, అభిప్రాయాలను తెలుసుకోవాలని ఆదేశించారు. భూ సమస్యల పరిష్కారంలో జాప్యం లేకుండా, రైతులకు ఇబ్బందులు కలగకుండా సంబంధిత అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఏడాదిన్నరలోపు వ్యవసాయ భూములతో పాటు ఆబాదీ ఆస్తుల రీ సర్వేను పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు వెల్లడించారు. తొలి దశలో ప్రతి జిల్లాలో 70 గ్రామాల్లో రీ సర్వే కొనసాగుతోందని, రీ సర్వే జరుగుతున్న గ్రామాల్లో జిల్లా కలెక్టర్లు, రెవెన్యూ అధికారులు క్షేత్రస్థాయిలో విస్తృతంగా పర్యటించాలని సూచించారు. రాష్ట్రంలో అర్హులైన ప్రతి పేద కుటుంబానికి సొంతింటి కల సాకారమయ్యే వరకు విడతలవారీగా ఇళ్ల మంజూరు కొనసాగుతుందని మంత్రి స్పష్టం చేశారు. ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులపై నిర్మాణ వ్యయ భారాన్ని తగ్గించేందుకు సిమెంట్ బ్యాగ్‌ను కేవలం రూ. 230కే అందించేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు.

డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల నిర్మాణ పనులు వేగవంతం

అసంపూర్తిగా ఉన్న డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల నిర్మాణాలను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని మంత్రి ఆదేశించారు. డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల కేటాయింపులు వేగవంతంగా, పూర్తి పారదర్శకంగా, అర్హత ప్రాతిపదికన జరిగేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. సమీక్షకు ముందు పలువురు ప్రజాప్రతినిధులు తమ నియోజకవర్గాల్లో నెలకొన్న భూ సమస్యలు, డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు, ఇందిరమ్మ ఇళ్ల కేటాయింపులకు సంబంధించిన అంశాలను మంత్రి దృష్టికి తీసుకువచ్చారు.

ఆయా సమస్యలను పరిశీలించి పరిష్కరించేందుకు సంబంధిత జిల్లా కలెక్టర్లకు మంత్రి పలు సూచనలు చేశారు. ప్రజాప్రతినిధులు అందించిన సలహాలు, సూచనలను స్వీకరించారు. ఈ సమావేశంలో సి సి ఎల్ ఎ కమీషనర్ లోకేష్ కుమార్, స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ స్పెషల్ సెక్రటరీ రాజీవ్ గాంధీ హనుమంతు, గృహ నిర్మాణ శాఖ మేనేజింగ్ డైరెక్టర్ గౌతమ్, ఎంపీ రఘునందన్ రావు, సురేశ్ షెట్కర్, ఎమ్మెల్సీ అంజిరెడ్డి, ఎమ్మెల్యేలు చింతా ప్రభాకర్, సునీతా లక్ష్మారెడ్డి, మాణిక్‌రావు, కొత్త ప్రభాకర్ రెడ్డి, సంజీవరెడ్డి ,సంగారెడ్డి, సిద్దిపేట, మెదక్ జిల్లాల కలెక్టర్లు ప్రతీక్ జైన్, హైమావతి, ప్రతిమా సింగ్‌లతో పాటు అదనపు కలెక్టర్లు, సబ్ కలెక్టర్, రెవెన్యూ డివిజనల్ అధికారులు, తహసీల్దార్లు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



బీసీ సంక్షేమ శాఖ పథకాల అమలులో

పారదర్శకత, వేగం పెంచాలి

మొదటి పేజీ తరువాయి...

ఈ పథకానికి మహిళల నుంచి మంచి స్పందన లభించిందని, సుమారు 4.80 లక్షల దరఖాస్తులు వచ్చాయని తెలిపారు. నియోజకవర్గానికి వెయ్యి మంది చొప్పున మొత్తం 1.90 లక్షల మంది మహిళలకు లబ్ధి చేకూర్చేలా ప్రణాళిక రూపొందించినట్లు పేర్కొన్నారు. డిసెంబర్ 9న లబ్ధిదారులకు కుట్టు మిషన్లు అందించేలా కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేయాలని, టెండర్ ప్రక్రియతో పాటు ఇతర అవసరమైన పనులను వేగంగా పూర్తి చేయాలని అధికారులకు సూచించారు.

రాజీవ్ యువ వికాసం పథకం కింద వచ్చిన దరఖాస్తుల వివరాలను మంత్రి అడిగి తెలుసుకున్నారు. ఈ పథకం ద్వారా లబ్ధి పొందే వారిలో బీసీలకు తగిన ప్రాధాన్యత కల్పించే అంశంపై ప్రభుత్వంతో చర్చిస్తామని తెలిపారు. రాష్ట్రంలోని 327 మహాత్మా జ్యోతిబా ఫూలే గురుకుల పాఠశాలల్లో ఆర్సీవోలు పర్యటించి మౌలిక సదుపాయాలు, సిబ్బంది, విద్యార్థుల సంఖ్య, ఖాళీలు, సొంత భవనాల స్థితిగతులు తదితర అంశాలపై నివేదికలు అందించినట్లు మంత్రి తెలిపారు. ఈ నివేదికల ఆధారంగా పాఠశాలల్లో ఉన్న సమస్యలను గుర్తించి పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

రాష్ట్రంలోని 327 గురుకుల పాఠశాలల్లో కేవలం 26 పాఠశాలలకు మాత్రమే సొంత భవనాలు ఉండగా, మిగిలిన 301 పాఠశాలలు ప్రైవేట్ భవనాల్లో కొనసాగుతున్నాయని పేర్కొన్నారు. 37 గురుకులాలకు సొంత స్థలాలు ఉన్నందున వాటిలో భవనాల నిర్మాణానికి అనుమతులు, నిధులు మంజూరు చేసే అంశంపై ప్రభుత్వంతో చర్చిస్తామని తెలిపారు. గురుకులాలకు కూడా సొంత భవనాలు నిర్మించేలా చర్యలు తీసుకుంటామని వెల్లడించారు. అధికారులు గురుకుల పాఠశాలలను క్రమం తప్పకుండా సందర్శించాలని, జిల్లా కలెక్టర్లు నెలకు ఒక గురుకుల పాఠశాలను సందర్శించి నివేదిక అందించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. గురుకులాలకు అవసరమైన స్థలాల సేకరణను త్వరగా పూర్తి చేయాలని ప్రిన్సిపల్ సెక్రటరీని ఆదేశించారు.

నవంబర్ మొదటి వారంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, ప్రిన్సిపల్ సెక్రటరీ, కమిషనర్, జిల్లా కలెక్టర్లు, ఆర్సీవోలు, ప్రిన్సిపాళ్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి గురుకులాల సమస్యల పరిష్కారంపై సమీక్షించనున్నట్లు తెలిపారు. గురుకుల పాఠశాలల ప్రిన్సిపాళ్లు, బీసీ సంక్షేమ శాఖ హాస్టల్ వార్డెన్లకు లేఖలు రాసి విద్యార్థులకు ఎల్ నినో ప్రభావం, నీటి పొదుపు, విద్యుత్ వినియోగంలో మితవ్యయం తదితర అంశాలపై అవగాహన కల్పించాలని మంత్రి సూచించారు. విద్యార్థులకు అవగాహన కల్పించడం ద్వారా వారు తమ తల్లిదండ్రులకు కూడా ఈ అంశాలను వివరించే అవకాశం ఉంటుందని తెలిపారు.

బీసీ స్టడీ సర్కిళ్లలో సంస్కరణలు చేపట్టి నిరుద్యోగులకు ఉద్యోగాలే లక్ష్యంగా నాణ్యమైన శిక్షణ అందించేందుకు చర్యలు తీసుకోవాలని మంత్రి ఆదేశించారు. ఈ అంశంపై ఐదుగురు సభ్యుల కమిటీ ఇచ్చిన నివేదిక ఆధారంగా సమర్థవంతమైన డైరెక్టర్ల నియామకానికి చర్యలు తీసుకోవాలని సూచించారు. డైరెక్టర్ల ఎంపిక కోసం ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేసి, యూపీఎస్సీ, గ్రూప్-1 వంటి పోటీ పరీక్షల్లో మెరిట్ సాధించిన వారికి అవకాశాలు కల్పించేలా ఎంపిక ప్రక్రియ చేపట్టాలని తెలిపారు.

బీసీ కార్పొరేషన్ ద్వారా శిక్షణ పొందిన వారికి స్వయం ఉపాధి అవకాశాలు కల్పించేలా కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని మంత్రి సూచించారు. మధిర వంటి నియోజకవర్గంలో పైలట్ ప్రాజెక్టుగా పశువుల పంపిణీ తరహా ఉపాధి పథకాన్ని ప్రారంభించి, లబ్ధిదారుల ఆదాయం పెరిగేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఎంఎస్ఎంఈ పథకం కింద చిన్న, మధ్యతరహా పరిశ్రమల స్థాపనకు వివిధ కుల సంఘాలకు నైపుణ్య శిక్షణ కేంద్రాలు ఏర్పాటు చేసి ఉపాధి అవకాశాలు, ఆర్థిక వృద్ధి పెంపొందించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.

బీసీ వితంతువులు, ఒంటరి మహిళలకు నైపుణ్య శిక్షణ అందించి ఉపాధి అవకాశాలు మెరుగుపరిచేందుకు తీసుకోవాల్సిన చర్యలపై ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేసి నివేదిక సమర్పించాలని ఆదేశించారు. రాష్ట్రంలోని ప్రతి నియోజకవర్గంలో రజకుల కోసం ఆధునిక ధోబీఘాట్లు నిర్మించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు మంత్రి తెలిపారు. ట్యాంక్‌బండ్‌పై బలహీనవర్గాల ఐకాన్‌లుగా నిలిచిన ప్రముఖుల విగ్రహాలకు పేర్లు రాయించే పనులను పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. కాటమయ్య రక్షణ కవచాల పంపిణీపై సమీక్షిస్తూ, శిక్షణ పూర్తి చేసుకున్న లబ్ధిదారులకు వాటిని అందించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. నీరా కేఫ్, నందనవనాల నిర్వహణ, అభివృద్ధి అంశాలపై మంత్రి చర్చించారు. వాటిని అధికారులు స్వయంగా సందర్శించి క్షేత్రస్థాయిలో పరిస్థితులను పరిశీలించాలని ఆదేశించారు.

బీసీ సంక్షేమ శాఖ పరిధిలోని పథకాలు అర్హులైన లబ్ధిదారులకు సమర్థవంతంగా చేరేలా, స్వయం ఉపాధి అవకాశాలు పెరిగేలా, గురుకులాల్లో విద్యార్థులకు మెరుగైన వసతులు కల్పించేలా సమన్వయంతో పనిచేయాలని మంత్రి పొన్నం ప్రభాకర్ అధికారులకు సూచించారు. ఈ సమావేశంలో బీసీ సంక్షేమ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ రాహుల్ బొజ్జ, బీసీ సంక్షేమ శాఖ కమిషనర్ బాలమాయాదేవి, మహాత్మా జ్యోతిబా ఫూలే గురుకులాల కార్యదర్శి సైదులు, అధికారులు మల్లయ్య బట్టు, అలోక్ కుమార్, పద్మ, మామిడి హరికృష్ణ, శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

మొదటి పేజీ తరువాయి...

వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను స్థానిక ప్రజాప్రతినిధులతో కలిసి ఆయన మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే విజయ రమణారావు మాట్లాడుతూ, రైతులు దళారుల చేతుల్లో మోసపోకుండా ఉండేందుకే ప్రభుత్వం ఐకేపీ,సింగిల్ విండో సొసైటీల ద్వారా గ్రామగ్రామాన కొనుగోలు కేంద్రాలను ముందస్తుగానే ప్రారంభిస్తోందని తెలిపారు. రైతులు ఈ కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఒకవేళ బహిరంగ మార్కెట్లో అధిక ధర లభిస్తే అక్కడే అమ్ముకోవచ్చని, కొనుగోలు కేంద్రాల్లో అమ్మితే ప్రభుత్వం నిర్ణయించిన మద్దతు ధర క్వింటాలుకు రూ. 2,462 అందుతుందని పేర్కొన్నారు. దీనికి అదనంగా సన్న రకం వడ్లకు రాష్ట్ర ప్రభుత్వం క్వింటాలుకు 500 బోనస్ అందిస్తుండటంతో మొత్తంగా రైతుకు రూ. 2,962 అందుతుందని తెలిపారు. ధాన్యం విక్రయించిన 48 గంటల్లోనే నగదు నేరుగా రైతుల ఖాతాల్లో జమ అవుతుందని స్పష్టం చేశారు. తూకం వేసే సమయంలో రైతులను ఇబ్బందులకు గురిచేసే సిబ్బందిపై కఠిన చర్యలు ఉంటాయని, అవసరమైతే విధుల్లోంచి తొలగిస్తామని హెచ్చరించారు. నియోజకవర్గ ంలో ఒక్క గుంట పంట కూడా ఎండిపోకుండా సీఎం రేవంత్ రెడ్డి, మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి,శ్రీధర్ బాబు సహకారంతో ఎస్సారెస్పీ ద్వారా పది రోజుల పాటు నీటిని విడుదల చేయించి రైతులను ఆదుకున్నట్లు గుర్తుచేశారు. తుఫాను ప్రభావం నేపథ్యంలో రైతులు ధాన్యం తడవకుండా ముందస్తుగా పాలిథిన్ కవర్లు సిద్ధం చేసుకోవాలని సూచించారు. ఎల్ నినో ప్రభావం దృష్ట్యా,భూగర్భ జలాల లభ్యతను బట్టి రాబోయే వేసవి కాలంలో వరికి బదులు ఆరుతడి పంటలు సాగుచేసి లాభాలు పొందాలని రైతులకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పెద్దపల్లి సింగిల్ విండో చైర్మన్,జిల్లా సహకార అధికారి,సింగిల్ విండో అధికారులు,మండల పార్టీ అధ్యక్షులు,సర్పంచ్‌లు, ఉపసర్పంచ్‌లు, ప్రజాప్రతినిధులు,కాంగ్రెస్ పార్టీ శ్రేణులు,రైతులు,మహిళలు,గ్రామస్తులు పాల్గొన్నారు.

జవహర్‌నగర్ డంప్‌యార్డు తరలించే వరకు పోరాటం

మొదటి పేజీ తరువాయి...

జవహర్‌నగర్ డంపింగ్ యార్డుకు వ్యతిరేకంగా బాధితుల పక్షాన ఈటల రాజేందర్ మంగళవారం 'జన సంకల్ప యాత్ర'కు శ్రీకారం చుట్టారు. నాలుగు రోజులపాటు సుమారు 60 కిలోమీటర్ల మేర ఈ పాదయాత్ర కొనసాగనుంది. భారతీయ జనతా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రామచందర్‌రావు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఎంపీలు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, పార్టీ నాయకులు, స్థానిక ప్రజలు యాత్రలో పాల్గొననున్నారు.

కలుషితమైన ఎదులాబాద్ పెద్దచెరువు

యాత్రలో భాగంగా తొలిరోజు మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా ఘట్‌కేసర్ మండలంలోని ఎదులాబాద్ పెద్దచెరువును ఈటల సందర్శించారు. డంప్‌యార్డు నుంచి వెలువడుతున్న వ్యర్థాల కారణంగా చెరువు కలుషితమై మత్స్య సంపద దెబ్బతిన్నదని స్థానిక మత్స్యకారులు ఆయన దృష్టికి తీసుకెళ్లారు. ఎదులాబాద్ పెద్దచెరువు ఈ ప్రాంతంలోని అతిపెద్ద చెరువుల్లో ఒకటని, గతంలో వేలాది మంది మత్స్యకారులకు ఉపాధి కల్పించేదని ఈటల పేర్కొన్నారు. ప్రస్తుతం చెరువు పరిస్థితి ఆందోళనకరంగా మారిందన్నారు. డంప్‌యార్డు నుంచి వెలువడే 'లీచేట్' నీటిని శుద్ధి చేయకుండా వదలడం వల్ల చేపలు మృత్యువాత పడుతున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేశారని తెలిపారు.

ప్రజారోగ్యంపై ఆందోళన

కలుషిత నీరు బోర్లు, బావుల్లోకి చేరడం వల్ల స్థానికులు అనారోగ్య సమస్యలను ఎదుర్కొంటున్నారని ఈటల పేర్కొన్నారు. కిడ్నీ సంబంధిత వ్యాధులు, క్యాన్సర్, శ్వాసకోశ సమస్యలు, చర్మవ్యాధులు తదితర సమస్యలతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. డంప్‌యార్డు నుంచి వచ్చే దుర్వాసన, కాలుష్యంతో చుట్టుపక్కల ప్రాంతాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. తమ సంపాదనలో ఎక్కువ భాగం వైద్యం, మందులకే ఖర్చవుతోందని స్థానికులు తన వద్ద వాపోయారని తెలిపారు.

'సాంకేతికతను వినియోగించాలి'

ప్రస్తుతం సాంకేతిక పరిజ్ఞానం ఎంతో అభివృద్ధి చెందిందని, చెత్తను శాస్త్రీయంగా నిర్వహించే విధానాలను ప్రభుత్వం అమలు చేయాలని ఈటల సూచించారు. చెత్తను వృథాగా పారబోయకుండా విద్యుత్ ఉత్పత్తి చేయడంతోపాటు సేంద్రీయ ఎరువులు తయారు చేసే విధంగా సమగ్ర ప్రాజెక్టును రూపొందించాలని కోరారు. హైదరాబాద్ చుట్టుపక్కల జనావాసాలకు దూరంగా 20-30 కిలోమీటర్ల పరిధిలో ఆధునిక వ్యర్థ నిర్వహణ కేంద్రాలను ఏర్పాటు చేయాలని సూచించారు. భవిష్యత్తులో ఇలాంటి సమస్యలు తలెత్తకుండా కాలుష్య రహిత సాంకేతికతను వినియోగించాలని అన్నారు.

'డీపీఆర్ సిద్ధం చేయాలి'

గతంలో ఎంపీగా ఉన్న సమయంలో ప్రస్తుత సీఎం రేవంత్‌రెడ్డి జాతీయ హరిత ట్రైబ్యునల్ (ఎన్‌జీటీ), సుప్రీంకోర్టులో డంప్‌యార్డు సమస్యపై కేసులు వేసిన విషయాన్ని ఈటల ప్రస్తావించారు. ప్రస్తుతం ఆయన ముఖ్యమంత్రిగా ఉన్నందున సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాల్సిన బాధ్యత ఉందన్నారు. అఖిలపక్ష నాయకులు కలిసి సమస్యను సీఎం దృష్టికి తీసుకెళ్లినా ఇప్పటి వరకు పూర్తిస్థాయి పరిష్కారం లభించలేదని పేర్కొన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సమన్వయంతో పనిచేసి ప్రజల సమస్యను పరిష్కరించాలని కోరారు. జవహర్‌నగర్, బాలాజీనగర్ ప్రాంతాల ప్రజల జీవితాల్లో మార్పు తీసుకురావడానికి రూ. 2-3 వేల కోట్లు కేటాయిస్తే శాశ్వత పరిష్కారం సాధ్యమవుతుందని ఈటల అన్నారు. కోట్ల టన్నుల చెత్తను శాస్త్రీయ పద్ధతిలో నిర్వహించేలా సమగ్ర డీపీఆర్ (డిటైల్డ్ ప్రాజెక్ట్ రిపోర్ట్) రూపొందించాలని డిమాండ్ చేశారు.

ఉద్యమం ఉధృతం చేస్తాం

జవహర్‌నగర్ డంపింగ్ యార్డుకు వ్యతిరేకంగా గత 12 ఏళ్లుగా జేపీసీ ఆధ్వర్యంలో ప్రజలు పోరాడుతున్నారని ఈటల తెలిపారు. నిబంధనలు పాటించాల్సిందిగా న్యాయస్థానాలు ఆదేశించిన విషయాన్ని ప్రస్తావించారు. ప్రజల ఆరోగ్యం, జీవనోపాధికి సంబంధించిన సమస్యను ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యంతో పరిష్కరించాలని కోరారు. సమస్య పరిష్కారం కాకపోతే లక్షలాది మంది ప్రజలను కలుపుకుని భవిష్యత్తులో ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. మత్స్యకారులు, కులవృత్తులపై ఆధారపడిన ప్రజలకు న్యాయం జరిగే వరకు మల్కాజిగిరి పార్లమెంట్ సభ్యుడిగా వారి తరఫున పోరాడుతానని ఈటల రాజేందర్ స్పష్టం చేశారు.





చామనపల్లి గ్రామం మొత్తానికి భూసేకరణ పునరావాసం కల్పిస్తాం

మొదటి పేజీ తరువాయి...

వెళ్ళిపోయే రకం కాదు ఇచ్చిన ప్రతి హామీని నెరవేరుస్తామని చామన పల్లి గ్రామ ప్రజలు ఎన్నో సంవత్సరాలుగా ఎదుర్కొంటున్న ముంపు సమస్యకు శాశ్వత పరి ష్కారం చూపే దిశగా గ్రామం మొత్తానికి భూసేకరణ చేపట్టి, ప్రభుత్వ నిబంధనల ప్రకారం నష్ట పరిహారం, పునరావాసం, పున రుద్ధరణ (ఆర్‌అండ్‌ఆర్) ప్యాకేజీ అమలు చేస్తామని రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ తెలిపారు. మంగళవారం రోజున ధర్మారం మండలం చామనపల్లి గ్రామ పంచాయతీ కార్యాలయ ఆవరణ లో జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్షతో కలిసి నిర్వహించిన గ్రామసభ లో మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ గత అనేక సంవత్సరాలుగా భారీ వర్షాలు కురిసినప్పుడు, నీటిని ఎత్తిపోసే సమయం లో చామనపల్లి గ్రామ ప్రజలు ముంపు సమస్యల తో ఇబ్బందులు ఎదు ర్కొంటున్నారని మంత్రి తెలిపారు. 2006లో ధర్మారం మండలం నుంచి జడ్పీటీసీగా తన రాజకీయ ప్రస్థానం ప్రారంభమైందని ఈ ప్రాంతంలోని గ్రామాల తో తనకు సుమారు 25 సంవత్సరాల అనుబంధం ఉందని మంత్రి లక్ష్మణ్ కుమార్ పేర్కొన్నారు. సాధారణంగా నిబంధనల ప్రకారం పూర్తి స్థాయి నీటి మట్టం (ఎఫ్‌టీఎల్) నుంచి 100 మీటర్ల పరిధిలో భూసేకరణ చేపట్టే అవకాశం ఉన్నప్పటికీ, చామనపల్లి గ్రామ ప్రజల సమస్యను దృష్టిలో ఉంచు కొని తొలిసారిగా ఆ పరిమితికి మించి గ్రామం మొత్తానికి భూసేకరణ చేపట్టేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని మంత్రి వివరించారు.

ముఖ్యమంత్రి హామీ మేరకు భూసేకరణ

ఎన్నికల సమయం లో ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టంగా సూచించారని మంత్రి తెలిపారు. చామనపల్లి గ్రామం మొత్తానికి భూసేకరణ చేపట్టాలనే నిర్ణయం తీసుకున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, నీటిపారుదల శాఖ మంత్రి కి కృతజ్ఞతలు తెలిపారు. ప్రజలకు ఇచ్చిన హామీని నెరవేర్చే దిశగా ప్రభుత్వం చర్యలు చేపట్టిందని పేర్కొన్నారు. గత 10 సంవత్సరాలుగా ఎదురు చూస్తున్న ఈ కార్యక్రమం ఇప్పుడు కార్యరూపం దాల్చుతోందని, దీనిని విజయవంతంగా పూర్తి చేసేందుకు గ్రామ ప్రజలు అందరూ అధికారులకు పూర్తి సహకారం అందించాలని కోరారు. భూసేకరణ, ఆర్‌అండ్‌ఆర్ ప్రక్రియకు సంబంధించిన నిబంధనలు, పరిహారం, పునరావాసానికి సంబంధించిన అంశాలపై ప్రజలకు స్పష్టమైన అవ గాహన కల్పించాలని అధికారులకు సూచించారు. భూసేకరణ ప్రక్రియలో చిన్న చిన్న సమస్యలు ఎదురైతే వాటిని నిబంధనల ప్రకారం పరిష్కరించాలని మంత్రి తెలిపారు. ఈ అంశంలో రాజకీయాలకు తావు లేకుండా ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. గ్రామ ప్రజల తో తనకు దీర్ఘకాల అనుబంధం ఉందని, ప్రజల సమస్యల ను అర్థం చేసుకొని అధికారులు మానవతా దృక్పథంతో వ్యవహ రించాలని సూచించారు. గ్రామం లోని ప్రతి కుటుబానికి న్యాయం జరిగేలా చూడాలని, భూసేకరణ, పరిహారం, పునరావాసం విషయం లో ప్రజలకు ఎలాంటి సందేహాలు ఉన్నా వాటిని నివృత్తి చేయాలని మంత్రి స్పష్టం చేశారు. ఈ ప్రక్రియ ను అందరూ కలిసి సమన్వయం తో పూర్తి చేయాలని మంత్రి కోరారు.

టీటీడీ కళ్యాణ మండపంలో సౌకర్యాలు కల్పించాలి

ఈ-దర్శన్ టోకెన్ కౌంటర్‌ను పునరుద్ధరించాలి
బీజేపీ మెట్‌పల్లి పట్టణ అధ్యక్షుడు దోనికెల నవీన్



మెట్‌పల్లి టౌన్ ప్రతినిధి అక్టోబర్ 27 (ప్రజకలం):- పట్టణంలోని టీటీడీ కళ్యాణ మండపంలో అవసరమైన సౌకర్యాలు కల్పించి, సామాన్య ప్రజలకు అందుబాటు ధరల్లో శుభకార్యాలు నిర్వహించుకునే అవకాశం కల్పించాలని బీజేపీ మెట్‌పల్లి పట్టణ అధ్యక్షుడు దోనికెల నవీన్ కోరారు.మంగళవారం ఆయన పార్టీ నాయకులతో కలిసి కళ్యాణ మండపాన్ని సందర్శించి, అక్కడి పరిస్థితులను పరిశీలించారు. పెరుగుతున్న ధరలు, ప్రైవేట్ ఫంక్షన్ హాళ్ల అధిక అద్దెల కారణంగా సామాన్య, మధ్యతరగతి కుటుంబాలు వివాహాలు, ఇతర శుభకార్యాలు నిర్వహించుకోవడానికి ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని నవీన్ పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో టీటీడీ కళ్యాణ మండపంలో మౌలిక సదుపాయాలను మెరుగుపరిచి, ప్రజలకు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను కోరారు. అదేవిధంగా, గతంలో కళ్యాణ మండపం వద్ద ఏర్పాటు చేసిన ఈ-దర్శన్ టోకెన్ కౌంటర్‌ను తిరిగి ప్రారంభించాలని కోరారు. గతంలో ఈ కౌంటర్ ద్వారా భక్తులకు రూ. 300 ప్రత్యేక ప్రవేశ దర్శనం టికెట్లు అందుబాటులో ఉండేవని, ప్రస్తుతం ఆ సౌకర్యం లేకపోవడంతో స్థానిక భక్తులకు ఇబ్బందులు ఎదురవుతున్నాయని పేర్కొన్నారు. భక్తుల సౌకర్యార్థం కౌంటర్‌ను పునరుద్ధరించాలని విజ్ఞప్తి చేశారు. సంబంధిత అధికారులు స్పందించి కళ్యాణ మండపం అభివృద్ధికి, దర్శన టికెట్ల సౌకర్యం పునరుద్ధరణకు చర్యలు తీసుకోవాలని నవీన్ కోరారు. ప్రజలు, భక్తులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి బీజేపీ మెట్‌పల్లి పట్టణ శాఖ కృషి చేస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ పట్టణ ప్రధాన కార్యదర్శులు జూంగుల అనిల్ గౌడ్, బత్తుల జగదీశ్వర్, పట్టణ ఉపాధ్యక్షుడు గుంటుక హనుమండ్లు, ఐటీ సెల్ కన్వీనర్ పాసికంటి శ్రీనివాస్, ఓబీసీ మోర్చా అధ్యక్షుడు సంకు ప్రసాద్, బొమ్మన రామస్వామి, మొగిలిపాక హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

నీటి వృధాను అరికట్టాలి

మున్సిపల్ చైర్మెన్ మైలారపు లింబాద్రి

మెట్‌పల్లి టౌన్ ప్రతినిధి అక్టోబర్ 27 (ప్రజకలం):-వాసవి క్లబ్ గ్రేటర్ మెట్‌పల్లి ఆధ్వర్యంలో నీటి పొదుపుపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నీటి పొదుపుపై ముద్రించిన స్టిక్కర్లు, కరపత్రాలను మెట్‌పల్లి మున్సిపల్ చైర్మన్ మైలారపు లింబాద్రి ఆవిష్కరించారు.ఈ సందర్భంగా నీటిని వృథా చేయకుండా పొదుపుగా వినియోగించాలని, భవిష్యత్ తరాలకు



నీటి కొరత రాకుండా ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని అవగాహన కల్పించేలా కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఆర్య వైశ్య సంఘం అధ్యక్షుడు మైలారపు రాంబాబు, వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ జోన్ చైర్మన్ కోట కిరణ్ కుమార్, వాసవి క్లబ్ గ్రేటర్ మెట్‌పల్లి అధ్యక్షుడు కొండూరి రాజేశ్, కార్యదర్శి గుండె శివకుమార్, కోశాధికారి కోటగిరి సంతోశ్, కోట సతీశ్, పుల్లూరి సనత్, మహాజన్ రామకృష్ణ పాల్గొన్నారు.

భీమినిలో శ్రీరామ సేవా సమితి ఆధ్వర్యంలో

ఉచిత కంటి,వైద్య శిబిరం

వైద్య శిబిరం ఏర్పాటు చేసిన శ్రీరామ సేవ సమితిని అభినందించిన మాజీ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య...



బెల్లంపల్లి, అక్టోబర్ 27, (ప్రజాకలం) ప్రతినిధి...

మంచిర్యాల జిల్లా,భీమిని మండల కేంద్రంలో శ్రీరామ సేవా సమితి అధ్యక్షులు పోతురాజుల లక్ష్మణ్ ఆధ్వర్యంలో ఉచిత కంటి, వైద్య శిబిరం నిర్వహించారు. బెల్లంపల్లి నియోజకవర్గ మాజీ శాసనసభ్యులు దుర్గం చిన్నయ్య ముఖ్య అతిథిగా హాజరయ్యారు.శిబిరంలో అందించిన కంటి, వైద్య సేవలను ప్రజలను మాజీ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య అడిగి తెలుసుకున్నారు.వైద్య శిబిరాని ఏర్పాటు చేసిన శ్రీరామ సేవాసమితిని అభినందించారు. మాజీ ఎమ్మెల్యే చిన్నయ్య మాట్లాడుతూ పేద ప్రజలకు ఉచితంగా కంటి పరీక్షలు నిర్వహించి,అవసరమైన వారికి ఉచితంగా శస్త్ర చికిత్సలు నిర్వహించడం,బిపి,షుగర్ పరీక్షలు నిర్వహించడం చాలా గొప్ప విషయం అన్నారు.ప్రజల ఆరోగ్య పరిరక్షణకు ఇటువంటి సేవా కార్యక్రమాలు ఎంతగానో దోహదపడతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో కిమ్స్ హాస్పిటల్ కాగజ్ నగర్ ప్రముఖ వైద్యులు డాక్టర్ కొత్తపల్లి శ్రీనివాస్,కాగజ్ నగర్ మున్సిపల్ వైస్ చైర్మన్ డాక్టర్ కొత్తపల్లి అనిత,భీమిని బి.ఆర్.ఎస్ మండల అధ్యక్షులు నిరంజన్ గుప్తా,భీమిని సర్పంచ్ శ్రీకాంత్ గౌడ్ ,బారాస నాయకులు పోతురాజుల రాజయ్య, బలగం సంతోష్,సుదర్శన్ గౌడ్, మాజీ వైస్ ఎంపీపీ మహేష్ గౌడ్,రమేష్,యువ నాయకులు చరణ్, మహేష్ గౌడ్,కుసుమ సతీష్,ఆకుల రాజేశం,రాకేష్ తదితర మండల నాయకులు పాల్గొన్నారు.

భూముల రీ-సర్వే ప్రక్రియను

పకడ్బందీగా నిర్వహించాలి

- జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్



మెట్ పల్లి(కోరుట్ల)ప్రతినిధి అక్టోబర్ 27(ప్రజా కలం)

జిల్లాలో జరుగుతున్న రీ-సర్వే పనులు పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ అధికారులను ఆదేశించారు. కోరుట్ల మండలం ధర్మారం గ్రామంలో నిర్వహిస్తున్న భూముల రీ-సర్వే ప్రక్రియను మంగళవారం జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. గ్రామంలో జరుగుతున్న రీ-సర్వే పనుల పురోగతిని, సర్వే నిర్వహిస్తున్న విధానాన్ని సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ భూముల రీ-సర్వే ప్రక్రియను నిబంధనల ప్రకారం పారదర్శకంగా, పకడ్బందీగా నిర్వహించాలని అధికారులకు సూచించారు. సర్వే సమయంలో భూముల హద్దులు, భూ యజమానుల వివరాలు, అందుబాటులో ఉన్న భూ రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించాలని తెలిపారు. సర్వే ప్రక్రియలో ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా ప్రతి అంశాన్ని జాగ్రత్తగా పరిశీలించి, భూములకు సంబంధించిన వివరాలను సక్రమంగా నమోదు చేయాలని సూచించారు. రీ-సర్వే ద్వారా భూముల వివరాలు, సరిహద్దులకు సంబంధించిన అంశాలను క్షేత్రస్థాయిలో పరిశీలించి, రికార్డుల్లో ఉన్న వివరాలతో సరిపోల్చుకోవాలని అధికారులకు తెలిపారు. సర్వే నిర్వహణలో ఎదురయ్యే సమస్యలను గుర్తించి, నిబంధనల ప్రకారం పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. రీ-సర్వే పనులను సమన్వయంతో నిర్వహిస్తూ, ప్రక్రియ సజావుగా జరిగేలా సంబంధిత రెవెన్యూ, సర్వే అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని కలెక్టర్ ఆదేశించారు. గ్రామస్థాయిలో భూములకు సంబంధించిన వివరాల పరిశీలనలో పారదర్శకత పాటిస్తూ, ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా రీ-సర్వే ప్రక్రియను నిర్వహించాలని తెలిపారు. సర్వే పనుల పురోగతిని ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ, నిర్దేశించిన విధానాల ప్రకారం పనులు చేపట్టాలని అధికారులకు సూచించారు.ఈ కార్యక్రమంలో కోరుట్ల ఆర్డీవో జీవాకర్ రెడ్డి, తహసీల్దార్, సర్వే అధికారులు పాల్గొన్నారు.

ఎల్‌నినో ప్రభావాన్ని దృష్టిలో ఉంచుకొని

నీటి సంరక్షణకు ప్రాధాన్యత ఇవ్వాలి

జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ - ఫామ్ పాండ్స్ ద్వారా నీటిని నిల్వ చేసుకొని పంటలను కాపాడుకోవాలి



మెట్ పల్లి (కోరుట్ల)ప్రతినిధి, అక్టోబర్ 27:రానున్న ఆరు నెలల్లో ఎల్‌నినో ప్రభావం కారణంగా తాగునీరు, సాగునీటి కొరత ఏర్పడే అవకాశాలు ఉన్నందున నీటి సంరక్షణకు ముందస్తు చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ అన్నారు. మంగళవారం కోరుట్ల మండలం ధర్మారం గ్రామంలో ఓ రైతు తన మామిడి తోటలో ఏర్పాటు చేసుకుంటున్న ఫామ్ పాండ్‌ను, జిల్లా కలెక్టర్ పరిశీలించారు. రానున్న వేసవిలో నీటి కొరత ఏర్పడకుండా వర్షపు నీటిని ఒడిసిపట్టి నిల్వ చేసుకోవడం ఎంతో అవసరమని తెలిపారు.కోరుట్ల మండల పరిధిలో సుమారు రెండు లక్షల ఎకరాల వ్యవసాయ భూములకు నీటి లభ్యతను మెరుగుపరిచే లక్ష్యంతో మొత్తం 75 ఫామ్ పాండ్స్ మంజూరు చేయగా, ఇప్పటివరకు 12 పూర్తయ్యాయని తెలిపారు. మిగిలిన ఫామ్ పాండ్స్ పనులను రానున్న నెల రోజుల్లో పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. మధ్యమధ్యలో చిరుజల్లుల రూపంలో వర్షాలు కురిసినా, ఆ నీటిని ఫామ్ పాండ్స్‌లో నిల్వ చేసుకోవడం ద్వారా భవిష్యత్తులో పంటలకు కొంతమేర నీటిని అందించే అవకాశం ఉంటుందని వివరించారు.ఐదు ఎకరాల భూమి కలిగిన రైతులు తమ వ్యవసాయ క్షేత్రాల్లో సుమారు రెండు గుంటల విస్తీర్ణంలో ఫామ్ పాండ్ ఏర్పాటు చేసుకుంటే నీటి ఎద్దడి సమయంలో ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని కలెక్టర్ సూచించారు. భూగర్భ జలాలు తగ్గినప్పుడు, వర్షాలు లేక పంటలు ఎండిపోయే పరిస్థితులు ఏర్పడినప్పుడు ఈ నీటి నిల్వలు రైతులకు అండగా నిలుస్తాయని తెలిపారు.ప్రస్తుత పరిస్థితుల్లో శ్రీరాంసాగర్ ప్రాజెక్టు (ఎస్సారెస్పీ) నుంచి సాగునీరు వచ్చే అవకాశం లేనందున రైతులు నీటి వినియోగంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. వరి, చెరకు వంటి అధిక నీటి అవసరం ఉన్న పంటలకు బదులుగా ప్రత్యామ్నాయ పంటల సాగుపై దృష్టి సారించాలని అన్నారు. నీటి లభ్యతను దృష్టిలో ఉంచుకొని పంటల ఎంపిక చేసుకోవడం ద్వారా నీటి కొరత ప్రభావాన్ని తగ్గించుకోవచ్చని పేర్కొన్నారు. అనంతరం ధర్మారం గ్రామంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలను జిల్లా కలెక్టర్ పరిశీలించారు. పాఠశాలలోని విద్యార్థుల మరుగుదొడ్లు, బోరు, అంగన్‌వాడీ కేంద్రం, వంటశాలను పరిశీలించి, విద్యార్థులకు పరిశుభ్రమైన వాతావరణంలో అన్ని సౌకర్యాలు అందుబాటులో ఉండేలా చూడాలని అధికారులకు సూచించారు. విద్యార్థులకు నాణ్యమైన ఆహారాన్ని నిర్ణీత మెనూ ప్రకారం అందించాలని, భోజనం తయారీలో పరిశుభ్రత పాటించాలని ఆదేశించారు.ఈ కార్యక్రమంలో కోరుట్ల ఆర్డీవో జీవాకర్ రెడ్డి, డీఆర్‌డీఓ రఘువరన్, ఎంపీడీవో, తహసీల్దార్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

బాలికల భద్రతపై న్యాయ అవగాహన

పోక్సో చట్టంపై విద్యార్థినులకు అవగాహన.. గుడ్ టచ్-బ్యాడ్ టచ్‌పై ప్రత్యేక బోధన



జగిత్యాల ప్రతినిధి అక్టోబర్ 27 (ప్రజా కలం)

బాలలపై లైంగిక నేరాలను అరికట్టడంతో పాటు, బాలికలకు వ్యక్తిగత భద్రతపై అవగాహన కల్పించడమే లక్ష్యంగా జగిత్యాల బాలికల ఉన్నత పాఠశాలలో మంగళవారం పోక్సో చట్టం-2012పై న్యాయ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ సివిల్ జడ్జి నాగేశ్వరరావు పోక్సో చట్టంలోని ముఖ్యమైన నిబంధనలు, బాలల హక్కులు, లైంగిక నేరాల నుంచి రక్షణ పొందేందుకు తీసుకోవాల్సిన చట్టపరమైన చర్యలను వివరించారు. బాలల భద్రతకు చట్టాలు కల్పిస్తున్న రక్షణ గురించి విద్యార్థినులకు ఈ సందర్భంగా అవగాహన కల్పించారు.రెండవ అదనపు ప్రథమ శ్రేణి న్యాయమూర్తి నిక్షిష మాట్లాడుతూ గుడ్ టచ్-బ్యాడ్ టచ్, వ్యక్తిగత భద్రత, అనుచిత ప్రవర్తనను గుర్తించడం వంటి అంశాలపై విద్యార్థినులకు అవగాహన కల్పించారు. తమకు ఎదురయ్యే వేధింపులు లేదా అసురక్షిత పరిస్థితుల గురించి భయపడకుండా తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు లేదా సంబంధిత అధికారులకు తెలియజే యాలని సూచించారు. ఈ సందర్భంగా విద్యార్థినులతో ప్రతిజ్ఞ చేయించారు. తమను తాము, ఇతర బాలలను రక్షించుకోవడం, వ్యక్తిగత హద్దులను గౌరవించడం, వేధింపులపై ధైర్యంగా స్పందించడం, అసురక్షిత పరిస్థితులు ఎదురైనప్పుడు నమ్మకమైన పెద్దలకు తెలియజేయడం వంటి అంశాలపై ప్రతిజ్ఞ చేయించారు.బాలల రక్షణ చట్టాలపై అవగాహన పెంపొందించడంతో పాటు, బాలలపై జరిగే నేరాల నివారణలో విద్యాసంస్థలు, తల్లిదండ్రులు, సమాజం కీలక పాత్ర పోషించాలని ఈ కార్యక్రమం ద్వారా తెలియజేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, ఇతర సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాద బాధితులకు

పీఎం రహత్ పథకం భరోసా

రూ.1.5 లక్షల వరకు నగదు రహిత వైద్యం..
జగిత్యాల జిల్లాలో 30 ఆసుపత్రుల్లో సేవలు



జగిత్యాల ప్రతినిధి అక్టోబర్ 27 (ప్రజా కలం) రోడ్డు ప్రమాదాల్లో గాయపడిన బాధితులకు సకాలంలో వైద్య చికిత్స అందించి ప్రాణాలను కాపాడే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పీఎం రహత్ పథకాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ సూచించారు. జగిత్యాల జిల్లాలోని 30 ఆసుపత్రుల్లో ఈ పథకం కింద వైద్య సేవలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. అర్హత నిబంధనలకు అనుగుణంగా గరిష్ఠంగా రూ.1.5 లక్షల వరకు, ఏడు రోజుల పాటు నగదు రహిత వైద్య చికిత్స పొందే అవకాశం ఉందని పేర్కొన్నారు. రోడ్డు ప్రమాదం జరిగిన వెంటనే క్షతగాత్రులకు వైద్య సహాయం అందించడం అత్యంత కీలకమని ఎస్పీ తెలిపారు. ప్రమాద బాధితులను సమీప ఆసుపత్రికి తరలించి, అత్యవసర చికిత్స అందేలా ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. బాధితులను ఆదుకోవడంలో నిర్లక్ష్యం చేయకుండా మానవతా దృక్పథంతో ముందుకు రావాలని సూచించారు. అత్యవసర పరిస్థితుల్లో 112 నంబర్‌కు కాల్ చేసి పోలీసుల సహాయం పొందవచ్చని తెలిపారు. అదేవిధంగా రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని సూచించారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించాలని, కార్లలో ప్రయాణించేవారు సీటు బెల్టు పెట్టుకోవాలని, అతివేగం, మద్యం సేవించి వాహనాలు నడపడం వంటి ప్రమాదకర చర్యలకు దూరంగా ఉండాలని ఎస్పీ అశోక్ కుమార్ కోరారు.

బెల్లంపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో

విద్యార్థులకు ఉచిత ఏకరూప దుస్తుల పంపిణీ



బెల్లంపల్లి,అక్టోబర్ 27, (ప్రజా కలం) ప్రతినిధి.. బెల్లంపల్లి పట్టణంలోని తెలంగాణ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో(కో-ఎడ్యుకేషన్) మంగళవారం విద్యార్థులకు ప్రిన్సిపల్ ఆవునూరి అంజయ్య ఉచిత ఏకరూప దుస్తులను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ దసరా సెలవుల అనంతరం విద్యార్థులందరూ కళాశాలకు క్రమం తప్పకుండా హాజరై, ప్రభుత్వం అందిస్తున్న ఉచిత ఏకరూప దుస్తులు, పాఠ్యపుస్తకాలు, నోట్‌బుక్స్, బ్యాగులు వంటి సదుపాయాలను సద్వినియోగం చేసుకుంటూ శ్రద్ధగా చదువుకోవాలని సూచించారు.అలాగే కళాశాలలో అందిస్తున్న ఉచిత అల్పాహారం,మధ్యాహ్న భోజనం వంటి సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకొని,మంచి విద్యా ఫలితాలు సాధించాలని విద్యార్థులకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కళాశాల లైబ్రేరియన్ నరేంద్ర కుమార్, అధ్యాపకులు గురుపాదం,సోమయ్య,శ్రీ ఎం చంద్రయ్య ,నరేష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భీమా పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

- బ్యాంకు మేనేజర్ రామ్ కుమార్



గొల్లపల్లి అక్టోబర్ 27 ప్రజా కలం ప్రతినిధి గొల్లపల్లి మండలంలోని బ్యాంకు ఖాతాదారులు ప్రభుత్వ భీమా పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని జగిత్యాల లీడ్ బ్యాంకు మేనేజర్ రాంకుమార్ అన్నారు. గొల్లపల్లి మండలంలోని రాఘవపట్నం గ్రామంలో యూనియన్ బ్యాంక్ ఆధ్వర్యంలో భీమా పథకాలు కేవైసీ పై మహిళా సంఘాల సభ్యులకు ఖాతాదారులకు మంగళవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి ఒక్క ఖాతాదారుడు భీమా చేయించుకోవాలని పిఎం జీవన్ జ్యోతి, పిఎం జీవన సురక్ష, అటల్ పెన్షన్ యోజన వంటి పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. భీమా చేసినట్లయితే మరణించిన వ్యక్తి కుటుంబానికి రెండు లక్షల పరిహారం అందుతుందని బ్యాంక్ ఖాతాదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. తమ ఖాతాలు కేవైసీ చేయించుకోవాలన్నారు. ఇటీవల గ్రామంలోని ఉత్తేం మమత అనారోగ్యంతో మృతి చెందగా ఆమెకు జీవనజ్యోతి ఇన్సూరెన్స్ ఉండడం వల్ల ఆ కుటుంబానికి రెండు లక్షల భీమా చెక్కును అందించారు. సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని ఎవరైనా పరిచయం లేని వ్యక్తులు పంపిన లింక్ ఓపెన్ చేయడం,ఓటిపి అడిగితే చెప్పవద్దని ఏదైనా సమస్య ఉంటే నేరుగా బ్యాంకుకు వచ్చి పరిష్కరించుకోవాలని సూచించారు. చిన్నపిల్లలకు ఫోన్లు ఇవ్వకూడదని దానివల్ల డబ్బులు పోయే ప్రమాదం ఉందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బ్యాంకు మేనేజర్ అవినాష్, ఉప సర్పంచ్ రవి, మాజీ సర్పంచులు అరవింద్ గౌడ్ , తిరుపతి గౌడ్, ఎపిఎం శ్రీనివాస్, ఎఫ్ ఎల్ సి మధుసూదన్, పీఎఫ్ ఎల్ లు రమేష్, వెంకటేష్,విజయ్, మహిళ సంఘాల సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

2024 డీఎస్సీ ఉపాధ్యాయులకు ప్రొబేషన్ డిక్లేర్ చేయాలి

రెండో ఇంక్రిమెంట్ మంజూరు చేయాలి -టి.ఎస్.యు.టి.ఎఫ్. వినతి



జగిత్యాల్ ప్రతినిధి అక్టోబర్ 27 (ప్రజా కలం)

2024 డీఎస్సీ ద్వారా ఉపాధ్యాయులుగా నియమితులైన వారికి ప్రొబేషన్ డిక్లేర్ చేసి, రెండో ఇంక్రిమెంట్‌ను వెంటనే మంజూరు చేయాలని టీఎస్‌యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు తిరుకోవెల శ్యామ్ సుందర్, అంబటి భూమేశ్వర్ కోరారు. ఈ మేరకు వారు జిల్లా విద్యాధికారి కెలవత్ రామును కలిసి వినతిపత్రం సమర్పించారు. 2024 డీఎస్సీలో ఎంపికై ఉపాధ్యాయులుగా నియామకమైన వారికి ప్రొబేషన్ ప్రకటించి, రెండో ఇంక్రిమెంట్ మంజూరు చేసేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. అలాగే జిల్లాలో ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న ఇతర పెండింగ్ సమస్యలను కూడా పరిష్కరించాలని జిల్లా విద్యాధికారిని కోరారు.

ప్రజా కలం
బుధవారం, అక్టోబర్ 28, 2026

ఆర్థిక క్రమశిక్షణతోనే రాష్ట్రాల సహకారానికి బలం

రాష్ట్రాల మధ్య ఆర్థిక సహకారం పెట్టుబడులకు, ఉపాధికి కొత్త అవకాశాలు కల్పిస్తుంది. అయితే ఆ సహకారం నిలకడగా సాగాలంటే ప్రతి రాష్ట్రానికీ బలమైన ఆర్థిక పునాది అవసరం. ఆదాయానికి మించి పెరుగుతున్న వ్యయం, వడ్డీ చెల్లింపుల భారం, పూర్తికాని ప్రాజెక్టుల్లో నిలిచిపోయే నిధులు అభివృద్ధికి అందుబాటులో ఉండే వనరులను తగ్గిస్తాయి. అందుకే ఉమ్మడి అభివృద్ధి లక్ష్యాలతోపాటు ఆర్థిక నిర్వహణకూ ప్రాధాన్యం ఇవ్వాలి. దక్షిణాది రాష్ట్రాల సహకార ప్రతిపాదనను ఈ దృష్టితో చూడాలి. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, తమిళనాడు, కర్ణాటక, కేరళలకు సాంకేతికత, తయారీ, సేవలు, ఓడరేవులు వంటి రంగాల్లో ప్రత్యేక సామర్థ్యాలున్నాయి. వీటిని అనుసంధానిస్తే ఉత్పత్తి నుంచి మార్కెట్ వరకు వ్యయాన్ని తగ్గించవచ్చు. ఒక రాష్ట్రంలోని పరిశ్రమలకు మరో రాష్ట్రంలోని మౌలిక సదుపాయాలు ఉపయోగపడవచ్చు. ఉమ్మడి రవాణా మార్గాలు, విద్యుత్తు అనుసంధానం, నైపుణ్య శిక్షణ ద్వారా పరస్పర ప్రయోజనం సాధించవచ్చు. అయితే సహకారం ఫలించాలంటే ప్రాజెక్టులను ఎంపిక చేసే దశలోనే ఆర్థిక సాధ్యాసాధ్యాలను పరిశీలించాలి. ఎంత ఖర్చవుతుంది, ఎవరు ఎంత భరిస్తారు, ఏ ప్రయోజనం కలుగుతుంది, నిర్వహణ బాధ్యత ఎవరిది అనే అంశాలను నిర్ణయించాలి. ఒకే తరహా సదుపాయాల కోసం రాష్ట్రాలు విడివిడిగా భారీ వ్యయం చేయడం కంటే, అవసరమైనచోట ఉమ్మడిగా వినియోగించుకునే అవకాశాలను పరిశీలించాలి. దీనివల్ల ప్రజాధనం ఆదా కావడంతోపాటు ప్రాజెక్టుల ఉపయోగం పెరుగుతుంది. ఆర్థిక బలాన్ని పెంచుకోవడంలో అప్పుల నిర్వహణ కీలకం. రుణంతో నిర్మించే సదుపాయం ఉత్పత్తిని, ఉపాధిని లేదా ప్రజాసేవలను ఎంతవరకు మెరుగుపరుస్తుందో అంచనా వేయాలి. వడ్డీ, అసలు చెల్లింపులకు భవిష్యత్తు ఆదాయం సరిపోతుందో పరిశీలించాలి. ప్రభుత్వ సంస్థల ద్వారా తీసుకునే రుణాలు, ప్రభుత్వం ఇచ్చే హామీలతో సహా మొత్తం బాధ్యతలను స్పష్టంగా చూపాలి. అప్పులపై పూర్తి అవగాహన ఉన్నప్పుడే కొత్త వ్యయంపై సరైన నిర్ణయం సాధ్యమవుతుంది. అప్పు తీసుకుని ప్రారంభించిన ప్రాజెక్టు ఆలస్యమైతే నిర్మాణ వ్యయంతోపాటు వడ్డీ భారం పెరుగుతుంది. అందుకే కొత్త పనుల ప్రకటనకు ముందు కొనసాగుతున్న పనులను పూర్తిచేసే సామర్థ్యాన్ని చూడాలి. పూర్తయిన సదుపాయాల నిర్వహణకు కూడా నిధులు కేటాయించాలి. నిర్మించిన రహదారి, సాగునీటి వ్యవస్థ, పారిశ్రామిక వసతి సక్రమంగా పనిచేసినప్పుడే పెట్టిన పెట్టుబడికి ప్రయోజనం ఉంటుంది. సంక్షేమ వ్యయాన్ని కూడా ఫలితాల ఆధారంగా సమీక్షించాలి. అవసరమైన కుటుంబానికి అందే సాయం వారి ఆరోగ్యాన్ని, విద్యను, జీవన భద్రతను మెరుగుపరచాలి. అర్హుల గుర్తింపు, సకాలంలో చెల్లింపులు, పథకాల మధ్య సమన్వయంతో వ్యయాన్ని సమర్థంగా నిర్వహించవచ్చు. ఆదా అయిన వనరులను పాఠశాలలు, ఆసుపత్రులు, తాగునీరు వంటి దీర్ఘకాలిక అవసరాలకు వినియోగించాలి. ఆదాయం పెంచుకోవడానికి ఆర్థిక కార్యకలాపాలు విస్తరించాలి. అనుమతుల్లో స్పష్టత, సకాలంలో ప్రభుత్వ చెల్లింపులు, నమ్మకమైన విద్యుత్తు, మెరుగైన రవాణా చిన్న పరిశ్రమలకూ ఉపయోగపడతాయి. రాష్ట్రాలు పరస్పర అనుభవాలను పంచుకుంటూ సేవల నిర్వహణను మెరుగువరచుకోవచ్చు. పెట్టుబడులను ఆకర్షించే ప్రయత్నాలకు నైపుణ్యంతో కూడిన కార్మికశక్తి తోడైతే ఉపాధి పెరుగుతుంది. రాష్ట్రాల సహకారానికి కొలమానం ఒప్పందాల సంఖ్య కాదు; ప్రజలకు అందిన ప్రయోజనం కావాలి. సరకు రవాణా వ్యయం తగ్గిందా, కొత్త ఉద్యోగాలు వచ్చాయా, సేవలు మెరుగయ్యాయా అన్నది పరిశీలించాలి. ఉమ్మడి ప్రాజెక్టుల పురోగతిని క్రమంగా సమీక్షించి, అవసరమైన సవరణలు చేయాలి. రాష్ట్రాల మధ్య సమాచార మార్పిడి, సమన్వయం నిర్ణయాలకే పరిమితం కాకుండా అమలు వరకు కొనసాగాలి. పారదర్శక లెక్కలు, బాధ్యతాయుతమైన అప్పులు, ఫలితాలనిచ్చే వ్యయం రాష్ట్రాలను బలోపేతం చేస్తాయి. ఆ బలం మీద నిర్మితమైన సహకారమే దేశవ్యాప్త సమగ్రాభివృద్ధికి తోడ్పడుతుంది.

- సి.హెచ్. ప్రతాప్

ఎల్‌నినో పరిస్థితులపై అప్రమత్తంగా ఉండి సాగు.. తాగునీటి సరఫరా పై

ముందస్తు చర్యలు చేపట్టాలి

జిల్లా కలెక్టర్ బి. సత్య ప్రసాద్ : గోదావరి పుష్కరాలు-2027 పనులు వెంటనే ప్రారంభించి గడువులోగా పూర్తి చేయాలి

యాసంగిలో వరి సాగును తగ్గించి తక్కువ నీటితో పండే ప్రత్యామ్నాయ పంటలను ప్రోత్సహించాలి

ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో మౌలిక సదుపాయాలు సిద్ధం చేయాలి : ఎమ్మెల్యే డాక్టర్ కే.సంజయ్





జగిత్యాల ప్రతినిధి అక్టోబర్ 27 (ప్రజా కలం):

ఎల్‌నినో పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని యాసంగి సాగు, తాగునీటి సరఫరా, భూగర్భ జలాల సంరక్షణపై అధికారులు ముందస్తు ప్రణాళికతో చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ బి. సత్య ప్రసాద్ ఆదేశించారు. మంగళవారం జగిత్యాల జిల్లా నమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్, అదనపు కలెక్టర్‌తో కలిసి సంబంధిత శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎల్‌నినో ప్రభావం, వర్షపాతం, ఖరీఫ్ పంటల పరిస్థితి, యాసంగి సాగు ప్రణాళిక, ఉద్యాన పంటలు, తాగునీటి సరఫరా, పశు గ్రాసం, ప్రజారోగ్యం, గోదావరి పుష్కరాలు-2027 ఏర్పాట్లపై సమగ్రంగా సమీక్షించారు.జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ మాట్లాడుతూ జూన్ 1 నుంచి అక్టోబర్ 26 వరకు జిల్లాలో సాధారణ వర్షపాతం 3,794.8 మి.మీ. కాగా, వాస్తవంగా 2,982.1 మి.మీ. వర్షపాతం నమోదైందని అధికారులు వివరించారు. సాధారణ వర్షపాతంతో పోలిస్తే 21 శాతం లోటు నమోదైందని, గత ఏడాదితో పోలిస్తే వర్షపాతం 30 శాతం తక్కువగా ఉందని తెలిపారు. ఇబ్రహీంపట్నం మండలంలో 27 శాతం, కోరుట్లలో 22 శాతం, మేడిపల్లిలో 22 శాతం, మల్లాపూర్‌లో 15 శాతం వర్షపాతం లోటు నమోదైనట్లు వివరించారు.కోరుట్ల అసెంబ్లీ నియోజకవర్గం పరిధిలో ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో 1,03,845 ఎకరాల్లో వివిధ పంటలు సాగు చేయగా, అందులో 72,210 ఎకరాల్లో వరి సాగు చేసినట్లు అధికారులు తెలిపారు. వరి పంటలో 455 ఎకరాల్లో నీటి ఒత్తిడి ఏర్పడగా, 101 ఎకరాల్లో పంట ఎండిపోయిందని, అందులో కోరుట్ల మండలంలోనే 80 ఎకరాలు ఉన్నాయని వివరించారు. ఎల్‌నినో పరిస్థితుల కారణంగా యాసంగిలో వరి సాగును గణనీయంగా తగ్గించాలని కలెక్టర్ స్పష్టం చేశారు. గత యాసంగిలో సుమారు 70,229 ఎకరాల్లో వరి సాగు చేయగా, ఈసారి 29,918 ఎకరాలకు తగ్గించాలని వ్యవసాయ శాఖ అంచనా వేసిందని తెలిపారు. ఈ లక్ష్యాన్ని సాధించేలా క్షేత్రస్థాయి వ్యవసాయ అధికారులు రైతులకు అవగాహన కల్పించాలని ఆదేశించారు.గత యాసంగిలో 21,693 ఎకరాల్లో సాగైన మొక్కజొన్నను ఈసారి 29,276 ఎకరాలకు పెంచాలని అంచనా వేసినట్లు తెలిపారు. గత ఏడాది మొత్తం యాసంగి సాగు విస్తీర్ణం 93,218 ఎకరాలు కాగా, ఈసారి 62,904 ఎకరాలకు తగ్గే అవకాశం ఉందని వివరించారు. నీటి లభ్యతను పరిగణనలోకి తీసుకొని పంటల ప్రణాళిక రూపొందించాలని, నీటి అవసరం తక్కువగా ఉండే పంటల సాగును ప్రోత్సహించాలని కలెక్టర్ సూచించారు. పంటల వైవిధ్యీకరణకు ఇదే సరైన సమయమని, రైతులు వరి సాగుపై ఆధారపడకుండా ఉద్యాన పంటలు, ఆయిల్‌పామ్, ఇతర తక్కువ నీటితో సాగు చేయగల పంటల వైపు మళ్లేలా అధికారులు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. ప్రత్యామ్నాయ పంటలపై అవగాహన కల్పించడంతో పాటు అవసరమైన విత్తనాలు అందుబాటులో ఉండేలా చూడాలని, వ్యవసాయ బోర్ల పరిస్థితిని పర్యవేక్షించాలని సూచించారు. యాసంగిలో రెండో పంటగా వరి సాగు చేయవద్దనే విషయాన్ని రైతులకు స్పష్టంగా తెలియజేయాలని ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ సూచించారు. ఎల్‌నినో ప్రభావం, నీటి వనరుల పరిస్థితి, భవిష్యత్తులో ఎదురయ్యే నీటి కొరతను రైతులకు వివరించి, తక్కువ నీటితో పండే ప్రత్యామ్నాయ పంటలను ఎంచుకునేలా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని అన్నారు. యాసంగిలో జిల్లాలో సుమారు 377 ఎకరాల్లో ఉద్యాన పంటల సాగు చేపట్టే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. జిల్లాలో 495 మంది రైతులు మొత్తం 1,253 ఎకరాల్లో ఆయిల్‌పామ్ సాగు చేస్తున్నారని, 783.8 ఎకరాల్లో సూక్ష్మ సేద్య పరికరాల ఏర్పాటు పూర్తయినట్లు వివరించారు.ఎల్‌నినో పరిస్థితుల్లో నీటిని సమర్థవంతంగా వినియోగించుకునే పద్ధతులకు ప్రాధాన్యత ఇవ్వాలని కలెక్టర్ సూచించారు. డ్రిప్, స్ప్రింక్లర్ వంటి సూక్ష్మ సేద్య పద్ధతులపై రైతులకు అవగాహన కల్పించి, అర్హులైన రైతులకు అందుబాటులో ఉన్న పథకాల ప్రయోజనాలు అందేలా చూడాలని ఆదేశించారు. తక్కువ నీటితో పండే ఉద్యాన పంటలు, ఆయిల్‌పామ్ సాగు విస్తీర్ణం పెంచేందుకు వ్యవసాయ, ఉద్యాన శాఖలు సమన్వయంతో పనిచేయాలని తెలిపారు. జిల్లాలో 246 చిన్న నీటి వనరుల మొత్తం సామర్థ్యం 2,412 ఎంసీఎఫ్‌టీ కాగా, ప్రస్తుతం 1,116 ఎంసీఎఫ్‌టీ నీరు అందుబాటులో ఉందని అధికారులు వివరించారు. ఇది మొత్తం సామర్థ్యంలో 46 శాతమని తెలిపారు. కోరుట్ల ప్రాంతంలో భూగర్భ జలమట్టం గత 11 సంవత్సరాల్లో ఎన్నడూ లేనంత దిగువకు చేరిందని పేర్కొన్నారు. ఎల్‌నినో పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని రానున్న 6 నెలల పాటు కొత్త బోర్లు వేయకుండా కఠినంగా అమలు చేయాలని కలెక్టర్ ఆదేశించారు. భూగర్భ జలాలను సంరక్షించేందుకు ప్రజలు, రైతులకు అవగాహన కల్పించాలని, అందుబాటులో ఉన్న నీటిని పొదుపుగా వినియోగించుకునేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.వీబీ-జీ రామ్ జీ పథకం కింద చేపట్టిన ఇంకుడు గుంతలు, ఫామ్ పాండ్స్, ఇతర నీటి సంరక్షణ పనులను నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. నీటి నిల్వలు పెంచే పనులకు ప్రాధాన్యత ఇవ్వాలని, చేపట్టిన పనుల పురోగతిని అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు.జిల్లాలో 180 రోజుల అవసరాలకు 0.491 లక్షల మెట్రిక్ టన్నుల పశుగ్రాసం అవసరం కాగా, ప్రస్తుతం 1.158 లక్షల మెట్రిక్ టన్నుల పశుగ్రాసం అందుబాటులో ఉందని అధికారులు వివరించారు. పశువులకు మేత, తాగునీటి కొరత తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. పనిచేయని పశువుల నీటి తొట్టెలను గుర్తించి మరమ్మతులు చేపట్టి తిరిగి వినియోగంలోకి తీసుకురావాలని ఆదేశించారు. అందుబాటులో ఉన్న పశు గ్రాసాన్ని సక్రమంగా వినియోగించుకునేలా సంబంధిత అధికారులు చర్యలు చేపట్టాలని తెలిపారు.జిల్లాలో గ్రామీణ ప్రాంతాలకు రోజుకు 20,260 కిలోలీటర్ల తాగునీరు అవసరం కాగా, ప్రస్తుతం 12,900 కిలోలీటర్లు మాత్రమే సరఫరా అవుతోందని అధికారులు వివరించారు. రోజుకు 7,360 కిలోలీటర్ల తాగునీటి కొరత ఉన్నట్లు తెలిపారు. ముఖ్యంగా మేడిపల్లి, మల్లాపూర్ మండలాల్లో తాగునీటి సరఫరాపై ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్ సూచించారు.మిషన్ భగీరథ పైప్‌లైన్ సమస్యల పరిష్కారానికి నిధులు మంజూరు చేసి విడుదల చేసినందున, రానున్న 45 రోజుల్లోగా పరిస్థితి మెరుగుపడేలా అధికారులు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. పైప్‌లైన్ లీకేజీలను గుర్తించి తక్షణమే మరమ్మతులు చేపట్టాలని, నీటి సరఫరాలో అంతరాయాలు లేకుండా చూడాలని సూచించారు.కోరుట్ల, మేడిపల్లి మున్సిపాలిటీల పరిధిలో తాగునీటి సరఫరాకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న పనులను త్వరితగతిన పూర్తి చేయాలని, ప్రత్యామ్నాయ బోర్లు, చేతిపంపులు, ట్యాంకర్ల ద్వారా అవసరమైన ప్రాంతాలకు నీరు అందించే ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. నీటి సరఫరాకు సంబంధించి స్పష్టమైన ప్రామాణిక కార్యాచరణ విధానాన్ని రూపొందించి, దాని ప్రకారం నిరంతరాయంగా సరఫరా జరిగేలా చూడాలని తెలిపారు.స్థానిక నీటి వనరులు కూడా క్రమంగా తగ్గిపోతున్నాయని, భవిష్యత్తులో మిషన్ భగీరథ నీటిపై మరింత ఆధారపడాల్సిన పరిస్థితి రావచ్చని ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ పేర్కొన్నారు. ప్రజలకు సరిపడా తాగునీరు అందేలా ముందస్తు ఏర్పాట్లు చేయాలని, పైప్‌లైన్ లీకేజీలు అరికట్టాలని, మున్సిపాలిటీల్లో పెండింగ్ తాగునీటి పనులను త్వరగా పూర్తి చేయాలని సూచించారు. తాగునీటి సరఫరాపై నిరంతర పర్యవేక్షణ ఉండాలని అన్నారు. జిల్లాలో 4 డెంగ్యూ, 1 మలేరియా కేసు నమోదైనట్లు అధికారులు వివరించారు. కోరుట్ల ఏరియా ఆసుపత్రి, మేడిపల్లి సామాజిక ఆరోగ్య కేంద్రాల్లో జ్వరాలు, వడదెబ్బ బాధితులకు అవసరమైన వైద్య సదుపాయాలు సిద్ధంగా ఉంచాలని కలెక్టర్ సూచించారు. వైద్య కేంద్రాల్లో ఓఆర్ఎస్ ప్యాకెట్లు, జింక్ మాత్రలు అందుబాటులో ఉంచాలని, జ్వరాలపై పర్యవేక్షణ పెంచాలని, పారిశుధ్య నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. ప్రజలకు తాగునీటి పరిశుభ్రత, ఆరోగ్య పరిరక్షణపై అవగాహన కల్పించాలని సూచించారు.గోదావరి పుష్కరాలు--2027కు కోరుట్ల నియోజకవర్గ పరిధిలో సుమారు 38 లక్షల మంది భక్తులు వచ్చే అవకాశం ఉందని అధికారులు అంచనా వేశారు. 2015 పుష్కరాల సమయంలో ఈ ప్రాంతానికి 9.45 లక్షల మంది భక్తులు రాగా, 2027లో భక్తుల సంఖ్య గణనీయంగా పెరిగే అవకాశం ఉన్నందున అందుకు అనుగుణంగా మౌలిక సదుపాయాలు కల్పించాలని కలెక్టర్ సూచించారు.మల్లాపూర్ మండలానికి 2015లో 1.25 లక్షల మంది భక్తులు రాగా, 2027లో 15 లక్షల మంది వచ్చే అవకాశం ఉందని అంచనా వేశారు. ఇబ్రహీంపట్నం మండలానికి 2015లో 8.20 లక్షల మంది భక్తులు రాగా, 2027లో 23 లక్షల మంది వచ్చే అవకాశం ఉందని అధికారులు వివరించారు.మల్లాపూర్ మండలంలో వి.వి. రావుపేట, వల్లొండ, మొగిలిపేట, ఓబులాపూర్, కొత్త ధర్మారంపల్లి, పాత ధర్మారంపల్లి గ్రామాల్లో పుష్కర ఘాట్ల ఏర్పాటును ప్రతిపాదించారు. ఇబ్రహీంపట్నం మండలంలో కోమటికొండాపూర్, ఎర్రదండి, ములరాంపూర్, బర్తీపూర్, వేములకుర్తి, రత్నాలమడుగు (వేములకుర్తి), ఫకీర్ కొండాపూర్, యమాపూర్ (బొక్కల మడుగు) గ్రామాల్లో పుష్కర ఘాట్లకు సంబంధించిన ఏర్పాట్ల చేపట్టాలని ప్రణాళిక రూపొందించారు. గోదావరి పుష్కరాల కోసం మొత్తం రూ.226.41 కోట్ల అంచనా వ్యయంతో వివిధ పనులను ప్రతిపాదించినట్లు అధికారులు వివరించారు. ఇందులో మొదటి ప్రాధాన్యత పనులకు రూ.206.42 కోట్లు, రెండో, మూడో ప్రాధాన్యత పనులకు రూ.19.99 కోట్లు ప్రతిపాదించారు. మొదటి ప్రాధాన్యత పనుల్లో దేవాదాయ శాఖకు రూ.20 కోట్లు, నీటిపారుదల శాఖకు రూ.38.39 కోట్లు, పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ విభాగానికి రూ.43.55 కోట్లు, ప్రజారోగ్య శాఖకు రూ.15 కోట్లు, ధర్మపురి మున్సిపాలిటీ తాగునీరు, పారిశుధ్య పనులకు రూ.2 కోట్లు, పర్యాటక శాఖకు రూ.1 కోటి, రోడ్లు--భవనాల శాఖ రహదారుల పనులకు రూ.80 కోట్లు, విద్యుత్ శాఖకు రూ.6 కోట్లు ప్రతిపాదించినట్లు తెలిపారు. టైర్ 2, 3 ప్రాధాన్యత పనుల్లో నీటిపారుదల శాఖకు రూ.11.99 కోట్లు, పంచాయతీరాజ్ రహదారులకు రూ.5 కోట్లు, రోడ్లు--భవనాల శాఖ రహదారులకు రూ.3 కోట్లు ప్రతిపాదించినట్లు వివరించారు.విద్యుత్ శాఖకు సంబంధించి 32 పనులకు రూ.7.67 కోట్ల అంచనా వ్యయం ఉండగా, రెండో ప్రాధాన్యతలో రూ.2.09 కోట్ల పనులకు మాత్రమే అనుమతులు వచ్చాయని, మిగిలిన రూ.5.58 కోట్ల పనులకు అనుమతులు రావాల్సి ఉందని అధికారులు తెలిపారు.పుష్కరాల కోసం మల్లాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో 1,051 మంది, ఇబ్రహీంపట్నం పోలీస్ స్టేషన్ పరిధిలో 1,440 మంది చొప్పున మొత్తం 2,491 మంది పోలీసు సిబ్బంది అవసరమని ప్రతిపాదించినట్లు వివరించారు.గోదావరి పుష్కరాల కోసం మంజూరైన పనుల్లో కాంట్రాక్టర్ల ఎంపిక, టెండర్ల ప్రక్రియ పూర్తయిన వెంటనే సంబంధిత అధికారులు, ఇంజినీర్లు క్షేత్రస్థాయిలో పనులు ప్రారంభమయ్యేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. మండల స్థాయిలో రోడ్లు, వంతెనలకు సంబంధించిన పనుల వివరాలను ఖరారు చేసిన వెంటనే పనులు ప్రారంభించేందుకు అవసరమైన ఏర్పాట్లు పూర్తి చేయాలని సూచించారు.వివిధ శాఖల అధికారులు సమన్వయంతో పనిచేస్తూ, మంజూరైన పనులను ఆలస్యం చేయకుండా ప్రారంభించాలని, పనుల పురోగతిని నిరంతరం పర్యవేక్షించాలని కలెక్టర్ స్పష్టం చేశారు. పుష్కరాలకు వచ్చే భక్తుల సంఖ్యను దృష్టిలో ఉంచుకొని రహదారులు, వంతెనలు, ఘాట్లు, తాగునీరు, పారిశుధ్యం, విద్యుత్, భద్రత వంటి అంశాలకు సంబంధించి అవసరమైన ఏర్పాట్లు ముందుగానే పూర్తి చేయాలని సూచించారు. అన్ని పనులను నిర్దేశిత గడువులోగా నాణ్యతతో పూర్తి చేయాలని ఆదేశించారు.ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ మాట్లాడుతూ ప్రస్తుతం మార్కెట్‌లో పంటలకు మంచి ధరలు లభిస్తున్నప్పటికీ, రానున్న కొన్ని వారాల్లో పంట దిగుబడులు మార్కెట్‌కు ఎక్కువగా వచ్చినప్పుడు ధరలు తగ్గే అవకాశం ఉందని ఎమ్మెల్యే డాక్టర్ కే.సంజయ్ తెలిపారు. ప్రస్తుతం కొనుగోలు కేంద్రాలను వెంటనే ప్రారంభించాల్సిన అవసరం లేకపోయినా, పంటలు మార్కెట్‌కు ఎక్కువగా వచ్చే సమయానికి ప్రభుత్వ కొనుగోళ్లు చేపట్టేందుకు అధికారులు సిద్ధంగా ఉండాలని సూచించారు.రైతులకు కనీస మద్దతు ధర లభించేలా అవసరమైన సమయంలో ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలను ప్రారంభించాలని, ప్రతి కొనుగోలు కేంద్రంలో అవసరమైన మౌలిక సదుపాయాలను ముందుగానే సిద్ధంగా ఉంచాలని అన్నారు. పంటలు అధికంగా మార్కెట్‌కు వచ్చినప్పుడు కొనుగోళ్లకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లు చేయాలని సూచించారు.ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలు అందుబాటులో లేకపోతే వ్యాపారులు ధరల విషయంలో రైతులను ప్రభావితం చేసే అవకాశం ఉందని, అలాంటి పరిస్థితులు తలెత్తకుండా అధికారులు అప్రమత్తంగా ఉండాలని ఎమ్మెల్యే తెలిపారు. మార్కెట్ పరిస్థితులను నిరంతరం పరిశీలిస్తూ, రైతుల ప్రయోజనాలను కాపాడేలా కనీస మద్దతు ధరకు కొనుగోళ్లు చేపట్టేందుకు ముందస్తు ప్రణాళిక రూపొందించాలని సూచించారు.ఎల్‌నినో పరిస్థితులు, నీటి లభ్యత, యాసంగి పంటల సాగుపై రైతులకు విస్తృతంగా అవగాహన కల్పించాలని ఎమ్మెల్యే డాక్టర్ కే.సంజయ్ అన్నారు. రెండో పంటగా వరి సాగు చేయకూడనే విషయాన్ని రైతులకు స్పష్టంగా తెలియజేయాలని, తక్కువ నీటితో పండే ప్రత్యామ్నాయ పంటలను ఎంచుకునేలా వ్యవసాయ శాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు.సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి, రైతులకు అవసరమైన సూచనలు అందించడంతో పాటు తాగునీటి సరఫరా, నీటి సంరక్షణ, పుష్కరాల పనులు, ప్రభుత్వ కొనుగోళ్లకు సంబంధించిన ఏర్పాట్లను ప్రణాళికాబద్ధంగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్, ఎమ్మెల్యే సూచించారు. ఈ సమీక్ష సమావేశంలో అదనపు కలెక్టర్ రెవెన్యూ ఎన్. ప్రసూనాంబ, ఆర్.డి.ఓ. జీవాకర్ రెడ్డి , సంబంధిత అగ్రికల్చరల్ , హార్టికల్చర్, విద్యుత్, ఇరిగేషన్, వెటర్నరీ, మిషన్ భగీరథ, గ్రౌండ్ వాటర్, డీఆర్డీఏ, మున్సిపల్, పీఆర్, ఆర్‌డబి శాఖల జిల్లా , డివిజనల్, మండల స్థాయి అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



తాటి చెట్టు ఎక్కుతుండగా కాలుజారి గీత కార్మికునికి తీవ్ర గాయాలు



ఎండపల్లి, అక్టోబర్ 27 : (ప్రజా కలం ప్రతినిధి) మండలంలోని గుల్లకోట గ్రామానికి చెందిన పొన్నం గంగయ్య వయస్సు (47) సంవత్సరాలు రోజువారి వృత్తిరీత్యా యధావిధిగా తాటి చెట్టు ఎక్కుతుండగా కాలుజారి తాటి చెట్టు పై నుండి కింద పడడంతో కాలు విరి తీవ్ర గాయాలు కావడంతో వెంటనే చికిత్స నిమిత్తం జగిత్యాల హస్పత్రికి తరలించి వైద్య చికిత్స అందిస్తున్నట్లు గౌడ సంఘం అధ్యక్షులు గొల్లపెల్లి సత్యం గౌడ్ తెలిపారు.

కాసిపేట మండలం బాధిత కుటుంబాలను పరామర్శించిన
బిజెపి రాష్ట్ర ఉపాధ్యక్షులు రఘునాథ్ వేరబెల్లి



బెల్లంపల్లి, అక్టోబర్ 27, (ప్రజాకలం) ప్రతినిధి..
మంచిర్యాల జిల్లా,కాసిపేట మండలం సింగిల్ విండో మాజీ చైర్మన్ పుస్కూరి వంశీ మాతృమూర్తి రేఖ రాణి ఇటీవల మరణించారు. మంగళవారం బిజెపి రాష్ట్ర ఉపాధ్యక్షులు రఘునాథ్ వేరబెల్లి వారి నివాసానికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించి,ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. అనంతరం సీనియర్ నాయకులు అనారోగ్య సమస్యతో బాధపడుతున్న పెద్దపల్లి శంకర్ నీ తన నివాసంలో కలిసి పరామర్శించారు. అదేవిధంగా ఇటీవల ముత్యంపల్లిలో ఆత్మహత్య చేసుకుని మరణించిన విజయ్ కుటుంబ సభ్యులను పరామర్శించి, ధైర్యం చెప్పారు... ఈ కార్యక్రమంలో కాసిపేట మండలం బిజెపి అధ్యక్షులు సూరం సంపత్, సోషల్ మీడియా కన్వీనర్ జయరాజ్, జిల్లా కార్యదర్శి సంజీవరావు, ఎస్సీ మోర్చా జిల్లా ఉపాధ్యక్షులు రెడ్డి బాలరాజ్, బిజెపి మండల ఉపాధ్యక్షులు ప్రసన్న, కిసాన్ మోర్చా మండల అధ్యక్షులు దుర్గం రాయలింగు, బిజెపి నాయకులు కామెర రాజేష్, కార్తీక్, మండల సభ్యులు సురేందర్,రాజు, మహేష్ తదితరులు పాల్గొన్నారు...

మల్లాపూర్ టీయూడబ్ల్యూజే (ఐజేయూ)
నూతన కమిటీ ఏకగ్రీవ ఎన్నిక

- అధ్యక్షుడిగా సభావత్ మల్లేష్..
- ప్రధాన కార్యదర్శిగా బద్దం శ్రీనివాస్ రెడ్డి
- ఉపాధ్యక్షులుగా బద్దం రాంచందర్ రెడ్డి



మల్లాపూర్, అక్టోబర్ 27 (ప్రజా కలం ప్రతినిధి) : మల్లాపూర్ మండల టీయూడబ్ల్యూజే (ఐజేయూ) ప్రెస్ క్లబ్ నూతన కమిటీని మంగళవారం మండల కేంద్రంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. టీయూడబ్ల్యూజే (ఐజేయూ) జిల్లా అధ్యక్షుడు చీటి శ్రీనివాస్ రావు ఆధ్వర్యంలో జరిగిన ఈ ఎన్నికల్లో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. మల్లాపూర్ మండల ఐజేయూ అధ్యక్షుడిగా సభావత్ మల్లేష్, ప్రధాన కార్యదర్శిగా బద్దం శ్రీనివాస్ రెడ్డి, ఉపాధ్యక్షుడిగా బద్దం రాంచందర్ రెడ్డి, కోశాధికారిగా సింగిరెడ్డి అశోక్, సంయుక్త కార్యదర్శిగా వాసం మధుకర్‌ను కార్యవర్గ సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఐజేయు జిల్లా అధ్యక్షులు చీటి శ్రీనివాస్ రావు మాట్లాడుతూ జర్నలిస్టుల సమస్యల పరిష్కారం కోసం నిరంతరం కృషి చేస్తానని తెలిపారు. జర్నలిస్టులకు హెల్త్ కార్డుల మంజూరు, ఇంటి స్థలాల కేటాయింపు వంటి సమస్యల పరిష్కారం కోసం రాజీలేని పోరాటం చేస్తామని స్పష్టం చేశారు. జర్నలిస్టుల హక్కుల పరిరక్షణకు, వారి సంక్షేమానికి ప్రాధాన్యతనిస్తామని పేర్కొన్నారు. ఈ సమావేశంలో జగిత్యాల జిల్లా ఐజేయు ప్రధాన కార్యదర్శి బెజ్జంకి సంపూర్ణ చారి, రాష్ట్ర ఐజేయూ కౌన్సిల్ సభ్యులు రాగుల గోపాలచారి, జిల్లా కోశాధికారి సిరిసిల్ల వేణుగోపాల్, జిల్లా కమిటీ ఉపాధ్యక్షులు లోక రమణారెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యులు నిమిషకవి రాజేష్,గౌరవ అధ్యక్షులు ర్యాగల్ల వెంకటేశ్వర్లు, గౌరవ సలహాదారుడు గుగ్గిల రాజ శేఖర్, మిడిదొడ్డి మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు.. జర్నలిస్టు
కుటుంబాలకు టీయూడబ్ల్యూజే (ఐజేయూ) పరామర్శ

మెట్‌పల్లి:(కోరుట్ల) ప్రతినిధి అక్టోబర్ 27(ప్రజా కలం) జగిత్యాల జిల్లా ఏఐటీయూసీ అధ్యక్షుడు ఎశమేని గణేష్ నానమ్మ రాజవ్వ ఇటీవల మృతి చెందడంతో, టీయూడబ్ల్యూజే (ఐజేయూ) జిల్లా అధ్యక్షుడు చీటి శ్రీనివాసరావు గణేష్ కుటుంబాన్ని పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. అదేవిధంగా, మెట్‌పల్లి ప్రెస్ క్లబ్ ప్రింట్ మీడియా ఉపాధ్యక్షుడు జంగం విజయ్ ఇటీవల మృతి చెందడంతో ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులకు మనోధైర్యం కల్పిస్తూ, ప్రెస్ క్లబ్ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని, తమ వంతు సహాయ సహకారాలు అందిస్తామని భరోసా ఇచ్చారు.ఈ కార్యక్రమంలో టీయూడబ్ల్యూజే (ఐజేయూ) రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రాగుల గోపాలచారి, జిల్లా ప్రధాన కార్యదర్శి బెజ్జంకి సంపూర్ణ చారి, జిల్లా కోశాధికారి సిరిసిల్ల వేణుగోపాల్, జిల్లా కార్యవర్గ సభ్యుడు భాషెట్టి హరీశ్, మెట్‌పల్లి ప్రెస్ క్లబ్ ప్రింట్ మీడియా ప్రధాన కార్యదర్శి మహమ్మద్ అజీమ్, ఉపాధ్యక్షుడు అఫ్రోజ్ తదితరులు పాల్గొన్నారు.



ధర్మారం 11వ వార్డు సభ్యుడు నూనె సాయి గణేష్ సస్పెన్షన్

జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష - గ్రామ పంచాయతీ ఇంటి నంబర్ల కేటాయింపులో అక్రమాలపై విచారణ
తెలంగాణ పంచాయతీరాజ్ చట్టం, 2018లోని సెక్షన్ 37(6) ప్రకారం చర్యలు



ధర్మారం, అక్టోబర్ 27 : (ప్రజా కలం ప్రతినిధి) ధర్మారం మండలం ధర్మారం గ్రామ పంచాయతీ 11వ వార్డు సభ్యుడు నూనె సాయి గణేష్‌ను గ్రామ పంచాయతీ ఇంటి నంబర్లు, అసెస్‌మెంట్ నంబర్ల నమోదు ప్రక్రియ లో అక్రమాలకు పాల్పడినట్లు విచారణలో వెల్లడైన అంశాల ఆధారంగా సస్పెండ్ చేసినట్లు జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష తెలిపారు. ధర్మారం గ్రామ పంచాయతీకి సంబంధించి 2026-2027 సంవత్స రపు డిమాండ్ రిజిస్టర్‌లో ఇంటి నంబర్లు, అసెస్‌మెంట్ నంబర్ల కేటాయింపులో అక్రమాలు జరిగినట్లు ఫిర్యాదులు అందాయని తెలిపారు. ఈ వ్యవహారం పై పెద్దపల్లి డివిజనల్ పంచాయతీ అధికారి విచారణ నిర్వహించి నివేదిక సమర్పించినట్లు కలెక్టర్ పేర్కొన్నారు. విచారణలో భాగంగా అసెస్‌మెంట్ నంబర్లు 153, 154, 173, 186లకు సంబంధించిన వివరాలు పరిశీలించగా, వాటిని వరుసగా నూనె మంజుల, సమాల అనిల్, గుర్రాల స్వరూప, నూనె శ్రీనివాస్ పేర్లపై నమోదు చేసినట్లు గుర్తించారని తెలిపారు. ఈ అసెస్‌మెంట్ నంబర్ల నమోదులో నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించినట్లు విచారణ నివేదికలో పేర్కొన్నారని వెల్లడించారు. ఈ వ్యవహారం లో అప్పటి పంచాయతీ కార్యదర్శి, ప్రస్తుత పంచాయతీ కార్యదర్శి, ఈ-పంచాయతీ ఆపరేటర్, కంప్యూటర్ ఆపరేటర్లు తదితరుల వాంగ్మూలాలను విచారణ లో పరిగణనలోకి తీసుకున్నట్లు తెలిపారు. అప్పటి పంచాయతీ కార్యదర్శి ఈ అంశంపై ధర్మారం పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు పేర్కొన్నారు. ప్రజా ప్రతినిధిగా బాధ్యతా యుతంగా వ్యవహ రించాల్సిన వార్డు సభ్యుడు తన అధికార స్థానాన్ని దుర్వినియోగం చేసి, ఇతరులతో కలిసి నిబంధ నలకు విరుద్ధంగా అసెస్‌మెంట్ నంబర్ల నమోదు ప్రక్రియలో జోక్యం చేసుకున్నట్లు విచారణ నివేదిక లో వెల్లడైన అంశాలను పరిగణనలోకి తీసుకున్నట్లు తెలిపారు. ఈ నేపథ్యంలో తెలంగాణ పంచాయతీరాజ్ చట్టం, 2018లోని సెక్షన్ 37(6) ప్రకారం ధర్మారం గ్రామ పంచాయతీ 11వ వార్డు సభ్యుడు నూనె సాయి గణేష్‌ను సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేసినట్లు తెలిపారు. క్రమశిక్షణా చర్యల ప్రక్రియ పూర్తయ్యే వరకు లేదా 6 నెలల కాలపరిమితి ముగిసే వరకు, ఏది ముందుగా జరిగితే అప్పటివరకు సస్పెన్షన్ అమల్లో ఉంటుం దని పేర్కొన్నారు. ఈ అంశానికి సంబంధించి సంబంధిత నిందితులపై పోలీస్ స్టేషన్లో కేసు బుక్ చేశామని, ఎఫ్.ఐ.ఆర్ నెం. 204/2026, తేదీ 26.10.2026 కేసు ఫైల్ అయిందని అన్నారు. ధర్మారం 11వ వార్డు సభ్యుడు నూనె సాయి గణేష్ సస్పెన్షన్ ఉత్తర్వుల అమలుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని ధర్మారం మండల పరిషత్ అభివృద్ధి అధికారిని ఆదేశించినట్లు జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష తెలిపారు.

వీబీ జీ రామ్ జీ పనులపై ప్రత్యేక దృష్టి సారించండి

ప్రతి గ్రామంలో 60 మందికి ఉపాధి కల్పించాలి - జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష



పెద్దపల్లి,అక్టోబర్ 27:(ప్రజాకలం జిల్లా ప్రతినిధి) జిల్లాలో వీబీ జీ రామ్ జీ పథకం అమలు తీరుపై ప్రత్యేక దృష్టి సారించి, నిర్దేశించిన లక్ష్యాలను సకాలంలో పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష సంబంధిత అధికారులను ఆదేశించారు.మంగళవారం సమీకృత జిల్లా కలెక్టరేట్‌లో వీబీ జీ రామ్ జీ పథకం అమలుపై సంబంధిత అధికారులతో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష మాట్లాడుతూ వీబీ జీ రామ్ జీ పథకం కింద ప్రతి గ్రామంలో రోజుకు కనీసం 60 మంది కూలీలకు ఉపాధి కల్పించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.ప్రతి ఇంటికీ తప్పనిసరిగా ఇంకుడు గుంత ఏర్పాటు చేసేలా అధికారులు చర్యలు చేపట్టాలన్నారు.జిల్లాకు కేటాయించిన లక్ష్యాలకు అనుగుణంగా పెండింగ్‌లో ఉన్న ఇంకుడు గుంతలు,ఫామ్ పాండ్లు,బోర్‌వెల్ రీచార్జ్ పిట్ల నిర్మాణ పనులను వెంటనే ప్రారంభించి నవంబర్ నెలాఖరులోగా పూర్తి చేయాలని స్పష్టం చేశారు.పనుల పురోగతిని నిరంతరం వర్యవేక్షిన్తూ నిర్దేశిత లక్ష్యాలను సాధించాలని సూచించారు.ఎల్‌నినో నేపథ్యంలో గ్రామీణ ప్రాంతాల్లో తాగునీటి సరఫరాపై ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్ ఆదేశించారు.తాగునీటి సరఫరాలో ఎక్కడైనా ఇబ్బందులు తలెత్తితే వెంటనే క్షేత్రస్థాయిలో పరిశీలించి పరిష్కరించాలని, నీటి లీకేజీలను అరికట్టి ప్రజలకు నిరంతరాయంగా తాగునీరు అందేలా అవసరమైన ముందస్తు చర్యలు తీసుకోవాలని సూచించారు.ఈ సమావేశంలో జెడ్పీ సీఈఓ నరేందర్,జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి కాళిందిని,ఎంపీడీవోలు,సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్లతో సొంతింటి కల సాకారం

1,100 మందికి ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాలు అందజేత
రామగుండం ఎమ్మెల్యే మక్కాన్ సింగ్ రాజ్ ఠాకూర్



పెద్దపల్లి,అక్టోబర్ 27:(ప్రజాకలం జిల్లా ప్రతినిధి)
పేదల సొంతింటి కలను నిజం చేయడమే కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని రామగుండం ఎమ్మెల్యే మక్కాన్ సింగ్ రాజ్ ఠాకూర్ స్పష్టం చేశారు. మంగళవారం ఎన్‌టీపీసీలోని కాకతీయ కళ్యాణ మండపంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో నియోజకవర్గ పరిధిలోని 1,100 మంది అర్హులైన లబ్ధిదారులకు మంజూరైన ఇందిరమ్మ ఇళ్ల ప్రొసీడింగ్స్ పత్రాలను అందజేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మక్కాన్ సింగ్ రాజ్ ఠాకూర్ మాట్లాడుతూ పేద కుటుంబాలకు శాశ్వత గూడు కల్పించి వారి జీవితాల్లో భరోసా, భద్రత నింపేందుకు ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని చిత్తశుద్ధితో అమలు చేస్తోందని పేర్కొన్నారు.మొదటి విడతలో అవకాశం రాని మిగతా అర్హులందరికీ రెండో విడతలో తప్పకుండా ఇళ్లు మంజూరు అయ్యేలా చూస్తామని,ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని హామీ ఇచ్చారు.రామగుండం నియోజకవర్గ సమగ్ర నవనిర్మాణమే తమ సంకల్పమని, విమర్శలకు అభివృద్ధితోనే సమాధానం చెబుతామని రాజ్ ఠాకూర్ అన్నారు. ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో సంక్షేమం,అభివృద్ధికి సమప్రాధాన్యత ఇస్తున్నామని తెలిపారు.నియోజకవర్గంలో మెరుగైన రహదారులు,సెంట్రల్ లైటింగ్,డ్రైనేజీ,తాగునీరు వంటి మౌలిక వసతుల కల్పనకు ప్రత్యేక ప్రణాళికలతో ముందుకు వెళ్తున్నట్లు వెల్లడించారు.ఈ కార్యక్రమంలో రామగుండం నగర మేయర్ మహంకాళి స్వామి,డిప్యూటీ మేయర్ పాతపల్లి ఎల్లయ్య,మున్సిపల్ కమిషనర్ అరుణశ్రీ,కాంగ్రెస్ పార్టీ కార్పొరేషన్ అధ్యక్షుడు ఎండీ ముస్తఫా,కార్పొరేటర్లు, అధికారులు,ప్రజాప్రతినిధులు,లబ్ధిదారులు పాల్గొన్నారు.

సాగునీరు అందించాం.. మద్దతు ధర కల్పిస్తాం

ప్రభుత్వ విప్,ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు



సుల్తానాబాద్,అక్టోబర్ 27:(ప్రజాకలం జిల్లా ప్రతినిధి)
సాగునీరు అందించడంతో పాటు పంటలకు మద్దతు ధర కల్పించడంలో ప్రభుత్వం రాజీ పడదని రాష్ట్ర ప్రభుత్వ విప్, పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు స్పష్టం చేశారు. మంగళవారం సుల్తానాబాద్ మండలం కనుకుల గ్రామంలో సింగిల్ విండో ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రజాప్రతినిధులతో కలిసి ఆయన ప్రారంభించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డి,మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డిలతో మాట్లాడి ఎస్సారెస్పీ నీటిని విడుదల చేయించి పంటలను కాపాడామని ఈ సందర్భంగా ఆయన గుర్తుచేశారు.రైతులు దళారుల చేతిలో మోసపోకుండా ప్రభుత్వ కేంద్రాల్లోనే ధాన్యం విక్రయించాలని సూచించారు.ప్రభుత్వం సన్నధాన్యానికి ఇచ్చే రూ.500 బోనస్‌తో కలిపి క్వింటాకు మొత్తం రూ.2,962 లభిస్తుందని,విక్రయించిన 48 గంటల్లోపే నగదు ఖాతాల్లో జమవుతుందని తెలిపారు.తూకాల్లో తేడాలొస్తే బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించిన ఆయన,తుఫాను ప్రభావంతో ధాన్యం తడవకుండా జాగ్రత్తలు తీసుకోవాలని,నీటి ఎద్దడి దృష్ట్యా యాసంగిలో ఆరుతడి పంటలకే ప్రాధాన్యమివ్వాలని రైతులకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సుల్తానాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్,కనుకుల సింగిల్ విండో చైర్మన్,మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు,సర్పంచులు,ఉపసర్పంచులు,ప్రజాప్రతినిధులు, రైతులు,కాంగ్రెస్ నాయకులు,కార్యకర్తలు,మహిళలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు గణేష్ కుటుంబానికి ఎమ్మెల్యే సంజయ్ పరామర్శ



మెట్‌పల్లి:(కోరుట్ల) ప్రతినిధి అక్టోబర్ 27 ప్రజా కలం ఏఐటీయూసీ జగిత్యాల జిల్లా అధ్యక్షుడు ఎశమేని గణేష్ నానమ్మ రాజవ్వ ఇటీవల మృతి చెందగా, కోరుట్ల ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్ వారి నివాసానికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా రాజవ్వ చిత్రపటానికి పూలతో నివాళు లర్పించారు. రాజవ్వ మృతి పట్ల ఎమ్మెల్యే సంజయ్ ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. ఎశమేని గణేష్‌తో పాటు కుటుంబ సభ్యులను ఓదార్చి, వారికి మనోధైర్యం కల్పించారు. కుటుంబానికి కలిగిన తీరని లోటు పట్ల విచారం వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే వెంట కౌన్సిలర్ అంగడి పురుషోత్తం, మాజీ కౌన్సిలర్ బంగారుకాళ్ల కిషోర్, జక్కం బాబు, 19వ వార్డు ఇన్‌చార్జి ఆకుల ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.


మృతుల కుటుంబాలకు నగదు, నిత్యావసర సరుకులు అందజేత



గొల్లపల్లి అక్టోబర్ 27 ప్రజా కలం ప్రతినిధి గొల్లపల్లి మండలం గుంజపడుగు గ్రామానికి చెందిన మారం పద్మ , శ్రీరాములపల్లి గ్రామానికి చెందిన పొన్నం సత్తయ్య ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా వారి కుటుంబాన్ని పరామర్శించి వారికి ఐదు వేల రూపాయలు ఆర్థిక సహాయం,అబ్బాపూర్ గ్రామానికి చెందిన చిలుకమారి శ్రీహరి మృతి చెందగా వారి కుటుంబానికి బియ్యం ,నిత్యావసర సరుకులను సామాజిక సేవకులు ఎడమల బోజేందర్ రెడ్డి అందించి మానవత్వాన్ని చాటుకున్నారు.సహాయం అందించిన బోజేందర్ రెడ్డికి బాధిత కుటుంబాలు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో అగ్గిమల్ల సర్పంచ్ నవ్వ అంజన్న,శంకర్రావుపేట ఉప సర్పంచ్ గుర్రం రంజిత్ రెడ్డి యూత్ నాయకులు అవారి చందు ఆయా గ్రామాల నాయకులు పాల్గొన్నారు.

మాజీ సర్పంచుల సంక్షేమ సంఘం మెట్‌పల్లి మండల అధ్యక్షుడిగా బద్దం శేఖర్‌రెడ్డి

మాజీ సర్పంచులకు రూ.10 వేల పింఛన్, కార్పొరేట్ ఆసుపత్రుల్లో ఉచిత వైద్యం కల్పించాలి



మెట్‌పల్లి:(కోరుట్ల)ప్రతినిధి అక్టోబర్ 27(ప్రజా కలం): తెలంగాణ మాజీ సర్పంచుల సంక్షేమ సంఘం మెట్‌పల్లి మండల అధ్యక్షుడిగా చిట్టాపూర్ మాజీ సర్పంచ్ బద్దం శేఖర్‌రెడ్డి నియమితులయ్యారు. రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు బొడ్డు దేవయ్య ఆదేశాల మేరకు రాష్ట్ర కమిటీ ఆయన నియామకాన్ని చేపట్టింది. మెట్‌పల్లి పట్టణంలోని అంబేద్కర్ పార్కు వద్ద మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో కోరుట్ల నియోజకవర్గ మాజీ సర్పంచుల అధ్యక్షుడు జంగం స్వామి, బద్దం శేఖర్‌రెడ్డికి నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా సంఘం ప్రతినిధులు మాట్లాడుతూ మాజీ సర్పంచులు పార్టీలకు అతీతంగా ఐక్యంగా ఉంటూ తమ సమస్యల పరిష్కారం కోసం కృషి చేయాలన్నారు. ప్రజాసేవలో భాగంగా అనేక మంది మాజీ సర్పంచులు ఆర్థికంగా నష్టపోయారని, వారిని ఆదుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రభుత్వం మాజీ సర్పంచులకు నెలకు రూ.10 వేల పింఛన్ అందించాలని, కార్పొరేట్ ఆసుపత్రుల్లో ఉచిత వైద్య సదుపాయం కల్పించాలని కోరారు.మాజీ సర్పంచుల ఆర్థిక ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వం చేయూతనివ్వాలని, వారి సమస్యలను పరిష్కరించాలని తెలంగాణ మాజీ సర్పంచుల సంక్షేమ సంఘం తరఫున విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో కోరుట్ల నియోజకవర్గ మాజీ సర్పంచుల అధ్యక్షుడు జంగం స్వామి, మెట్‌పల్లి మండల కోరం అధ్యక్షుడు ఆకుల రాజారెడ్డి, ఇబ్రహీంపట్నం మండల మాజీ సర్పంచుల అధ్యక్షుడు సోం ప్రభాకర్, సున్నాల శేఖర్ తదితరులు పాల్గొన్నారు.


అదనపు కలెక్టర్ ప్రసూనాంబను కలిసిన మెట్‌పల్లి మున్సిపల్ కమిషనర్

జగిత్యాల ప్రతినిధి అక్టోబర్ 27 (ప్రజా కలం) జగిత్యాల జిల్లా అదనపు కలెక్టర్ ప్రసూనాంబను మంగళవారం మెట్‌పల్లి మున్సిపల్ కమిషనర్ డి. శ్రీనివాస్ గౌడ్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆమెకు పూల మొక్కను అందించి శుభాకాంక్షలు తెలిపారు.



29న వాహనాల బహిరంగ వేలం

-పెద్దపల్లి ఆబ్కారీ ఎన్. రజిత



పెద్దపల్లి,అక్టోబర్ 27:(ప్రజాకలం జిల్లా ప్రతినిధి) స్థానిక మద్యనిషేధ,ఆబ్కారీ ఠాణా పరిధిలోని వివిధ కేసుల్లో పట్టుబడి ప్రభుత్వ పరం అయిన ఏడు వాహనాలను ఈ నెల 29వ తేదీన బహిరంగ వేలం వేయనున్నట్లు ఆబ్కారీ ఎన్.రజిత తెలిపారు.కరీంనగర్ డివిజన్ ఆబ్కారీ ఉప కమిషనర్ ఆదేశాల మేరకు బండారికుంటలోని కార్యాలయ ప్రాంగణంలో ఉదయం 11 గంటలకు ఈ వేలం పాట నిర్వహించనున్నారు.వేలంలో పాల్గొనదలచిన ఆసక్తి గల అభ్యర్థులు అదే రోజు ఉదయం 9 నుండి 10 గంటల మధ్య నిర్దేశిత ధరావతు సొమ్మును చెల్లించి రసీదు తీసుకోవాలని,ఇతర వివరాల నిమిత్తం కార్యాలయ పనివేళల్లో సంప్రదించాలని ఆమె సూచించారు.

మానవ హక్కుల పరిరక్షణకు నిరంతరం కృషి చేస్తా

- ఎండీ.అబ్దుల్ మాలిక్

- హెచ్ఆర్పిసి జిల్లా ప్రధాన కార్యదర్శిగా అబ్దుల్ మాలిక్ నియామకం

పెద్దపల్లి,అక్టోబర్ 27:(ప్రజాకలం జిల్లా ప్రతినిధి) హ్యూమన్ రైట్స్ ప్రొటెక్షన్ కమిటీ తెలంగాణ రాష్ట్ర కమిటీ ఆదేశాల మేరకు పెద్దపల్లి జిల్లా ప్రధాన కార్యదర్శిగా



ఎండీ.అబ్దుల్ మాలిక్ నియమితులయ్యారు.ఈ మేరకు కమిటీ రాష్ట్ర నాయకత్వం ఆయనకు అధికారిక నియామక పత్రాన్ని అందజేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది.ఈ సందర్భంగా ఎండీ.అబ్దుల్ మాలిక్ మాట్లాడుతూ మానవ హక్కుల పరిరక్షణ కమిటీ జిల్లా ప్రధాన కార్యదర్శిగా తనను నియమించిన రాష్ట్ర కమిటీ బాధ్యులకు,జిల్లా నాయకులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.సమాజంలో అణగారిన వర్గాలు,నిస్సహాయులు, బాధితుల హక్కుల పరిరక్షణ కోసం కమిటీ ఆధ్వర్యంలో నిరంతరం పోరాడతానని స్పష్టం చేశారు.జిల్లాలో ఎక్కడైనా మానవ హక్కుల ఉల్లంఘన జరిగితే వెంటనే స్పందించి బాధితులకు న్యాయం జరిగేలా చట్టవరంగా అండగా నిలుస్తామని తెలిపారు.సామాజిక న్యాయం,ప్రజా సంక్షేమమే ధ్యేయంగా జిల్లావ్యాప్తంగా కమిటీని మరింత పటిష్టం చేసి ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని పేర్కొన్నారు.విద్యావంతుడు, యువకుడు అయిన ఎండీ.అబ్దుల్ మాలిక్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా బాధ్యతలు చేపట్టడం పట్ల స్థానిక మేధావులు, యువజన సంఘాల ప్రతినిధులు,వివిధ ప్రజా సంఘాల నాయకులు,మిత్రులు హర్షం వ్యక్తం చేస్తూ ఆయనకు శుభాకాంక్షలు తెలియజేశారు.

43 కేసుల నిందితుడి అరెస్ట్.. బంగారం, వెండి స్వాధీనం!



గద్వాల ప్రతినిధి, అక్టోబర్ 27 (ప్రజా కలం): జోగుళాంబ గద్వాల జిల్లా వడ్డేపల్లి మండలం శాంతినగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగిన పగటిపూట చోరీ కేసును పోలీసులు ఛేదించారు. ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, తెలంగాణ రాష్ట్రాల్లో 43 చోరీ కేసుల్లో నిందితుడిగా ఉన్న పి. గంగాధర్ అలియాస్ సంఘ (31)ను అరెస్ట్ చేసి, అతడి నుంచి 10 తులాల బంగారు ఆభరణాలు, కిలో వెండిని స్వాధీనం చేసుకున్నారు.పోలీసుల వివరాల ప్రకారం.. ఈ నెల 14న ఇందిరానగర్ కాలనీకి చెందిన తోట మాధవరావు (56) ఇంట్లో ఎవరూ లేని సమయంలో దొంగలు చొరబడి 20 తులాల బంగారు ఆభరణాలు, కిలో వెండిని అపహరించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. దర్యాప్తులో నిందితుడిని అదుపులోకి తీసుకుని విచారించగా, చోరీకి గురైన బంగారంలో 10 తులాలను వివిధ బ్యాంకుల్లో తాకట్టు పెట్టి గోల్డ్ లోన్లు తీసుకున్నట్లు వెల్లడైందని పోలీసులు తెలిపారు. మిగిలిన ఆభరణాల ఆచూకీపై దర్యాప్తు కొనసాగుతోంది. నిందితుడిని న్యాయస్థానం ఎదుట హాజరుపరచనున్నట్లు డీఎస్పీ మొగులయ్య, ఎస్ఐ నాగశేఖర్‌రెడ్డి తెలిపారు.

షార్ట్ సర్క్యూట్‌తో 9 ఎకరాల చెరకు పంట బుగ్గిపాలు!

చేతికొచ్చిన పంట దగ్ధం.. రైతులకు భారీ నష్టం

గద్వాల ప్రతినిధి, అక్టోబర్ 27 (ప్రజా కలం):జోగుళాంబ గద్వాల జిల్లా వడ్డేపల్లి మండలం బుడమర్స్ గ్రామంలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో చెరకు పంట దగ్ధమైంది. రాంప్రసాద్, యుగంధర్ అనే ఇద్దరు రైతులకు చెందిన తొమ్మిది ఎకరాల చెరకు పంట పూర్తిగా కాలిపోయింది. పంట సాగు కోసం ఏర్పాటు చేసిన డ్రిప్ పైపులు సైతం అగ్నికి ఆహుతయ్యాయి. చేతికొచ్చిన పంట కళ్లముందే కాలిపోవడంతో బాధిత రైతులు తీవ్ర ఆవేదనకు గురయ్యారు. ఈ ప్రమాదంతో భారీ ఆర్థిక నష్టం వాటిల్లిందని రైతులు తెలిపారు. ప్రభుత్వం స్పందించి పంట నష్టాన్ని అంచనా వేసి, తగిన పరిహారం అందించి తమను ఆదుకోవాలని కోరుతున్నారు.



ఆర్ఎస్ఎస్ ప్రముఖ్ కు కేంద్ర మంత్రి

బండి సంజయ్ ఓదార్పు





పెద్దపల్లి,అక్టోబర్ 27:(ప్రజాకలం జిల్లా ప్రతినిధి)

పెద్దపల్లి పట్టణం సుభాష్ నగర్‌కు చెందిన ఆర్ఎస్ఎస్ ప్రముఖ్ కె.సుధాకర్ మాతృమూర్తి కుమ్మరికుంట రాజేశ్వరి ఇటీవల మృతి చెందడంతో మంగళవారం పెద్దపల్లి పట్టణంలోని వారి నివాసానికి కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ చేరుకుని,బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు.మృతురాలి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించిన అనంతరం,రాజేశ్వరి మృతి పట్ల ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు.వారి కుటుంబానికి భగవంతుడు మనోధైర్యాన్ని ప్రసాదించాలని,రాజేశ్వరి ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు.కుటుంబ సభ్యులతో మాట్లాడి,వారికి పార్టీ తరఫున ఎల్లవేళలా అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.ఈ కార్యక్రమంలో కేంద్ర మంత్రితో పాటు బీజేపీ జిల్లా అధ్యక్షుడు కర్రె సంజీవరెడ్డి,నల్ల మనోహర్ రెడ్డి,పల్లె సదానందం,అల్లంకి శ్రీనివాస్,కావేటి రాజగోపాల్,పలువురు స్థానిక నాయకులు,కార్యకర్తలు మరియు శ్రేయోభిలాషులు పాల్గొన్నారు.

ఓటర్ల జాబితా ప్రక్షాళన కోసమే ఎస్ఐఆర్ ప్రక్రియ

-కేంద్ర హోం సహాయ మంత్రి బండి సంజయ్

ఓటర్ల జాబితా నుంచి విదేశీయులు, మరణించిన వారి పేర్లను తొలగించడంతో పాటు,18 ఏళ్లు నిండిన అర్హులైన యువతకు ఓటు హక్కు కల్పించడమే లక్ష్యంగా ఎస్ఐఆర్ ప్రక్రియను చేపట్టినట్లు కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ స్పష్టం చేశారు.మృతురాలి కుటుంబాన్ని పరామర్శించిన అనంతరం పెద్దపల్లి పట్టణంలో బండి సంజయ్ మీడియాతో మాట్లాడుతూ ఎస్ఐఆర్ అంశంపై ప్రతిపక్షాలు అనవసర రాద్ధాంతం చేస్తూ ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నాయని మండిపడ్డారు.భారత పౌరులు కాని వ్యక్తులకు ఈ దేశ ప్రధానిని నిర్ణయించే ఓటు హక్కు ఎలా ఇస్తామని ఆయన ప్రశ్నించారు.విదేశీయులు అక్రమంగా దేశంలోకి ప్రవేశించి,గుర్తింపులు పొంది సంక్షేమ పథకాలు పొందడం వల్ల దేశ ప్రజలకే తీవ్ర నష్టం వాటిల్లుతోందని ఆవేదన వ్యక్తం చేశారు.ఓటర్ల జాబితాలోని డొల్లతనాన్ని ఎత్తిచూపుతూ,మాజీ ప్రధాని పి.వి.నరసింహారావు 2004లోనే కన్నుమూసినప్పటికీ, నేటికీ ఆయన పేరు ఓటర్ జాబితా నుంచి తొలగించకపోవడం ఇందుకు నిదర్శనమని గుర్తుచేశారు. ఇలాంటి లోపాలను,అక్రమాలను సరిదిద్ది పారదర్శకమైన ఓటర్ల జాబితాను రూపొందించేందుకే ప్రభుత్వం చిత్తశుద్ధితో ఎస్ఐఆర్ ప్రక్రియను నిర్వహిస్తోందని ఆయన స్పష్టం చేశారు.

విద్యార్థుల వికాసానికి ఆచరణాత్మక బోధనే ముఖ్యం

కేజీబీవీలో మౌలిక వసతులు కల్పిస్తాం - జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా



నిర్మల్ అక్టోబర్ 27 (ప్రజా కలం జిల్లా ప్రతినిధి)

విద్యార్థులు పాఠ్యాంశాలను కేవలం పుస్తకాలకే పరిమితం చేయకుండా, నిత్యజీవిత అనుభవాలతో అనుసంధానం చేసుకొని నేర్చుకునేలా ఆచరణాత్మక బోధన అందించాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా సూచించారు. మంగళవారం కుంటాల మండలం కల్లూరు గ్రామంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం (కేజీబీవీ)ను కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వసతి గృహం, తరగతి గదులు, పరిసరాలను పరిశీలించి విద్యార్థులకు అందుతున్న సౌకర్యాలపై ఆరా తీశారు. వసతి గృహ ప్రాంగణంలో ప్రతిరోజూ మెరుగైన పారిశుద్ధ్య నిర్వహణ చేపట్టాలని అధికారులను ఆదేశించారు. విద్యార్థులకు మెనూ ప్రకారం అన్ని పూటలా నాణ్యమైన, పరిశుభ్రమైన భోజనం అందించాలని సూచించారు. విద్యార్థులు, ఉపాధ్యాయుల హాజరు శాతం వందకు చేరేలా చర్యలు తీసుకోవాలన్నారు. వసతి గృహంలోని నీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపేందుకు రూ. 4.80 లక్షలు కేటాయించినట్లు కలెక్టర్ తెలిపారు. డ్రైనేజీ నిర్మాణంతో పాటు అవసరమైన ఇతర మౌలిక వసతులు కల్పించేందుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు. కోతుల బెడద నివారణకు సోలార్ కంచె ఏర్పాటు చేస్తామని తెలిపారు. తరగతి గదుల్లో విద్యార్థుల అవనరాన్ని బట్టి ప్రాధాన్యత క్రమంలో బెంచీలు సమకూరుస్తామని పేర్కొన్నారు.అనంతరం పదో తరగతి విద్యార్థులతో కలెక్టర్ ముఖాముఖిగా మాట్లాడారు. వారి చదువు, విద్యా ప్రగతిపై వివరాలు తెలుసుకున్నారు. అనంతరం జీవశాస్త్రంలోని ఒక అంశాన్ని స్వయంగా బోధించి, విద్యార్థులను ప్రశ్నలు అడుగుతూ వారి అవగాహనను పరిశీలించారు.పాఠ్యాంశాలను నిత్యజీవితంలోని అంశాలతో అనుసంధానం చేసుకొని చదివితే విషయ పరిజ్ఞానం మరింత మెరుగుపడుతుందని విద్యార్థులకు సూచించారు. వివిధ రకాల కూరగాయలను తెప్పించి వాటి బరువును విద్యార్థులతో ముందుగా అంచనా వేయించారు. అనంతరం తూనిక యంత్రంతో బరువును కొలిపించి సరైన అంచనా వేసిన విద్యార్థులను అభినందించారు. వారికి పెన్నులను బహుమతులుగా అందించారు. నిత్యజీవితంలోని చిన్న చిన్న అంశాల నుంచి కూడా విజ్ఞానాన్ని పొందాలని సూచించారు. ఈ తనిఖీల్లో జిల్లా విద్యాశాఖ అధికారి భోజన్న, తహసీల్దార్ కమల్ సింగ్, ఎంపీఓ శోభన, ఎంఈఓ ముత్యం, సర్పంచ్ దశరథ్, సర్వే అధికారులు, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థుల ఆధార్ బయోమెట్రిక్ అప్‌డేట్లు త్వరితగతిన పూర్తి చేయాలి: డిఆర్ఓ ఎ.నిర్మల



మహబూబ్ నగర్ ప్రజా కలం ప్రతినిధి అక్టోబర్ 27:

జిల్లాలో 6 నుంచి 18 సంవత్సరాల వయస్సు గల విద్యార్థులకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న 33,601 ఆధార్ బయోమెట్రిక్ నవీకరణలను త్వరితగతిన పూర్తి చేయడంతో పాటు, ఐదేళ్లలోపు పిల్లల ఆధార్ నమోదు, సీడింగ్ ప్రక్రియను వేగవంతం చేయాలని జిల్లా రెవెన్యూ అధికారి (డిఆర్ఓ) ఎ. నిర్మల అధికారులను ఆదేశించారు. విద్య, మహిళా శిశు సంక్షేమ, వైద్య ఆరోగ్య శాఖలు సమన్వయంతో పనిచేస్తూ ప్రత్యేక ఆధార్ శిబిరాలు నిర్వహించాలని సూచించారు.మంగళవారం మహబూబ్‌నగర్ కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో నిర్వహించిన జిల్లా స్థాయి ఆధార్ పర్యవేక్షణ కమిటీ సమావేశంలో ఆమె జిల్లాలో ఆధార్ సేవల పురోగతిని సమీక్షించారు. పాఠశాలలు, జూనియర్ కళాశాలలు, గురుకులాలు, వసతి గృహాల్లో చదువుతున్న విద్యార్థుల ఆధార్ బయోమెట్రిక్ నవీకరణపై ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. ఇందుకోసం అందుబాటులో ఉన్న 25 పాఠశాల ఆధార్ కిట్లను వినియోగించి పెండింగ్ ప్రక్రియను పూర్తి చేయాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో ఆధార్ లేని చిన్నారులను గుర్తించి, పోస్టాఫీసుల్లో అందుబాటులో ఉన్న ఆధార్ కిట్ల ద్వారా కొత్తగా నమోదు చేయించాలని సూచించారు. ఐదేళ్లలోపు పిల్లల ఆధార్ నమోదును ప్రాధాన్యంగా తీసుకోవాలని, అంగన్‌వాడీలు, ప్రభుత్వ పాఠశాలల సహకారంతో అర్హులైన పిల్లలందరికీ ఆధార్ సేవలు అందేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పాఠశాలల వారీగా పెండింగ్ వివరాలను సేకరించి, అత్యధికంగా నవీకరణలు పెండింగ్‌లో ఉన్న విద్యాసంస్థల్లో ప్రాధాన్యత క్రమంలో శిబిరాలు నిర్వహించాలన్నారు. విద్యార్థుల వివరాలను సంబంధిత పోర్టళ్లలో సక్రమంగా నమోదు చేయడంతో పాటు, ఆధార్ సీడింగ్ పురోగతిని నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. ఐదేళ్లు నిండిన పిల్లలకు తప్పనిసరి బయోమెట్రిక్ నవీకరణ పూర్తి చేయడం ద్వారా భవిష్యత్తులో ప్రభుత్వ సేవలు పొందడంలో ఎదురయ్యే ఇబ్బందులను నివారించవచ్చని తెలిపారు.

పిల్లల జనన ధ్రువీకరణ పత్రాల జారీకి అవసరమైన బిఆర్ఎన్ నంబర్లను ఎప్పటికప్పుడు జనరేట్ చేసేలా వైద్య ఆరోగ్య శాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. అనాథాశ్రమాలు, వృద్ధాశ్రమాలు, చెంచు ప్రాంతాల్లో ప్రత్యేక ఆధార్ నమోదు శిబిరాలు నిర్వహించి అర్హులందరికీ సేవలు అందించాలన్నారు.ఆధార్ బయోమెట్రిక్ నవీకరణ సేవలను నిర్ణీత నిబంధనల ప్రకారం ఉచితంగా పొందే అవకాశంపై విద్యార్థులు, తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలని పేర్కొన్నారు. ఆధార్ వివరాల్లో ఇతర మార్పులు అవసరం లేని విద్యార్థుల బయోమెట్రిక్ నవీకరణకు సంబంధించిన విధివిధానాలను స్పష్టంగా వివరించి ప్రక్రియను సులభతరం చేయాలన్నారు. 18 సంవత్సరాలు నిండిన వారికి సంబంధించిన ఆధార్ నమోదు దరఖాస్తులు, ఇతర పెండింగ్ కేసులను కూడా త్వరితగతిన పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు.సమావేశంలో జిల్లా విద్యాశాఖ అధికారి విజయకుమారి, జిల్లా మహిళా శిశు సంక్షేమ అధికారి జరీనా బేగం, జిల్లా ఎస్.సి సంక్షేమ అభివృద్ధి అధికారి సునీత, జిల్లా బి .సి సంక్షేమ అభివృద్ధి అధికారి విష్ణునందన్, జిల్లా ఎస్ .టి సంక్షేమ అభివృద్ధి అధికారి ఛత్రు నాయక్, యూ.ఐ.డి.ఏ.ఐ అసిస్టెంట్ మేనేజర్ శ్రవణ్ కుమార్, ఈ.డి. ఎం చంద్రశేఖర్, వైద్య ఆరోగ్య శాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

త్రోబాల్ పగ్గాలు మహిళల చేతికి

- నూతన అధ్యక్షురాలిగా కృష్ణప్రియ.. కార్యదర్శిగా మౌనిక



పెద్దపల్లి,అక్టోబర్27:(ప్రజాకలం జిల్లా ప్రతినిధి) జిల్లా త్రోబాల్ అసోసియేషన్‌లో సరికొత్త అధ్యాయం మొదలైంది.క్రీడా నాయకత్వంలో మహిళా ప్రాతినిధ్యానికి ప్రాధాన్యమిస్తూ,అసోసియేషన్ కీలక బాధ్యతలను మహిళలకే అప్పగించారు. జిల్లా అధ్యక్షురాలిగా మాటేటి కృష్ణప్రియ, ప్రధాన కార్యదర్శిగా బొల్లి మౌనిక నియమితులయ్యారు.ఈ నియామకానికి సంబంధించిన అధికారిక ఉత్తర్వులను రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కృష్ణారెడ్డి విడుదల చేశారు.తమ నాయకత్వంపై నమ్మకంతో ఈ కీలక బాధ్యతలను అప్పగించిన రాష్ట్ర అసోసియేషన్ ప్రతినిధులకు కృష్ణప్రియ, మౌనిక హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లాలో త్రోబాల్ క్రీడకు పూర్వవైభవం తీసుకొచ్చేందుకు సమగ్ర కార్యాచరణతో ముందుకు వెళ్తామన్నారు.గ్రామీణ స్థాయి నుంచి ప్రతిభావంతులైన క్రీడాకారులను గుర్తించి,వారికి సరైన శిక్షణ,వసతులు కల్పించి రాష్ట్ర,జాతీయ స్థాయిల్లో జిల్లా ఖ్యాతిని చాటేలా తీర్చిదిద్దుతామని స్పష్టం చేశారు.

పేదలకు కియా ఆసుపత్రి సేవలు అభినందనీయం

- కియా ఆసుపత్రి చైర్మన్..వైద్యులకు ఘన సన్మానం



పెద్దపల్లి,అక్టోబర్ 27:(ప్రజాకలం జిల్లా ప్రతినిధి) కరీంనగర్ పట్టణంలోని ప్రముఖ కియా ఆసుపత్రి విజయవంతంగా ఆరు సంవత్సరాలు పూర్తి చేసుకుని ఏడవ సంవత్సరంలోకి అడుగుపెట్టిన సందర్భంగా ఆసుపత్రి యాజమాన్యాన్ని,వైద్యులను ఘనంగా సన్మానించారు.అప్పన్నపేట సర్పంచ్,పెద్దపల్లి బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు ఆరె సంతోష్ కుమార్ ఆసుపత్రి చైర్మన్ డాక్టర్ పుల్లెల రాజేంద్రప్రసాద్,ఆయన సతీమణి శ్రీమతి కీర్తన,అలాగే డాక్టర్ రవీంద్రచారిలను శాలువాలతో సత్కరించి ప్రత్యేక శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ సందర్భంగా ఆరె సంతోష్ కుమార్ మాట్లాడుతూ కియా ఆసుపత్రి గత ఆరేళ్లుగా పేద ప్రజలకు విశేష వైద్య సేవలు అందిస్తూ వారి మన్ననలు పొందుతోందని కొనియాడారు.భవిష్యత్తులో కూడా ఇదే సేవా దృక్పథంతో ముందుకు సాగాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో ఎన్టీపీసీ భవానీ యూత్ ప్రెసిడెంట్ నల్ల నరేష్,మాద రమేష్,చంద శ్రీనివాస్, గంగుల రాజు తదితరులు పాల్గొన్నారు.

పోస్టల్ బీమాతో కుటుంబానికి ఆర్థిక భరోసా



గద్వాల ప్రతినిధి అక్టోబర్ 27 (ప్రజా కలం) : పోస్టల్ శాఖ అందిస్తున్న పోస్టల్ లైఫ్ ఇన్సూరెన్స్ (పీఎల్ఐ), రూరల్ పోస్టల్ లైఫ్ ఇన్సూరెన్స్ (ఆర్పీఎల్ఐ) పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని పోస్టల్ ఏఎస్పీ, ఎం. రవికుమార్ సూచించారు.జోగులాంబ గద్వాల జిల్లా కేంద్రంలోని ప్రధాన తపాలా కార్యాలయంలో మహబూబ్‌నగర్ పోస్టల్ ఎస్పీ ఆదేశాల మేరకు పీఎల్ఐ, ఆర్పీఎల్ఐ బీమా పథకాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎం రవికుమార్ మాట్లాడుతూ:– పోస్టల్ శాఖ అందిస్తున్న బీమా పథకాలు కుటుంబాలకు ఆర్థిక భద్రత కల్పిస్తాయని వివరించారు. ప్రస్తుతం ఈ పథకాలు మున్సిపల్ పరిధిలోనూ అందుబాటులో ఉన్నాయని తెలిపారు. అనంతరం బస్టాండ్, కృష్ణవేణి చౌక్‌తో పాటు ప్రధాన రహదారుల వెంట ప్రజలకు పోస్టల్ బీమా, పథకాల ప్రయోజనాలను వివరించి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో మెయిల్ ఓవర్సీర్లు, బీపీఎంలు, ఏబీపీఎంలు, డాక్ సేవక్‌లు తదితరులు పాల్గొన్నారు.

ఖరీఫ్ పంటల కొనుగోలుకు ఏర్పాట్లు వెంటనే పూర్తి చేయాలి

అదనపు కలెక్టర్ వెంకట మాధవ రావు



నిర్మల్ అక్టోబర్ 27 (ప్రజా కలం జిల్లా ప్రతినిధి) ఖరీఫ్ (వానాకాలం) పంటల కొనుగోలుకు సంబంధించి అన్ని ఏర్పాట్లను వెంటనే పూర్తి చేయాలని అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వెంకట మాధవ రావు అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని తన ఛాంబర్‌లో సంబంధిత శాఖల అధికారులతో ఖరీఫ్ పంటల కొనుగోలుపై నిర్వహించిన సన్నాహక సమావేశంలో ఆయన మాట్లాడారు. పంటల కొనుగోలు ప్రక్రియలో ఎలాంటి ఇబ్బందులు, లోపాలు తలెత్తకుండా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. కొనుగోలు కేంద్రాల్లో రైతులకు అవసరమైన మౌలిక వసతులు కల్పించాలని, పంటల సేకరణ ప్రక్రియను నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు. రైతులకు ఇబ్బందులు కలగకుండా, నిర్ణీత గదువులోగా కొనుగోళ్లు పూర్తయ్యేలా పటిష్టమైన కార్యాచరణతో ముందుకు సాగాలని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో పౌర సరఫరాల శాఖ అధికారులు రాజేందర్, సుధాకర్, డీఆర్డీఓ విజయలక్ష్మి, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

దేవుని గుట్ట పై త్వరలోనే మార్నింగ్ వాక్ ప్రోగ్రాం

మహబూబ్ నగర్ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ యెన్నం శ్రీనివాసరెడ్డి - జర్నలిస్టులకు నా వంతు సహకారం అందిస్తాను

నగర మేయర్ గుమాల్ మమత శ్రీనివాస్ హామీ - జర్నలిస్టులు అందరూ ఐక్యత చాటుకోవాలి

డిప్యూటీ మేయర్ మారేపల్లి సురేందర్ రెడ్డి - దేవుని గుట్ట జర్నలిస్టుల సంక్షేమ సంఘం సారథులకు ఘన సన్మానం



మహబూబ్ నగర్ ప్రజా కలం ప్రతినిధి అక్టోబర్ 27:

మహబూబ్ నగర్ అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలోని జర్నలిస్టుల సంక్షేమానికి తన వంతుగా నిరంతరం సహాయ సహకారం అందిస్తానని మహబూబ్ నగర్ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ యెన్నం శ్రీనివాసరెడ్డి హామీ ఇచ్చారు. నగరంలోని (ఎస్వీఎస్ గుట్ట) దేవుని గుట్ట జర్నలిస్టుల సంక్షేమ సంఘం నూతన అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు కొత్త శ్రీనివాస్, చంద్రశేఖర్ గౌడ్, కోశాధికారి కృష్ణ యాదవ్, కమిటీ గౌరవ సలహాదారులు మంగళగిరి యాదగిరి, డాక్టర్ బండి విజయకుమార్, ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు నరేంద్ర చారి, టీవీ 5 జిల్లా ప్రతినిధి పి. రవి కుమార్, సూర్య దినపత్రిక బ్యూరో ఇంచార్జ్ వరంగల్ శివకుమార్, ఐ న్యూస్ చానల్ బ్యూరో ఇంచార్జ్ చింతకాయల వెంకటేష్, నమస్తే తెలంగాణా పత్రిక విలేఖరి పుట్టిపాగ సతీశ్, 99 టీవీ న్యూస్ చానల్ బ్యూరో ఇంచార్జ్ మెట్టుగాడి ప్రభాకర్, జీఎస్ మీడియా చైర్మన్ జెమిని శేఖర్, తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ జిల్లా కార్యదర్శి మొలకలపల్లి గోపాల్ మహారాజ్, ఐఎంఎఫ్ డబ్ల్యూజే జాతీయ కమిటీ సభ్యుడు పసుపుల శ్రీనివాస్, ప్రజా వెలుతురు పత్రిక ఎడిటర్ కొమ్ము దామోదర్, తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ ఫౌండర్ మెంబర్ ఏముల నర్సిములు, కె. సుకుమార్, సీనియర్ జర్నలిస్టు రవీంద్ర మూర్తి, ఖాజా మైనోద్దీన్, సాక్షి విలేకరి మోహన్ దాస్, కె. ధర్మేందర్, తదితరులు మంగళవారం స్థానిక క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యేను కలిసి మహబూబ్ నగర్ జర్నలిస్టుల సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే దేవుని గుట్ట వద్ద జర్నలిస్టు కాలనీ సమస్యలను తెలుసుకున్నారు. హౌసింగ్ పీడీ ఉపేందర్ కు ఫోన్ చేసి వాస్తవ పరిస్థితిని ఆరా తీశారు. గత ప్రభుత్వ హయాంలో జర్నలిస్టులకు డబల్ బెడ్ రూమ్ ఇళ్ల పథకం కింద ఇండ్లు నిర్మాణం చేపట్టారని తెలిపారు. కొన్ని ఇండ్లు ఇంకా నేటికీ అసంపూర్తిగా ఉన్నాయని వాటిని వెంటనే పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఇప్పటికే ఇండ్లు నిర్మించుకున్న జర్నలిస్టులకు డబల్ బెడ్ రూమ్ ఇళ్ల పథకం కింద ఆర్థిక సహాయం వెసులుబాటుపై పరిశీలన చేయాలని సూచించారు. లోయ మాదిరిగా ఉన్న జర్నలిస్టుల ఇళ్ల స్థలాలను పునాది వరకు చదను చేసే విధంగా చూడాలని మున్సిపల్ ఇంజనీర్లకు సూచించారు. మిషన్ భగీరథ వాటర్ ట్యాంకు కోసం తవ్వుతున్న మట్టిని వీలైతే అక్కడ డంపింగ్ చేయాలని చెప్పారు. మౌలాలి గుట్ట వద్ద నిర్మించిన ఇండ్లకు మొదట కొత్తగా పట్టాలు అందజేసిన తర్వాతనే అక్కడ మౌలిక సదుపాయాలపై దృష్టి సారిస్తారని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. అర్హత కలిగిన అందరికీ మౌలాలి గుట్ట వద్ద ఇండ్లు కేటాయించేందుకు సిద్ధంగా ఉన్నామని తెలిపారు. త్వరలోనే ఎస్వీఎస్ గుట్ట వద్ద జర్నలిస్టుల కాలనీలో మార్నింగ్ వాక్ కార్యక్రమాన్ని చేపడతానని ఈ సందర్భంగా ఎమ్మెల్యే తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పలువురు జర్నలిస్టులు పాల్గొన్నారు.

నా వంతుగా సహాయ సహకారాలు అందజేస్తా: మేయర్ మమత

ఎస్వీఎస్ గుట్ట వద్ద జర్నలిస్టుల కాలనీని క్షేత్రస్థాయిలో పర్యటించిన తర్వాతనే అక్కడ కావలసిన మౌలిక వసతులపై తన పరిధిలోని సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తానని ఈ సందర్భంగా మహబూబ్ నగర్ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ మమతా శ్రీనివాస్ జర్నలిస్టులకు తెలిపారు. దేవుని గుట్ట జర్నలిస్టుల సంక్షేమ సంఘం అధ్యక్ష కార్యదర్శులు శ్రీనివాస్, చంద్రశేఖర్ గౌడ్ ను తన నివాసంలో ఘనంగా శాలువా శాలువాలతో సత్కరించారు. ఈ సందర్భంగా సీనియర్ జర్నలిస్టులు తమ సమస్యలను ప్రస్తావించగా ఆమె పై విధంగా స్పందించారు. జర్నలిస్టుల సమస్యలను అవగతం చేసుకొని గౌరవ శాసనసభ్యుల దృష్టికి తీసుకుపోయి పరిష్కరించేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా జర్నలిస్టులు తమ కాలనీలో రోడ్లు, తాగునీరు, డ్రైనేజీ, కమ్యూనిటీ హాల్, పార్క్ వంటి సమస్యలు ఉన్నాయని తెలిపారు.

జర్నలిస్టులు ఐక్యంగా ఉంటేనే సమస్యల పరిష్కారం: మారేపల్లి సురేందర్ రెడ్డి

ఎస్వీఎస్ గుట్టపై జర్నలిస్టు కాలనీని ఇటీవల తాను మార్నింగ్ వాక్ ద్వారా సందర్శించానని ఈ సందర్భంగా మహబూబ్ నగర్ మున్సిపల్ కార్పొరేషన్ డిప్యూటీ మేయర్ మారేపల్లి సురేందర్ రెడ్డి గుర్తు చేశారు. ఇప్పటికే ఒక సంఘం అక్కడ రిజిస్ట్రేషన్ అయి ఉందని మరో సంఘం ఏర్పాటు చేయడం ఆహ్వానించదగ్గ పరిణామమైనప్పటికీ జర్నలిస్టులం దరూ ఐక్యతను చాటాల్సిన అవసరం ఉందని ఈ సందర్భంగా ఆయన దేవుని గుట్ట జర్నలిస్టుల సంక్షేమ సంఘం కమిటీ పెద్దలకు సూచించారు. సూపర్ సీనియర్ జర్నలిస్టులు కోర్ కమిటీగా జోక్యం చేసుకొని అందరూ ఐక్యంగా ఉండేలా చర్చలు జరుపుకోవాలని సూచించారు. అందరూ కలిసి సమష్టిగా ఉంటేనే సమస్యలు పరిష్కారమవుతాయని సూచించారు. మౌలాలి గుట్ట వద్ద జర్నలిస్టులకు అందరికీ న్యాయం చేసేందుకు ప్రెస్ క్లబ్ కు బాధ్యతలు అప్పగించామని ఈ సందర్భంగా మారేపల్లి సురేందర్ రెడ్డి గుర్తు చేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ కార్యకర్త, మైత్రి ప్రింటర్స్ అధినేత మైత్రి యాదయ్య జోక్యం చేసుకుంటూ కాంగ్రెస్ పై, తమ శాసనసభ్యులపై విశ్వాసం ఉంచిన ప్రతి వర్గానికీ న్యాయం జరుగుతుందని ఈ సందర్భంగా జర్నలిస్టులకు భరోసా ఇచ్చారు.

రైతుల సమన్వయంతో రీ-సర్వే పూర్తి చేయాలి

- జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా



నిర్మల్ అక్టోబర్ 27(ప్రజా కలం జిల్లా ప్రతినిధి) రైతులను సమన్వయం చేసుకుంటూ భూముల రీ-సర్వే ప్రక్రియను పకడ్బందీగా, వేగవంతంగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అధికారులను ఆదేశించారు.మంగళవారం కుంటాల మండలం రాజాపూర్ తాండలో కొనసాగుతున్న భూముల రీ-సర్వే పనులను కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. గ్రామంలో చేపడుతున్న సర్వే పురోగతిని, ఇప్పటివరకు పూర్తయిన పనుల వివరాలను సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. భూముల హద్దుల నిర్ధారణలో ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా క్షేత్రస్థాయిలో సమగ్రంగా పరిశీలించి సర్వే చేపట్టాలని సూచించారు. సర్వే ప్రక్రియలో రైతులకు అవసరమైన అవగాహన కల్పిస్తూ, వారి సమన్వయంతో పనులు చేపట్టాలని అన్నారు. సర్వే సమయంలో సంబంధిత అధికారులు, సిబ్బంది తప్పనిసరిగా క్షేత్రస్థాయిలో అందుబాటులో ఉండాలని స్పష్టం చేశారు. రీ-సర్వే పనులను మరింత సులభతరం చేసి వేగవంతం చేసేందుకు త్వరలో అదనంగా ఆధునిక సర్వే పరికరాలను అందుబాటులోకి తీసుకువస్తామని కలెక్టర్ తెలిపారు. ఎండ తీవ్రతను దృష్టిలో ఉంచుకుని సర్వే సిబ్బంది ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. క్షేత్రస్థాయిలో విధులు నిర్వహించే సిబ్బంది వద్ద తాగునీరు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు తప్పనిసరిగా అందుబాటులో ఉంచుకోవాలని ఆదేశించారు. ఈ తనిఖీల్లో తహసీల్దార్ కమల్ సింగ్, రెవెన్యూ, సర్వే శాఖల అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మంత్రి పొంగులేటి జన్మదిన వేడుకల్లో రక్తదాన శిబిరం

యువత, కాంగ్రెస్ శ్రేణులు పెద్ద సంఖ్యలో తరలిరావాలి: కొక్కిరేణి రమేష్



పాలేరు అక్టోబర్ 27(ప్రజా కలం న్యూస్) మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి జన్మదినం సందర్భంగా కూసుమంచి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నిర్వహించనున్న భారీ రక్తదాన శిబిరాన్ని విజయవంతం చేయాలని కాంగ్రెస్ నాయకుడు కొక్కిరేణి రమేష్ పిలుపునిచ్చారు. వేడుకల్లో భాగంగా బైక్ ర్యాలీ కూడా నిర్వహించనున్నట్లు తెలిపారు. రక్తదానం ప్రాణదానంతో సమానమని, అత్యవసర పరిస్థితుల్లో ఎంతోమందికి ప్రాణాలు కాపాడే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. పాలేరు నియోజకవర్గ యువత, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, మంత్రి అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని రక్తదానం చేసి, బైక్ ర్యాలీని విజయవంతం చేయాలని కోరారు.

క్యాన్సర్ చికిత్సలో యశోద హాస్పిటల్స్ కీలక ముందడుగు

హైటెక్ సిటీలో అత్యాధునిక ఎన్‌జీఎస్ సాంకేతికత ప్రారంభం



ఖమ్మం అక్టోబర్ 27(ప్రజా కలం న్యూస్) ఖమ్మం నగరంలోని క్యాన్సర్‌ను ముందస్తుగా , కచ్చితంగా గుర్తించి రోగులకు మెరుగైన చికిత్స అందించేందుకు హైదరాబాద్ హైటెక్ సిటీ యశోద హాస్పిటల్స్‌లో అత్యాధునిక నెక్స్ట్ జనరేషన్ సీక్వెన్సింగ్ (ఎన్‌జీఎస్) సదుపాయాన్ని ప్రారంభించినట్లు మెడికల్ ఆంకాలజిస్ట్ యశోద హాస్పిటల్ హైటెక్ సిటీ డాక్టర్ లక్ష్మారెడ్డి మేకల తెలిపారు . ఖమ్మం యశోద మెడికల్ సెంటర్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో మాట్లాడుతూ సంప్రదాయ చికిత్సలకు భిన్నంగా రోగి జన్యు మార్పులను గుర్తించి , వ్యక్తిగత అవసరాలకు అనుగుణంగా చికిత్స అందించేందుకు ఈ సాంకేతికత దోహదపడుతుందన్నారు ఊపిరితిత్తులు , రొమ్ము, జీర్ణాశయ సంబంధిత క్యాన్సర్లతో పాటు ఇతర క్యాన్సర్ల చికిత్సలోనూ ఎన్‌జీఎస్ పరీక్షలు కీలకంగా ఉపయోగపడతాయని పేర్కొన్నారు . ఆసుపత్రిలోనే ఈ పరీక్షలు అందుబాటులో ఉండటంతో వేగంగా , కచ్చితంగా ఫలితాలు తెలుసుకొని తగిన చికిత్సను ఎంపిక చేసుకునే అవకాశం ఉంటుందన్నారు . లక్ష్యిత చికిత్సలు , ఇమ్యూనోథెరపీ వంటి ఆధునిక విధానాలు క్యాన్సర్ రోగుల జీవనకాలం , జీవన నాణ్యతను మెరుగుపరచడంలో కీలక పాత్ర పోషిస్తున్నాయని వివరించారు . రోబోటిక్ ఆంకోసర్జరీ , అధునాతన రేడియేషన్ థెరపీతో పాటు సమగ్ర క్యాన్సర్ వైద్య సేవలను యశోద హాస్పిటల్స్ అందిస్తోందన్నారు . అత్యాధునిక సాంకేతికతతో రోగి కేంద్రిత వైద్య సేవలను మరింత విస్తరించడమే లక్ష్యమని అన్నారు . ఈ సమావేశంలో యశోద హాస్పిటల్ మేనేజర్లు బాలరాజు , శ్రీకాంత్ పాల్గొన్నారు .

ఖమ్మంలో తెలంగాణ రక్షణ సేన ఆధ్వర్యంలో పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటరు నమోదు

- ప్రారంభించిన అధ్యక్షులు హుస్సేన్



ఖమ్మం, అక్టోబర్ 27 (ప్రజా కలం న్యూస్):

తెలంగాణ రక్షణ సేన (టీఆర్ఎస్) పార్టీ ఆధ్వర్యంలో వరంగల్-నల్గొండ-ఖమ్మం పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటరు నమోదు కార్యక్రమాన్ని ఖమ్మంలో ప్రారంభించారు. ఖమ్మం జిల్లా అధ్యక్షుడు షేక్ హుస్సేన్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి మూడు జిల్లాల కోఆర్డినేటర్ సయ్యద్ ఇస్మాయిల్, ఖమ్మం పార్లమెంట్ ఇన్‌చార్జ్ అనిత చౌదరి ముఖ్య అతిథులుగా హాజరై ఓటరు నమోదు కార్యక్రమాన్ని ప్రారంభించారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, తమ నాయకురాలు కల్వకుంట్ల కవిత ఆదేశాల మేరకు పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతి కోసం కృషి చేస్తున్న విద్యావంతుడు, ఉద్యమకారుడు సలమాస శ్రీకాంత్ గౌడ్ గారిని అత్యధిక మెజారిటీతో గెలిపించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. సామాజిక న్యాయం, తెలంగాణ రాష్ట్ర హక్కుల పరిరక్షణ, అణగారిన వర్గాలకు రాజకీయ ప్రాతినిధ్యం కల్పించడం లక్ష్యంగా పార్టీ శ్రేణులు ప్రజల్లోకి వెళ్లాలని నాయకులు సూచించారు. ఆదివాసీ, గిరిజన బిడ్డలతో పాటు అన్ని వర్గాల ప్రజల సంక్షేమం, చదువుకున్న వారికి ఉద్యోగాలు, మెరుగైన జీవనోపాధి అవకాశాలు, అందరికీ నాణ్యమైన వైద్యం, రైతులకు మెరుగైన సహకారం, చదువుకున్న యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు కృషి చేయాలని అన్నారు. ముఖ్యంగా అణగారిన వర్గాల బిడ్డలకు న్యాయం జరగాలంటే సామాజిక న్యాయమే మార్గమని పేర్కొన్నారు. పట్టభద్రులు ఓటరు నమోదుపై అవగాహన పెంచుకుని, అర్హులైన ప్రతి ఒక్కరూ తమ పేరును ఓటరు జాబితాలో నమోదు చేసుకునేలా కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు వీరభద్రం, వనం నాగేందర్, కర్లపూడి రఫీ, హరిఫ్, రాజ్ కుమార్, తాళ్లూరు సైదులు, సద్గుర్తి మురళీకృష్ణ, హుస్సేన్ పాల్గొన్నారు.

పి.ఆర్.టి.యు రాష్ట్ర కార్యదర్శి ఓం ప్రకాష్‌కు ఘన సన్మానం



తానూర్, అక్టోబర్ 27(ప్రజా కలం): నిర్మల్ జిల్లా తానూర్ మండలం ఝరి(బి) గ్రామంలోని ప్రాథమిక ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఓం ప్రకాష్ పి.ఆర్.టి.యు రాష్ట్ర కార్యదర్శిగా ఎన్నికైన సందర్భంగా మంగళవారం పాఠశాలలో ఆయనను యువ నాయకుడు గైక్వాడ్ సాయినాథ్ శాలువాతో ఘనంగా సన్మానించారు, ఈ సందర్భంగా సాయినాథ్ మాట్లాడుతూ.. పాఠశాలలోని సమస్యలను సంఘం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించాలని, విద్యార్థులకు మెరుగైన విద్యనందించేలా అభివృద్ధికి కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం అలేఖ్య రెడ్డి, ఉపాధ్యాయులు ధీరజ్, రాజలింగు, నాగేందర్, రవీందర్, సాయి కృష్ణ, రోజారాణి పాల్గొన్నారు.

జాతీయ స్థాయి వూషూ పోటీలకు ఎంపికైన క్రీడాకారులకు కలెక్టర్ భవేశ్ మిశ్రా అభినందన

ఖేలో ఇండియా క్రీడాకారులకు క్రీడా కిట్లు అందజేత



నిర్మల్ అక్టోబర్ 27 (ప్రజా కలం జిల్లా ప్రతినిధి)

రాష్ట్రస్థాయి వూషూ క్రీడా పోటీల్లో పతకాలు సాధించి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన జిల్లా క్రీడాకారులను జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అభినందించారు. మంగళవారం సాయంత్రం కలెక్టరేట్‌లోని తన ఛాంబర్‌లో క్రీడాకారులకు పతకాలు, ప్రశంసాపత్రాలు అందజేసి అభినందించారు. జిల్లా ఖేలో ఇండియా శిక్షణ కేంద్రం విద్యార్థులకు క్రీడా సంబంధిత కిట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రతిభ కనబరిచి జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక కావడం అభినందనీయమన్నారు. జాతీయ స్థాయి పోటీల్లోనూ ఇదే స్ఫూర్తితో రాణించి జిల్లా ఖ్యాతిని ఇనుమడింపజేయాలని క్రీడాకారులకు సూచించారు. క్రీడల్లో నిరంతర సాధన, క్రమశిక్షణ, పట్టుదలతో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. ఈ నెల 24, 25 తేదీల్లో మంచిర్యాల జిల్లా కేంద్రంలో అమెచ్యూర్ వూషూ అసోసియేషన్ ఆఫ్ తెలంగాణ ఆధ్వర్యంలో నిర్వహించిన నాలుగో సీనియర్ రాష్ట్రస్థాయి వూషూ క్రీడా పోటీల ఎంపికల్లో నిర్మల్ జిల్లా ఖేలో ఇండియా శిక్షణ కేంద్రం క్రీడాకారులు సత్తా చాటారు. రెండు బంగారు పతకాలు, ఒక రజత పతకం సాధించి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఖేలో ఇండియా శిక్షణ కేంద్రానికి చెందిన మృణాళిని వింగ్ చున్ విభాగంలో బంగారు పతకం, ఫ్లెక్సిబుల్ వెపన్ విభాగంలో రజత పతకం సాధించగా, జ్ఞానతేజ 60 కేజీల విభాగంలో బంగారు పతకం కైవసం చేసుకున్నారు. బంగారు పతకాలు సాధించిన మృణాళిని, జ్ఞానతేజ డిసెంబర్ 9 నుంచి 15 వరకు అరుణాచల్ ప్రదేశ్‌లోని ఇటానగర్‌లో జరగనున్న 35వ జాతీయ స్థాయి వూషూ క్రీడా పోటీల్లో పాల్గొననున్నారు. అక్టోబర్ 28 నుంచి నవంబర్ 2 వరకు తమిళనాడులోని చెన్నైలో జరగనున్న 25వ జాతీయ స్థాయి వూషూ పోటీల్లో నిర్మల్ జిల్లా ఖేలో ఇండియా శిక్షణ కేంద్రానికి చెందిన మరో ముగ్గురు క్రీడాకారులు పాల్గొననున్నారు. గోర అనన్య తైజీజియన్ విభాగంలో, నార్వాడే ఆయుష్ 45 కేజీల విభాగంలో, నల్ల రామ్ చరణ్ 56 కేజీల విభాగంలో పోటీపడనున్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా యువజన, క్రీడల శాఖ అధికారి శ్రీకాంత్ రెడ్డి, ఖేలో ఇండియా వూషూ శిక్షకులు శ్రీరాముల సాయికృష్ణ, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లలను గుర్తించాలి : ఎంఈఓ ఏ బిక్షపతి

(వరంగల్/పర్వతగిరి) అక్టోబర్ 27, ప్రజాకలం ప్రతినిధి: ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లలను ఉపాధ్యాయులు గుర్తించాలని పర్వతగిరి మండల విద్యాశాఖ అధికారి ఏ. బిక్షపతి ప్రధానోపాధ్యాయులకు తెలిపారు. పాఠశాలల్లో, కాకళాశాలల్లో ప్రత్యేక అవసరాలు గలిగిన పిల్లలను గుర్తించేందుకు విద్యాశాఖ రూపొందించిన ప్రశస్తి యాప్ గురించి గవర్నమెంట్, ప్రైవేటు పాఠశాలల హెడ్మాస్టర్ లకు, జూనియర్ కాలేజీ ల ప్రిన్సిపాల్ లకు అవగాహన కార్యక్రమం మంగళవారం జెడ్ పి ఎస్ ఎస్ పర్వతగిరి పాఠశాలలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ప్రత్యేక అవసరాలు కలిగిన విద్యార్థులను గుర్తించడం ద్వారా వారికి తగిన విధంగా విద్యను అందించేందుకు అవకాశం ఉంటుందని అన్నారు. ఈ శిక్షణ కార్యక్రమానికి రిసోర్స్ పర్సన్స్ (ఆర్ పి) గా నాగేశ్వర్ రావు, రాజేంద్ర ప్రసాద్, అశోక్ వ్యవహరించి ప్రశస్తి యాప్ పైన ఉపాధ్యాయులకు శిక్షణ అందించారు. ఈ కార్యక్రమంలో జెడ్ పి ఎస్ ఎస్ పాఠశాల ఇంచార్జి హెడ్మాస్టర్ పాక రమేష్ బాబు, అన్ని పాఠశాలల హెడ్మాస్టర్లు, కళాశాల ప్రిన్సిపాల్ లు, ఎమ్మార్సీ సిబ్బంది పాల్గొన్నారు.



జవులా (బి)లో ఖేత్ బచావో అభియాన్ అవగాహన సదస్సు

తానూర్,అక్టోబర్ 27(ప్రజా కలం): మండలంలోని జవులా (బి) రైతు వేదికలో మంగళవారం 'ఖేత్ బచావో అభియాన్'పై రైతుల అవగాహన సదస్సు నిర్వహించారు, వ్యవసాయ అధికారి ఏవో మనీషా ఖేత్ బచావో అభియాన్ ముఖ్య ఉద్దేశాలను రైతులకు వివరించారు, భూమిని, వ్యవసాయాన్ని రక్షించుకోవాల్సిన విధానాలపై అవగాహన కల్పించారు, ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్, ఎఇఓ, స్థానిక రైతులు పాల్గొన్నారు.



గజ్వేల్‌లో ఎల్‌నినో ప్రభావంపై విద్యార్థులకు అవగాహన

- తుంకుంట ఆంక్ష రెడ్డి ఆధ్వర్యంలో 3 వేల మంది విద్యార్థులతో భారీ ర్యాలీ

- మహతి ఆడిటోరియంలో నీటి సంరక్షణ, విద్యుత్ పొదుపుపై అవగాహన సభ



గజ్వేల్:27 అక్టోబర్ (ప్రజా కలం ప్రతినిధి)

గజ్వేల్: భవిష్యత్తులో ఎల్‌నినో ప్రభావంతో తలెత్తే నీటి ఎద్దడి,విద్యుత్ కొరత వంటి సమస్యలపై ప్రజలకు, ముఖ్యంగా విద్యార్థులకు అవగాహన కల్పించాలనే లక్ష్యంతో సిద్దిపేట జిల్లా కాంగ్రెస్ అధ్యక్షురాలు తుంకుంట ఆంక్ష రెడ్డి ఆధ్వర్యంలో గజ్వేల్‌లో భారీ అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు.ఇందులో భాగంగా సుమారు 3 వేల మంది విద్యార్థులతో పట్టణంలో భారీ ర్యాలీ నిర్వహించి,అనంతరం మహతి ఆడిటోరియంలో అవగాహన సభ ఏర్పాటు చేశారు.ఈ సందర్భంగా నీటి సంరక్షణ,విద్యుత్ పొదుపు, ప్రకృతి వనరుల పరిరక్షణపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. వాతావరణ మార్పులు,ఎల్‌నినో ప్రభావం వంటి నవాళ్లను సమర్థవంతంగా ఎదుర్కోవాలంటే ప్రతి ఒక్కరూ ఇప్పటి నుంచే అప్రమత్తంగా ఉండాలని వక్తలు సూచించారు.ఈ సందర్భంగా తుంకుంట ఆంక్ష రెడ్డి మాట్లాడుతూ,నీటిని పొదుపుగా వినియోగించడం ప్రతి ఒక్కరి బాధ్యతని పేర్కొన్నారు. నీటిని వృథా చేయకుండా,అందుబాటులో ఉన్న వనరులను జాగ్రత్తగా వినియోగించాలని సూచించారు. అదేవిధంగా అవసరం లేని సమయంలో విద్యుత్ దీపాలు,ఫ్యాన్లు,ఇతర విద్యుత్ పరికరాలను ఆపివేయడం ద్వారా విద్యుత్‌ను ఆదా చేయవచ్చని వివరించారు.విద్యార్థులు తమ ఇళ్లకే పరిమితం కాకుండా పాఠశాలలు, కళాశాలలు, పరిసర ప్రాంతాల్లోనూ నీటి సంరక్షణ,విద్యుత్ పొదుపుపై ప్రజలకు అవగాహన కల్పించాలని పిలుపునిచ్చారు. నేటి విద్యార్థులే రేపటి పౌరులని,వారిలో పర్యావరణ పరిరక్షణపై బాధ్యతను పెంపొందించడం ద్వారా సమాజంలో సానుకూల మార్పు తీసుకురావచ్చని పేర్కొన్నారు. నీటి సంరక్షణ,విద్యుత్ పొదుపు ప్రభుత్వాల బాధ్యత మాత్రమే కాదని,ప్రతి పౌరుడి సామాజిక బాధ్యతని వక్తలు స్పష్టం చేశారు.భవిష్యత్తు తరాలకు ప్రకృతి వనరులను అందించాలంటే వాటిని పొదుపుగా వినియోగించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో పోలీసు శాఖ నుంచి సీఐ రవికుమార్,మున్సిపల్ శాఖ నుంచి కమిషనర్ గణేష్ రెడ్డి, వ్యవసాయ శాఖ నుంచి ఏఓ నాగరాజు,విద్యుత్ శాఖ నుంచి ఏడీ జగదీష్‌తో పాటు వివిధ కళాశాలల అధ్యాపకులు పాల్గొని విద్యార్థులకు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, ప్రజా సంఘాల ప్రతినిధులు, వివిధ కళాశాలల విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



విస్లావత్ సరియా మృతి కుటుంబానికి ఆర్థిక సాయం అందజేసిన గ్రామ సర్పంచ్ విస్లావత్ శ్రీను నాయక్ ఉప సర్పంచ్ పద్మ రవి నాయక్

మహేశ్వరం, అక్టోబర్ 27, (ప్రజా కలం):

మహేశ్వరం నియోజకవర్గ కందుకూరు మండలం సార్లరావుపల్లి గ్రామ పంచాయతీ సిబ్బంది విస్లావత్ సరియా అనారోగ్యంతో మృతి చెందారు. వారి మృతి పట్ల గ్రామ పెద్దలు తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. విషయం తెలుసుకున్న వెంటనే గ్రామ సర్పంచ్, ఉప సర్పంచ్, గ్రామ పెద్దలు వారి కుటుంబాన్ని పరామర్శించి, ధైర్యంగా ఉండాలని భరోసా ఇచ్చారు. సరియా ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు. మృతురాలి కుటుంబాన్ని ఆదుకోవడానికి గ్రామ నాయకులు తమ వంతు ఆర్థిక సహాయం అందించారు.గ్రామ సర్పంచ్ విస్లావత్ శ్రీను నాయక్ – రూ. 11,000 ఉప సర్పంచ్ పద్మ రవి నాయక్ – రూ. 5,000 మాజీ ఉప సర్పంచ్ శ్రీరామ్ నాయక్ రూ. 5,000,గ్రామ అధ్యక్షులు సంతోష్ నాయక్ రూ. 2,000,మొత్తం రూ.23,000 లను బాధిత కుటుంబానికి అందజేసి మానవత్వం చాటుకున్నారు.ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు పి. గోపాల్, వి. శ్రీను, వి. బిక్కు, ఎన్. గోపాల్, బి. బాలు, కె. శ్రీను, డి.జె. శ్రీను, ఎం. సోంలా (సికిందర్) తదితరులు పాల్గొన్నారు.

పోలీస్ అమరవీరుల స్ఫూర్తితో గజ్వేల్‌లో భారీ సైకిల్ ర్యాలీ

- భారీగా పాల్గొన్న పాఠశాల విద్యార్థులు

- స్మార్ట్‌ఫోన్లకు దూరంగా ఉండాలి. చదువుపై దృష్టి సారించాలి

- ఉన్నత లక్ష్యాలను చేరుకోవాలని విద్యార్థులకు పోలీసుల సూచన



గజ్వేల్, అక్టోబర్ 27 (ప్రజా కలం ప్రతినిధి)

పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని సిద్దిపేట పోలీస్ కమిషనర్ రష్మీ పెరుమాళ్,ఐపీఎస్ ఆదేశాల మేరకు మంగళవారం గజ్వేల్ పట్టణంలో పాఠశాల విద్యార్థులతో భారీ సైకిల్ ర్యాలీ నిర్వహించారు. గజ్వేల్ ఇన్‌స్పెక్టర్ రవికుమార్,ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ నాయుక్తంగా ఈ కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తా నుంచి ప్రారంభమైన సైకిల్ ర్యాలీ బసవేశ్వర విగ్రహం మీదుగా గజ్వేల్ పోలీస్ స్టేషన్ వరకు ఉత్సాహంగా సాగింది..వివిధ ప్రైవేట్ పాఠశాలలకు చెందిన విద్యార్థినీ, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని ర్యాలీని విజయవంతం చేశారు.

ఈ సందర్భంగా ఇన్‌స్పెక్టర్ రవికుమార్,ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ మాట్లాడుతూ. సమాజంలో శాంతిభద్రతల పరిరక్షణకు,ప్రజల రక్షణకు విధి నిర్వహణలో ప్రాణాలర్పించిన పోలీస్ అమరవీరుల త్యాగాలను స్మరించుకోవడమే సంస్మరణ దినోత్సవ ప్రధాన ఉద్దేశమని తెలిపారు. అమరవీరుల త్యాగాలను ప్రజలకు, ముఖ్యంగా యువతకు తెలియజేయాలనే లక్ష్యంతో సైకిల్ ర్యాలీ నిర్వహించినట్లు పేర్కొన్నారు.

విద్యార్థులు స్మార్ట్‌ఫోన్ల వినియోగాన్ని తగ్గించి,తమ అమూల్యమైన సమయాన్ని చదువుకు కేటాయించాలని పోలీసులు సూచించారు.చదువుపై ఏకాగ్రతతో కృషి చేస్తూ,క్రమశిక్షణను అలవర్చుకుని ఉన్నత లక్ష్యాలను సాధించాలని పిలుపునిచ్చారు. విద్యార్థులు మంచి అలవాట్లను పెంపొందించుకుని భవిష్యత్తులో సమాజానికి ఉపయోగపడే పౌరులుగా ఎదగాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో పోలీస్ అధికారులు,సిబ్బంది,పాఠశాలల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మీ సురక్ష 2.0లో భాగంగా మల్కాజిగిరిలో పోలీసుల ప్రత్యేక కార్యక్రమం

20 పోలీసు బృందాలతో జియో ట్యాగింగ్.. 230 సీసీటీవీ కెమెరాల నమోదు

మల్కాజిగిరి, అక్టోబరు 27 (ప్రజా కలం ప్రతినిధి): పోలీస్ కమిషనర్ బి. సుమతి ఐపీఎస్ ఆదేశాల మేరకు మీ సురక్ష 2.0 కార్యక్రమంలో భాగంగా మల్కాజిగిరి పోలీస్ స్టేషన్ పరిధిలో



ప్రత్యేక భద్రతా చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగా 20 పోలీసు బృందాలను ఏర్పాటు చేసి, కాలనీల్లో నివసించే ప్రజల భద్రతకు ప్రాధాన్యమిస్తూ వివిధ కార్యక్రమాలు నిర్వహించారు.

ఇళ్లలో పనిచేసే పనివారు, వాచ్‌మెన్లు, డ్రైవర్లు, అద్దెకు నివసించే వారి వివరాలను సేకరించి మీ సురక్ష వెబ్‌సైట్‌లో జియో ట్యాగింగ్ చేశారు. అదేవిధంగా సీసీటీవీ కెమెరాల ప్రాధాన్యతపై ప్రజలకు అవగాహన కల్పించారు. నేరాల నియంత్రణలో, నేరస్తులను గుర్తించడంలో సీసీటీవీ కెమెరాలు కీలక పాత్ర పోషిస్తాయని వివరించారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఎంఎం ఆర్ సినీ ప్లానెట్, మారుతి నగర్ ప్రాంతాల్లో 230 సీసీటీవీ కెమెరాలను జియో ట్యాగింగ్ చేశారు.

ఈ కార్యక్రమంలో మల్కాజిగిరి ఏసీపీ యాదగిరి రెడ్డి,పోలీస్ స్టేషన్ ఎస్‌హెచ్‌ఓ విజయ్ కుమార్, డీఐ, ఎస్‌ఐలు, ఇతర పోలీసు సిబ్బంది పాల్గొన్నారు. ప్రజల సహకారంతో కాలనీల్లో భద్రతను మరింత బలోపేతం చేయడంతో పాటు నేరాల నివారణకు చర్యలు తీసుకుంటున్నట్లు పోలీసులు తెలిపారు.

రేషన్ డీలర్ల సమరశంఖం..

- లక్ష మందితో హైదరాబాద్‌లో నిరసన..

- కాంగ్రెస్ హామీలు అమలు చేయాలి: జీఎంఆర్..



పటాన్‌చేరు, అక్టోబర్ 27 (ప్రజా కలం) ప్రతినిధి

రేషన్ డీలర్ల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించకపోతే లక్ష మందితో హైదరాబాద్‌లో భారీ నిరసన చేపడతామని పటాన్‌చేరు శాసనసభ్యుడు, రాష్ట్ర రేషన్ డీలర్ల సంఘం గౌరవాధ్యక్షుడు గూడెం మహిపాల్ రెడ్డి హెచ్చరించారు.

డీలర్ల సంక్షేమానికి సంపూర్ణ సహకారం అందిస్తామని స్పష్టం చేశారు. మంగళవారం సిద్దిపేట జిల్లా గజ్వేల్‌లో తెలంగాణ రాష్ట్ర రేషన్ డీలర్ల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన గౌరవ వేతన సాధన సభ,నూతన రాష్ట్ర కమిటీ ప్రమాణస్వీకార కార్యక్రమానికి మాజీ మంత్రి తన్నీరు హరీశ్ రావుతో కలిసి ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా మహిపాల్ రెడ్డి మాట్లాడుతూ, కరోనా మహమ్మారి, ప్రకృతి విపత్తుల సమయంలోనూ ప్రజలకు నిత్యావసర సరుకులు అందించిన రేషన్ డీలర్ల సేవలు అభినందనీయమన్నారు. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. హామీల అమలులో ప్రభుత్వం విఫలమైందని విమర్శిస్తూ,స్పందించకపోతే రాష్ట్రవ్యాప్తంగా డీలర్లను సమీకరించి పెద్దఎత్తున ఉద్యమిస్తామని హెచ్చరించారు.

ఈ కార్యక్రమంలో జడ్చర్ల శాసనసభ్యుడు అనిరుధ్ రెడ్డి, శాసనమండలి సభ్యుడు యాదవ రెడ్డి,మాజీ శాసనసభ్యులు,సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నాయికోటి రాజు, ప్రతినిధులు, రేషన్ డీలర్లు పాల్గొన్నారు..

విలేకరులు కావలెను

నిత్యనూతనంగా వెలువడుతూ,
పాఠకుల విశేష ప్రజాదరణ పొందుతూ
విజయవంతంగా రెండు తెలుగు రాష్ట్రాలలో నడపబడుతున్న
'ప్రజాకలం' తెలుగు దినపత్రికకు
జర్నలిజంపై ఆసక్తి, తెలుగు భాష పట్ల అవగాహన కలిగి
వ్రాయడం, చదవడంతో పాటు ప్రస్తుత సమాజం పట్ల బాధ్యత
కలిగిన విలేకరులు అన్ని జిల్లాల నుండి బ్యూరో ఇన్‌చార్జ్‌లు, స్టాఫ్
రిపోర్టర్లు మండలాల వారిగా కావలెను.

ప్రజా కలం
PRAJA KALAM Telugu Daily తెలుగు దినపత్రిక

తెలంగాణలో జిల్లాల వారిగా ఇంఛార్జ్ కావలెను



సంప్రదించాల్సిన నంబరు:
+91 95535 39999

ఆంధ్రప్రదేశ్‌లో జిల్లాల వారిగా ఇంఛార్జ్ కావలెను

ఐదసారి రక్తదానం..

సేవలో కాంగ్రెస్ నేత సోహెల్ ఖాన్



వేములవాడ, అక్టోబర్ 27 (ప్రజా కలం ప్రతినిధి):

పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో మంగళవారం వేములవాడ పట్టణంలోని మహాలింగేశ్వర ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన మెగా రక్తదాన శిబిరానికి విశేష స్పందన లభించింది.శిబిరంలో 400 మందికి పైగా స్వచ్ఛందంగా రక్తదానం చేసి మానవత్వాన్ని చాటుకున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా రాష్ట్ర ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, జిల్లా ఎస్పి మహేష్ బిగితే హాజరై శిబిరాన్ని ప్రారంభించి ఆపదలో ఉన్నవారి ప్రాణాలను కాపాడేందుకు రక్తదానం ఎంతో దోహదపడుతుందని చాటిచెప్పారు,ఈ రక్తదాన శిబిరం కార్యక్రమంలో భాగంగా వేములవాడ పట్టణానికి చెందిన కాంగ్రెస్ పార్టీ జిల్లా మైనార్టీ కార్యదర్శి సోహెల్ ఖాన్ ఐదోసారి రక్తదానం చేసి తన సేవాభావాన్ని చాటుకున్నారు. అత్యవసర సమయాల్లో రక్తం అందించి రోగుల ప్రాణాలను కాపాడే అవకాశం రక్తదానం ద్వారా లభిస్తుందన్నారు,ఈ సందర్భంగా కాంగ్రెస్ నేత సోహెల్ ఖాన్ మాట్లాడుతూ యువత గంజాయి వంటి మత్తు పదార్థాలకు బానిసలై జీవితాలను నాశనం చేసుకోవద్దని సూచించారు. మత్తు పదార్థాలకు దూరంగా ఉంటూ సమాజానికి ఉపయోగపడే సేవా కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనాలని కోరారు. రక్తదానం చేయడం ద్వారా ఆపదలో ఉన్నవారికి ప్రాణదానం చేసినట్లవుతుందని, యువతలో సేవా దృక్పథాన్ని పెంపొందించేందుకు ఇలాంటి కార్యక్రమాలు దోహదపడతాయని పేర్కొన్నారు.అనంతరం రక్తదానం చేసిన సోహెల్ ఖాన్‌కు డీఎస్పీ శ్రీనివాసులు, పట్టణ సీఐ బి. వీరప్రసాద్ అభినందించి ధ్రువీకరణ పత్రాన్ని అందజేశారు.

వేములవాడలో పోలీసుల ఆధ్వర్యంలో మెగా రక్తదాన శిబిరం.

- సేవాభావానికి ప్రతీకగా నిలిచిన పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవాలు.

- రక్తదానం ప్రాణదానంతో సమానం..ప్రభుత్వ విప్ ఆది .



వేములవాడ,
అక్టోబరు 27 (ప్రజా కలం ప్రతినిధి)

పోలీస్ అమరవీరుల త్యాగాలకు ఘన నివాళి..ఆపదలో ఉన్నవారికి అండగా నిలిచే మానవీయ సంకల్పం..వెరసి వేములవాడలో మెగా రక్తదాన శిబిరం విజయవంతమైంది,జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో మంగళవారం మహా లింగేశ్వర్ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన ఈ శిబిరంలో సుమారు 400 మందికి పైగా స్వచ్ఛందంగా రక్తదానం చేసి సేవాభావాన్ని చాటుకున్నారు, ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే హాజరై శిబిరాన్ని ప్రారంభిం చారు.

రక్తదానం.. మరొకరికి పునర్జన్మ...

ఆవదలో ఉన్నవారికి రక్తదానం చేయడం ప్రాణదానంతో సమానమని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. ప్రతి ఒక్కరూ స్వచ్ఛంద రక్తదానానికి ముందుకు రావాలని పిలుపునిచ్చారు. దేశ రక్షణ, అంతర్గత భద్రత, శాంతిభద్రతల పరిరక్షణ కోసం ప్రాణాలర్పించిన పోలీస్ అమరవీరుల త్యాగాలు నమాజానికి స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. వారి సేవలను స్మరించుకుంటూ సమాజానికి ఉపయోగపడే కార్యక్రమాల్లో భాగస్వాములు కావడమే నిజమైన నివాళి అని అన్నారు, ప్రజలకు భరోసా.. నేరస్తులకు హెచ్చరిక పోలీసు శాఖ శాంతిభద్రతల పరిరక్షణతోపాటు సామాజిక సేవా కార్యక్రమాల్లోనూ ముందుంటోందని ఆది శ్రీనివాస్ తెలిపారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ ఫ్రెండ్లీ పోలీసింగ్‌తో ప్రజలకు అండగా నిలుస్తున్నామని, అయితే ఈ విధానం ప్రజల కోసమేనని, నేరస్తుల కోసం కాదని స్పష్టం చేశారు. నేరాలకు పాల్పడేవారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. 'అరైవ్ అలైవ్' కార్యక్రమం ద్వారా రోడ్డు భద్రతపై అవగాహన కల్పించడంతోపాటు, మత్తు పదార్థాల దుష్ప్రభావాలపై యువతలో చైతన్యం తీసుకొస్తున్నట్లు వివరించారు.రక్తదాతలే ప్రాణదాతలని పోలీస్ అమరవీరుల సంస్మరణ కార్యక్రమాల్లో భాగంగా అక్టోబరు 21 నుంచి వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే తెలిపారు.

అత్యవసర పరిస్థితుల్లో రక్తం అందక ఎవరి ప్రాణాలూ ప్రమాదంలో పడకూడదన్న ఉద్దేశంతో రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశామన్నారు. ఆరోగ్యవంతులైన ప్రతి ఒక్కరూ రక్తదానంపై అవగాహన పెంచుకుని, ఆపదలో ఉన్నవారికి ప్రాణదాతలుగా నిలవాలని కోరారు. అనంతరం రక్తదాతలకు ధ్రువపత్రాలు అందజేశారు. ఈకార్యక్రమంలో డీఎస్పీలు శ్రీనివాసులు,నాగేంద్రచారి, వెంకటేశ్వర్లు, మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు, వైస్ చైర్మన్ నరాల శేఖర్, సీఐలు వీరప్రసాద్, శ్రీనివాస్, రవీందర్, రవి, నాగేశ్వరరావు, ఆర్ఐలు సురేష్, రమేష్, రెడ్ క్రాస్ సొసైటీ చైర్మన్ గూడూరి రవీందర్, వేణు కుమార్, పాతురి సంజీవ రెడ్డి, శ్రీధర్, డాక్టర్ సంతోష్, ఎస్ఐలు, పోలీసు సిబ్బంది, మీడియా ప్రతినిధులు ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి రోప్ స్కిప్పింగ్ ఛాంపియన్‌షిప్‌లో

దేవేంద్ర విద్యాలయ విద్యార్థులకు ద్వితీయ స్థానం

విద్యార్థులను అభినందించిన కరస్పాండెంట్ టి. శ్వేత డైరెక్టర్ టి విజయేందర్



మహేశ్వరం అక్టోబర్ 27 (ప్రజా కలం)

ఉత్తరప్రదేశ్‌లోని మీరట్‌లో నిర్వహించిన అండర్-14 జాతీయ స్థాయి రోప్ స్కిప్పింగ్ ఛాంపియన్‌షిప్‌లో తుక్కుగూడ లోని దేవేంద్ర విద్యాలయం (సీబీఎస్ఈ) విద్యార్థులు ద్వితీయ స్థానం (రెండవ బహుమతి) సాధించి పాఠశాలకు గర్వకారణంగా నిలిచారు. జాతీయ స్థాయిలో వివిధ రాష్ట్రాల నుండి వచ్చిన జట్లతో పోటీపడి తమ ప్రతిభను చాటిన విద్యార్థులు రెండవ బహుమతిని కైవసం చేసుకున్నారు. విద్యార్థులు తమ ప్రతిభ, పట్టుదల, కృషితో ఈ ఘనత సాధించడం పట్ల పాఠశాల యాజమాన్యం హర్షం వ్యక్తం చేసింది.

విజేతలుగా నిలిచిన విద్యార్థులు:

టి రితీష్ ఈ రణదీష్,డి. రమాన్ష్,ఎన్ అభినవ్ గౌడ్ ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ టి. శ్వేత, డైరెక్టర్ టి విజయేందర్ ప్రిన్సిపాల్ జి.రథయ్య ఫిజికల్ డైరెక్టర్ భవర్ సింగ్ విద్యార్థులను ప్రత్యేకంగా అభినందించారు. జాతీయ స్థాయిలో పాఠశాల కీర్తి పతాకాన్ని ఎగురవేసిన విద్యార్థులకు హృదయపూర్వక అభినందనలు తెలియజేస్తూ, భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.దేవేంద్ర విద్యాలయ కీర్తి పతాకాన్ని జాతీయ స్థాయిలో ఎగురవేసిన విద్యార్థులకు విద్యాసంస్థ యజమాన్యం అభినందనలు తెలిపారు.

ఇందుప్రియాల్‌లో 'మన పోలీస్--మన ఊరు'

గ్రామ భద్రతకు 16 సీసీ కెమెరాలు..

గ్రంథాలయం ప్రారంభించిన సీపీ రష్మి పెరుమాళ్.

దుబ్బాక ప్రజాకలం అక్టోబర్ 27.

దౌల్తాబాద్ మండలం ఇందుప్రియాల్ గ్రామంలో మంగళవారం నిర్వహించిన 'మన పోలీస్--మన ఊరు' కార్యక్రమంలో సిద్దిపేట పోలీస్ కమిషనర్ రష్మి పెరుమాళ్, ఐపీఎస్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రామంలో ఏర్పాటు చేసిన 16 సీసీ కెమెరాలను, గ్రామస్థుల సహకారంతో నిర్మించిన గ్రంథాలయాన్ని ప్రారంభించారు. గ్రామానికి చేరుకున్న సీపీకి గ్రామస్తులు కోలాటాలు, బంజారా



గిరిజనుల సంప్రదాయ నృత్యాలతో ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ ప్రజలకు, పోలీసులకు మధ్య సంబంధాలను బలోపేతం చేయడమే 'మన పోలీస్--మన ఊరు' కార్యక్రమం లక్ష్యమన్నారు. గ్రామ భద్రతకు సీసీ కెమెరాలు అదనపు రక్షణ కవచంలా ఉపయోగపడతాయని, ఇతర గ్రామాలు కూడా ఇందుప్రియాల్‌ను ఆదర్శంగా తీసుకుని కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. యువత స్మార్ట్‌ఫోన్లకు బానిసలు కాకుండా పుస్తక పఠనంపై దృష్టి సారించి ఉన్నత స్థాయికి ఎదగాలని పిలుపునిచ్చారు. విద్యార్థులు ప్రదర్శించిన ట్రాఫిక్ భద్రత, డ్రగ్స్ నిర్మూలన, సైబర్ నేరాలపై ముగ్గులు, సాంస్కృతిక కార్యక్రమాలు, అవగాహన నాటికలను సీపీ అభినందించారు. యువతను ప్రోత్సహించేందుకు గ్రామ యువత, పోలీసు బృందం మధ్య నిర్వహించిన వాలీబాల్ మ్యాచ్‌ను ప్రారంభించారు. హెల్మెట్ ధరించాలని, రాంగ్ సైడ్ డ్రైవింగ్ చేయవద్దని, మైనర్లకు వాహనాలు ఇవ్వకూడదని సూచించారు. అపరిచితులకు ఓటీపీలు వెల్లడించవద్దని, సైబర్ మోసానికి గురైతే వెంటనే 1930 నంబర్‌కు ఫిర్యాదు చేయాలని తెలిపారు.

రాష్ట్ర ముదిరాజ్ కార్పొరేషన్ చైర్మన్ బొర్ర జ్ఞానేశ్వర్ కు దసరా శుభాకాంక్షలు తెలిపిన రాష్ట్ర ముదిరాజ్ మహాసభ సెక్రటరీ గుండెమోని అంజయ్య ముదిరాజ్

మహేశ్వరం, అక్టోబర్ 27, (ప్రజా కలం):

తెలంగాణ రాష్ట్ర ముదిరాజ్ కార్పొరేషన్ చైర్మన్ బొర్ర జ్ఞానేశ్వర్ కు తెలంగాణ రాష్ట్ర ముదిరాజ్ మహాసభ రాష్ట్ర సెక్రటరీ గుండెమోని అంజయ్య ముదిరాజ్ మర్యాదపూర్వకంగా కలిసి విజయదశమి (దసరా) పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా చైర్మన్ కి పుష్పగుచ్ఛం అందజేసి, శాలువాతో ఘనంగా సత్కరించారు. రాష్ట్రంలో ముదిరాజ్ వర్గ అభివృద్ధి కోసం కార్పొరేషన్ ద్వారా చేపడుతున్న సంక్షేమ కార్యక్రమాలపై ఈ సందర్భంగా చర్చించారు.అనంతరం గుండెమోని అంజయ్య ముదిరాజ్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో అత్యధిక జనాభా కలిగిన ముదిరాజ్ వర్గానికి కార్పొరేషన్ ద్వారా మరిన్ని సంక్షేమ పథకాలు అందాలని, విద్య, ఉపాధి, ఆర్థిక అభివృద్ధి రంగాల్లో ముదిరాజ్ యువతకు చేయూతనివ్వాలని చైర్మన్ ని కోరారు. ముదిరాజ్ కులస్తులు ఎదుర్కొంటున్న సమస్యలను, ముఖ్యంగా మహేశ్వరం నియోజకవర్గంలోని ముదిరాజుల సమస్యలను చైర్మన్ దృష్టికి తీసుకెళ్లారు. దసరా పండుగ సందర్భంగా చైర్మన్ కూడా అంజయ్య ముదిరాజ్ కి తిరిగి శుభాకాంక్షలు తెలిపారు. ముదిరాజ్ వర్గ అభ్యున్నతికి కార్పొరేషన్ ఎల్లప్పుడూ కృషి చేస్తుందని, వారి సంక్షేమమే తమ ప్రధాన లక్ష్యమని హామీ ఇచ్చారు.ఈ కలయిక స్నేహపూర్వక వాతావరణంలో జరిగింది. ఈ కార్యక్రమంలో ముదిరాజ్ సంఘం నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



పోలీస్ ఫ్లాగ్ డే వీక్ లో భాగంగా విద్యార్థులకు వ్యాసరచన పోటీలు

- వ్యాసరచ పోటీలో ఉత్సాహంగా పాల్గొన్న విద్యార్థులు

- పోలీస్ ఫ్లాగ్ డే వీక్ లో భాగంగా వారోత్సవాలు నిర్వహిస్తున్నాం

- మహేశ్వరం ఎస్‌హెచ్‌ఓ రాఘవేందర్ రెడ్డి



మహేశ్వరం, అక్టోబర్ 27, (ప్రజా కలం):

పోలీసు అమరవీరుల వారోత్సవా ల్లో భాగంగా మహేశ్వరం మండల కేంద్రంలోని ఓ కన్వెన్షన్ హాల్‌లో విద్యార్థులకు వ్యాసరచన పోటీలు ఘనంగా నిర్వహించారు. డీజీపీ సి.వి. ఆనంద్, ఫ్యూచర్ సిటీ కమిషనర్ తరుణ్ జోషి సూచనల మేరకు డీసీపీ నారాయణరెడ్డి, ఏసీపీ జానకి రెడ్డి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగిందని మహేశ్వరం ఎస్‌హెచ్‌ఓ రాఘవేందర్ రెడ్డి తెలిపారు. సైబర్ నేరాల నివారణ, మాదకద్రవ్యాల దుష్పరిణామాలు, సోషల్ మీడియా దుర్వినియోగం, మాదకద్రవ్య రహిత తెలంగాణ నిర్మాణంలో విద్యార్థుల పాత్ర వంటి అంశాలపై పోటీలు నిర్వహించినట్లు ఆయన తెలిపారు.

విద్యార్థుల భారీ భాగస్వామ్యం:

ఈ కార్యక్రమంలో ప్రభుత్వ డిగ్రీ, జూనియర్ కళాశాలలు, పాలిటెక్నిక్ కళాశాల, మోడల్ స్కూల్‌తో పాటు శ్రీ చైతన్య, అక్షర విద్యాసంస్థలకు చెందిన 1,000 మందికి పైగా విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. పోలీసు అమరవీరుల త్యాగాలను స్మరించుకోవ డంతో పాటు విద్యార్థుల్లో సామాజిక బాధ్యత, భద్రతపై అవగాహన పెంపొందించడమే ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశమని పేర్కొన్నారు.విద్యార్థులు మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని, సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉంటూ సోషల్ మీడియాను బాధ్యతాయుతంగా వినియోగించాలని మహేశ్వరం పోలీసులు పిలుపునిచ్చారు.ఈ సందర్భంగా వ్యాసరచన పోటీల్లో పాల్గొన్న వివిధ విద్యాసంస్థల యాజమాన్యానికి, ఉపాధ్యాయులకు, విద్యార్థులకు ఎస్‌హెచ్‌ఓ కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో ఎస్సైలు మారయ్య, ప్రసాద్, ధనుంజయ్, ఏఎస్సైలు శ్రీనివాస్ రెడ్డి, రాంలాల్, పోలీస్ సిబ్బంది, విద్యాసంస్థల ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



శాసన మండలి డిప్యూటీ చైర్మన్ బండ ప్రకాష్ కు దసరా శుభాకాంక్షలు తెలిపిన రాష్ట్ర ముదిరాజ్ మహాసభ సెక్రటరీ గుండెమోని అంజయ్య ముదిరాజ్

మహేశ్వరం, అక్టోబర్ 27, (ప్రజా కలం):

తెలంగాణ శాసన మండలి డిప్యూటీ చైర్మన్ బండ ప్రకాష్ ని తెలంగాణ రాష్ట్ర ముదిరాజ్ మహాసభ రాష్ట్ర సెక్రటరీ గుండెమోని అంజయ్య ముదిరాజ్ మర్యాదపూర్వకంగా కలిసి విజయదశమి (దసరా) పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా డిప్యూటీ చైర్మన్ గారికి పుష్పగుచ్ఛం అందజేసి, శాలువాతో ఘనంగా సత్కరించి దసరా శుభాకాంక్షలు తెలిపారు. ఈ కలయిక సందర్భంగా రాష్ట్రంలో ముదిరాజ్ వర్గ అభివృద్ధి, బీసీల సంక్షేమం కోసం ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలపై చర్చించారు. ముదిరాజ్ వర్గానికి రాజకీయంగా, సామాజికంగా మరింత ప్రాధాన్యత కల్పించాలని, మహేశ్వరం నియోజకవర్గంలోని ముదిరాజ్ కులస్తుల సమస్యలను పరిష్కరించాలని ఈ సందర్భంగా బండ ప్రకాష్ దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు.దసరా పండుగను పురస్కరించుకొని బండ ప్రకాష్ కూడా అంజయ్య ముదిరాజ్ కి తిరిగి శుభాకాంక్షలు తెలిపారు. ముదిరాజ్ వర్గ అభ్యున్నతికి తన వంతు సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని హామీ ఇచ్చినట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో ముదిరాజ్ సంఘం నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



ఓటు హక్కుపై కాంగ్రెస్ పోరు..

- అర్హులైన ప్రతి ఓటరుకు హక్కు కల్పించడమే లక్ష్యం

- ఓటరు జాబితా తప్పుల సవరణపై

పటాన్‌చెరులో సమీక్ష సమావేశం..

పటాన్‌చెరు, అక్టోబర్ 27 (ప్రజా కలం) ప్రతినిధి

ప్రజాస్వామ్య పరిరక్షణ, అర్హులైన ప్రతి ఓటరుకు ఓటు హక్కు కల్పించడం, ఓటరు జాబితాల్లో తప్పులను సరిచేయడమే లక్ష్యంగా పటాన్‌చెరులో కాంగ్రెస్ పార్టీ కార్యాచరణకు శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగా పటాన్‌చెరు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి కాట శ్రీనివాస్ గౌడ్ తన నివాసంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఓటు హక్కును కాపాడుకోవాలనే సందేశంతో చేపట్టిన ప్రజాస్వామ్య పరిరక్షణ కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన ఈ సమావేశానికి అఖిల భారత కాంగ్రెస్ కమిటీ పరిశీలకుడు సరల్ పటేల్, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు చంద్రశేఖర్ రెడ్డి, సమన్వయకర్తలు నాగరిగారి ప్రీతమ్, గూడూరు శ్రీనివాస్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని నాయకులు చర్చించారు. ఓటరు జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియలో చోటుచేసుకున్న తప్పులను గుర్తించి, అర్హులైన ఓటర్ల పేర్లు తొలగిపోకుండా జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరాన్ని వివరించారు. ప్రజాస్వామ్య విలువలను కాపాడటంతోపాటు ప్రతి పౌరుడి ఓటు హక్కును పరిరక్షించేందుకు క్షేత్రస్థాయిలో ప్రజలకు అవగాహన కల్పించాలని సమావేశంలో చర్చించారు..



మెండోరా పోలీస్ స్టేషన్‌ను క్షుణ్ణంగా తనిఖీ చేసిన నిజామాబాద్ సీపీ పి. సాయి చైతన్య

- ఫిర్యాదుదారులతో మర్యాదగా ప్రవర్తించాలి - మహిళల భద్రతకు ప్రథమ ప్రాధాన్యత ఇవ్వాలి
- త్వరలో రాబోయే పుష్కరాల విధులకు సిబ్బంది సిద్ధంగా ఉండాలి





నిజామాబాద్, అక్టోబరు 27: (ప్రజా కలం ప్రతినిధి)

ఆర్మూర్ సబ్ డివిజన్ పరిధిలోని మెండోరా పోలీస్ స్టేషన్‌ను నిజామాబాద్ పోలీస్ కమిషనర్ పి. సాయి చైతన్య (ఐపీఎస్) మంగళవారం క్షుణ్ణంగా తనిఖీ చేశారు. పోలీస్ స్టేషన్‌కు చేరుకున్న కమిషనర్‌కు సిబ్బంది గౌరవ వందనం సమర్పిం చారు. అనంతరం ఆయన సిబ్బంది కిట్ ఆర్టికల్స్‌ను క్షుణ్ణంగా తనిఖీ చేసి, స్టేషన్ ఆవరణ అంతా కలియతిరి . ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్‌లోని కేసుల నమోదు, దర్యాప్తు పురోగతి, పెండింగ్ కేసుల వివరాలు, ఫిర్యాదుల పరిష్కారం, రికార్డుల నిర్వహణను సీపీ సమగ్రంగా పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. పోలీస్ స్టేషన్‌కు వచ్చే ప్రతి ఫిర్యాదుదారుడితో మర్యాదగా, గౌరవంగా వ్యవహరిం చాలని, వారి సమస్యలను ఓర్పుతో విని చట్టపరమైన పరిష్కారం చూపాలని సిబ్బందికి సూచిం చారు. ప్రతి ఒక్కరూ పోలీసు శాఖ ఇమేజ్ పెంచే విధంగా కృషి చేయాలని పిలుపునిచ్చారు.

ముఖ్యంగా మహిళలు, బాలికలకు సంబంధించిన ఫిర్యాదులపై పోలీసులు త్వరితగతిన స్పందించి, బాధితులకు భరోసా కల్పిస్తూ చట్టప్ర కారం తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. మహిళా బాధితులు ఎటువంటి భయాందోళనలు లేకుండా సమస్యలను చెప్పుకునేలా స్టేషన్‌లో అనుకూల వాతావరణాన్ని కల్పించా లన్నారు. ఇలాంటి కేసుల దర్యాప్తులో నిర్లక్ష్యం వహించకుండా, అవసరమైన ఆధారాలను సేకరించి నిర్ణీత కాలవ్యవధిలో దర్యాప్తు పూర్తి చేసి బాధితులకు సకాలంలో న్యాయం అందించాలని స్పష్టం చేశారు. పెండింగ్ కేసుల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారించి దర్యాప్తును వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు.

పుష్కరాల విధులకు సిద్ధంగా ఉండాలి

రాబోయే రోజుల్లో జరగనున్న పుష్కరాలను దృష్టిలో ఉంచుకుని అధికారులు, సిబ్బంది 24ఴ7 తమ హెడ్ క్వార్టర్స్‌లోనే అందుబాటులో ఉండాలని, ముందస్తుగా విధులకు ప్రిపేర్ అయి ఉండాలని సీపీ సూచిం చారు. అత్యవసరమైతే తప్ప దూర ప్రాంతాల ప్రయాణాలకు దూరంగా ఉండాలన్నారు. సిబ్బంది ప్రతి ఆరు నెలలకు ఒకసారి తప్పనిసరిగా హెల్త్ చెకప్ చేయించుకోవాలని, బైక్ నడిపేటప్పుడు హెల్మెట్ ధరించి, ట్రాఫిక్ రూల్స్ పాటిస్తూ ఇతరులకు ఆదర్శంగా నిలవాలని పేర్కొన్నారు.

ఈ తనిఖీ కార్యక్రమంలో ఆర్మూర్ ఏసీపీ వెంకటేశ్వర రెడ్డి, సీసీఆర్‌బీ ఏసీపీ గురు నాయుడు, ఆర్మూర్ రూరల్ ఇన్స్పెక్టర్ జన్ రెడ్డి, మెండోరా ఎస్ఐ జె. సుహాసిని మరియు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



ఎల్-నినో ముప్పు..

- ఆరుతడి పంటలే దిక్కు - వరి సాగు తగ్గించాలి
- ఒక్క ఎకరం వరి నీటితో.. నాలుగు ఎకరాల ఆరుతడి సాగు
- పచ్చల నడుకుడ అవగాహన సదస్సులో వ్యవసాయాధికారులు

నిజామాబాద్,(ప్రజా కలం ప్రతినిధి) అక్టోబరు 27:

పసిఫిక్ మహాసముద్రంలో ఏర్పడిన మార్పుల వల్ల ఎల్-నినో ప్రభావం తీవ్రంగా ఉంటుందని, రానున్న యాసంగి సీజన్‌లో రైతులు వరి సాగును తగ్గించి ఆరుతడి పంటల వైపు మొగ్గు చూపాలని మండల వ్యవసాయ అధికారి బి. రాజు సూచించారు. మంగళవారం వేల్పూర్ మండలంలోని పచ్చల నడుకుడ గ్రామంలో ఎల్-నినో ప్రభావం – యాసంగి ఆరుతడి పంటల సాగుపై రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పసిఫిక్ మహాసముద్రంలో ఉష్ణోగ్రతలు పెరగడం వల్ల వచ్చే ఏడాది ఫిబ్రవరి వరకు ఎల్-నినో ప్రభావం తీవ్రంగా ఉండే అవకాశం ఉందన్నారు. దీనివల్ల వర్షాభావ పరిస్థితులు ఏర్పడి, భూగర్భ జలాలు గణనీయంగా పడిపోయే ప్రమాదం ఉందని హెచ్చరించారు. రైతులు సంప్రదాయ వరి సాగుకు స్వస్తి చెప్పి.. తక్కువ నీటితో ఎక్కువ లాభాలు ఇచ్చే పంటలను ఎంచుకోవాలన్నారు. ఒక్క ఎకరం వరికి వాడే నీటితో.. 3 నుంచి 4 ఎకరాల్లో ఆరుతడి పంటలను సాగు చేసుకోవచ్చని స్పష్టం చేశారు. రైతులు తమకున్న నీటి వసతిని బట్టి మొక్కజొన్న, జొన్న, సజ్జలు, పెసర్లు, మినుములు, శనగలు, పొద్దుతిరుగుడు, నువ్వులు, వేరుశెనగ, ఆవాలు వంటి పంటలను సాగు చేసి ఆర్థికంగా లాభపడాలని శాస్త్రవేత్తలు సూచిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఈఓ సుభాష్య, సర్పంచ్ కే. నర్సయ్య, ఉపసర్పంచ్ ఎన్. రఘుపతి, పంచాయతీ కార్యదర్శి శాంతి కుమార్, కాంగ్రెస్ నాయకులు గుడాల మోహన్, గట్టవతల నర్సారెడ్డి, కిసాన్ సెల్ అధ్యక్షుడు టక్కరి గంగాధర్, ఆశా వర్కర్లు, అంగన్‌వాడీ టీచర్లు మరియు గ్రామ రైతులు పాల్గొన్నారు.

వేల్పూర్‌లో మంత్రి సీతక్క ఆకస్మిక పర్యటన: ఇందిరమ్మ ఇళ్ల పరిశీలన

నిజామాబాద్,
(ప్రజా కలం ప్రతినిధి) అక్టోబరు 27:

నిజామాబాద్ జిల్లా వేల్పూర్ మండల కేంద్రంలో రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క మంగళవారం ఆకస్మికంగా పర్యటించారు. ఈ సందర్భంగా స్థానిక ఇందిరమ్మ కాలనీని సందర్శించిన ఆమె, లబ్ధిదారులు నిర్మించుకుంటున్న ఇళ్లను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. కాలనీలో నెలకొన్న రహదారులు, తాగునీరు, విద్యుత్ వంటి మౌలిక సదుపాయాల సమస్యలను స్థానికులను అడిగి తెలుసుకున్నారు.

కాలనీ మీదుగా ప్రమాదకరంగా వేలాడుతున్న విద్యుత్ లైన్ల సమస్యను, అంతర్గత రోడ్ల నిర్మాణ ఆవశ్యకతను కాలనీవాసులు మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై ఆమె తక్షణమే స్పందిస్తూ, సంబంధిత శాఖల నూవరింటెండింగ్ ఇంజినీర్లతో (ఎస్ఈలు) ఫోన్‌లో మాట్లాడారు.



కాలనీవాసులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా, విద్యుత్ లైన్ల పునరుద్ధరణతో పాటు మౌలిక సమస్యల పరిష్కారానికి యుద్ధప్రాతిపదికన చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు.

ప్రకృతి వైపరీత్యాలపై బీఆర్ఎస్ తప్పుడు ప్రచారం: మంత్రి ధ్వజం

అనంతరం మంత్రి సీతక్క విలేకరులతో మాట్లాడుతూ ప్రతిపక్ష బీఆర్ఎస్ పార్టీ తీరుపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. వాతావరణ మార్పుల వల్ల సంభవించే ఎల్‌నినో ప్రభావం, కరువు పరిస్థితులను కూడా రాజకీయాలకు ముడిపెడుతూ బీఆర్ఎస్ తప్పుడు ప్రచారాలతో ప్రజలను తప్పుదోవ పట్టిస్తోందని విమర్శించారు. పదేళ్లపాటు అధికారంలో ఉన్నప్పుడు ప్రజా సమస్యలను గాలికొదిలేసిన నాయకులు, ఇప్పుడు ప్రతిపక్షంలోకి రాగానే బురదజల్లడమే వనిగా పెట్టుకున్నారని ఆక్షేపించారు.

గతంలో వరదలు, కరోనా మహమ్మారి లాంటి సంక్షోభాలు వచ్చినప్పుడు కాంగ్రెస్ పార్టీ బాధ్యతాయుతమైన ప్రతిపక్షంగా ప్రభుత్వానికి సహకరించిందని గుర్తుచేశారు. కానీ నేడు బీఆర్ఎస్ రైతులు, ప్రజల్లో అనవసర భయాందోళనలు సృష్టిస్తోందని మండిపడ్డారు. నాడు కేసీఆర్ ముందుచూపు లేకుండా మాట్లాడారు..

కరోనా సమయంలో అసెంబ్లీలో తాను మాస్కుల గురించి అడిగితే అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ తనను అవమానకర రీతిలో మాట్లాడారని మంత్రి గుర్తుచేశారు. కేవలం ఒక పారాసిటిమాల్ గోలీ వేసుకుంటే కరోనా తగ్గుతుందని, 30 డిగ్రీల వేడి దాటితే వైరస్ చనిపోతుందంటూ నాడు బీఆర్ఎస్ ప్రభుత్వం ముందుచూపు లేకుండా వ్యవహరించిందని దుయ్యబట్టారు.

ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం అలా కాకుండా, ఎల్‌నినో పరిస్థితులపై ముందుగానే అప్రమత్తం చేస్తూ రైతులను, ప్రజలను ఆదుకునేందుకు సిద్ధంగా ఉందని స్పష్టం చేశారు. ప్రజా సంక్షేమమే లక్ష్యంగా ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం, మహిళా అభ్యున్నతి, గ్రామీణ వికాసానికి తమ ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. తప్పుడు ప్రచారాలను ప్రజలు నమ్మరని, వారే తగిన బుద్ధి చెబుతారని సీతక్క పేర్కొన్నారు.

ఘనంగా శ్రీ రేణుక ఎల్లమ్మకు ప్రత్యేక పూజలు

- అమ్మవారిని దర్శించుకుంటే భక్తులకు శుభాలు కలుగుతాయి
-మాజీ ఎంపీటీసీ పాల్వంచ అరుణ కృష్ణ గౌడ్ దంపతులు

మెదక్ అక్టోబర్ 27(ప్రజాకలం (ప్రతినిధి) ఆదిశక్తి పరాశక్తి శ్రీ రేణుక ఎల్లమ్మను దర్శించుకుంటే భక్తులందరికీ శుభాలు కలుగుతాయని మాజీ ఎంపీటీసీ పాల్వంచ అరుణ కృష్ణ గౌడ్ దంపతులు అన్నారు. మెదక్ జిల్లా కొల్చారం మండల కేంద్రంలోని శ్రీ రేణుక మాత ఆలయంలో మంగళవారం ప్రత్యేక పూజా కార్యక్రమాలు భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. కొల్చారం గ్రామానికి చెందిన పాల్వంచ అరుణ కృష్ణ గౌడ్ దంపతులు అమ్మవారికి అభిషేకం, అలంకరణ,



అర్చన కార్యక్రమాలను నిర్వహించారు. ఆలయ అర్చకులు పులుగుర్త నాగరాజు శర్మ, భగవాన్ శర్మ వేదమంత్రోచ్చారణల నడుమ పూజా కార్యక్రమాలను శాస్త్రోక్తంగా జరిపించారు. ఈ సందర్భంగా అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి భక్తులు పూజలు నిర్వహించారు. పూజా కార్యక్రమాలకు భక్తులు అధిక సంఖ్యలో హాజరై అమ్మవారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. శ్రీ రేణుక ఎల్లమ్మ ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని, గ్రామ ప్రజలు సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని పాల్వంచ అరుణ కృష్ణ గౌడ్ దంపతులు అమ్మవారిని ప్రార్థించారు. ఈ కార్యక్రమంలో పాల్వంచ రామకృష్ణ గౌడ్, అశోక్ గౌడ్, వడ్ల ప్రభాకర్, పంచాయతీ కార్యదర్శి ప్రశాంత్, శివకుమార్ గౌడ్, ఆశన్నగారి అంజయ్య, కమ్మరి దశరథం, కుమ్మరి నాగయ్య, పాప గౌడ్, కృష్ణ గౌడ్ (కిట్టు), సుధాకర్ గౌడ్, సత్యనారాయణ, పాల్వంచ యాదమ్మ, రుక్మిణి, లలిత, మౌనిక తదితరులు పాల్గొన్నారు.

పోలీస్ అమరుల త్యాగం అజరామరం

వారి కుటుంబాలకు పోలీసుశాఖ అండ
- హెబ్రోసు చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు
చేసిన ఎస్పీ మహేష్ బి. గితే.

రాజన్న సిరిసిల్ల అక్టోబర్ 27 (ప్రజా కలం ప్రతినిధి) : సమాజంలో శాంతిభద్రతల పరిరక్షణ కోసం విధులు నిర్వర్తిస్తూ ప్రాణత్యాగం చేసిన పోలీసు అమరవీరుల త్యాగాలు చిరస్మరణీయమని జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే అన్నారు. పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా



మంగళవారం సిరిసిల్ల పట్టణంలోని హెబ్రోసు చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అమరవీరుల ఆత్మలకు శాంతి చేకూరాలని, వారి కుటుంబ సభ్యులు ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో ఉండాలని చర్చి పాస్టర్లు, ఫాదర్లతో కలిసి ప్రార్థించారు.ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ప్రజల రక్షణ, శాంతిభద్రతల పరిరక్షణ కోసం ప్రాణాలను సైతం లెక్కచేయకుండా విధులు నిర్వహించిన పోలీసు అమరవీరుల సేవలను సమాజం ఎప్పటికీ గుర్తుంచుకుంటుందని పేర్కొన్నారు. విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన అమరవీరుల కుటుంబాలకు పోలీసుశాఖ ఎల్లవేళలా అండగా ఉంటుందని, వారి సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యమిస్తుందని తెలిపారు.సమాజంలో మతసామరస్యం, శాంతిసామరస్యాలు వెల్లివిరియాలని, ప్రజలందరికీ శాంతి, సౌభాగ్యాలు కలగాలని చర్చి ప్రతినిధులతో కలిసి ప్రార్థించినట్లు తెలిపారు. ఈకార్యక్రమంలో ఎస్పీ వెంట డీఎస్పీ నాగేంద్రచారి, సీఐ శ్రీనివాస్, చర్చి పాస్టర్లు, ఫాదర్లు పాల్గొన్నారు.

మంత్రి వాకిటి శ్రీహరికి దసరా శుభాకాంక్షలు తెలిపిన రాష్ట్ర ముదిరాజ్ మహాసభ సెక్రటరీ గుండెమోని అంజయ్య ముదిరాజ్



మహేశ్వరం, అక్టోబర్ 27, (ప్రజా కలం): తెలంగాణ రాష్ట్ర పశుసంవర్ధక, పాడిపరిశ్రామికాభివృద్ధి, మత్స్య, క్రీడలు మరియు యువజన సర్వీసుల శాఖల మంత్రి వాకిటి శ్రీహరి ని తెలంగాణ రాష్ట్ర ముదిరాజ్ మహాసభ రాష్ట్ర సెక్రటరీ గుండెమోని అంజయ్య ముదిరాజ్ మర్యాదపూర్వకంగా కలిసి విజయదశమి (దసరా) పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ సందర్భంగా మంత్రికి పూల బొకే అందజేసి, శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు.

రాష్ట్రంలో ముదిరాజ్ వర్గ అభివృద్ధికి ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలకు మంత్రి కృషి చేస్తున్న తీరును ఈ సందర్భంగా అభినందించారు.అనంతరం గుండెమోని అంజయ్య ముదిరాజ్ మాట్లాడుతూ రాష్ట్రంలో బీసీలలో అత్యధిక జనాభా కలిగిన ముదిరాజ్ వర్గానికి ప్రభుత్వం నుండి మరింత ప్రాధాన్యత ఇవ్వాలని, మత్స్య, పాడి పరిశ్రమలలో ముదిరాజులకు సంబంధించిన సంక్షేమ పథకాలను మరింత విస్తృతంగా అమలు చేయాలని మంత్రి ని కోరినట్లు తెలిపారు. ముదిరాజ్ కులస్తుల సమస్యలను మంత్రి దృష్టికి తీసుకెళ్లారు.దసరా పండుగను పురస్కరించుకొని మంత్రి వాకిటి శ్రీహరి కూడా అంజయ్య ముదిరాజ్ కి తిరిగి దసరా శుభాకాంక్షలు తెలిపారు. ముదిరాజ్ వర్గ అభ్యున్నతికి ప్రభుత్వం కట్టుబడి ఉందని, వారి సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని మంత్రి హామీ ఇచ్చినట్లు తెలిపారు.

వికలాంగులకు అండగా చార్జింగ్ సైకిళ్ల పంపిణీ.



దుబ్బాక ప్రజాకలం అక్టోబర్ 27.

సద్గురు స్వామి వారి ఆర్థిక సహకారంతో, దౌల్తాబాద్ మండల యువ నాయకుడు ఖలీల్ ఉద్దీన్ ఆధ్వర్యంలో మండలవ్యాప్తంగా 15 చార్జింగ్ సైకిళ్లను పంపిణీ చేశారు. ఇందులో భాగంగా తిరుమలాపూర్ గ్రామానికి చెందిన వికలాంగురాలు సంధిలా సౌందర్యకు చార్జింగ్ సైకిల్ అందజేశారు. ఈ సైకిల్‌తో సౌందర్య రోజువారీ ప్రయాణంలో ఎదుర్కొంటున్న ఇబ్బందులు తగ్గడంతో పాటు, స్వతంత్రంగా రాకపోకలు సాగించేందుకు దోహదపడనుంది.

ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ అవసరంలో ఉన్న వికలాంగులకు అండగా నిలవడం అభినందనీయమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి ఆర్థిక సహకారం అందించిన సద్గురు స్వామికి, పంపిణీకి కృషి చేసిన ఖలీల్ ఉద్దీన్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ భూపాల్ రెడ్డి, అంగడి రాజయ్య, ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు అంగడి జలంధర్ మాదిగ, మండల కోశాధికారి నల్క కరుణాకర్ మాదిగ పాల్గొన్నారు.

డ్రోన్ పోటీలకు గీతం జోరు..

తెలంగాణ జట్టులో గీతం విద్యార్థుల హవా..
ఇద్దరికి జాతీయ స్థాయి పోటీల్లో చోటు..

పటాన్‌చేరు, అక్టోబర్ 27 (ప్రజా కలం) ప్రతినిధి

జాతీయ స్థాయి డ్రోన్ పోటీలకు తెలంగాణ నుంచి ఎంపికైన నలుగురు క్యాడెట్లలో ఇద్దరు గీతం హైదరాబాద్ విద్యార్థులే కావడం విశేషం. ఎ. అభినవ్ సాయి కార్తీక్, తమ్ములూరి కావ్య తమ ప్రతిభతో జాతీయ పోటీలకు ఎంపికై గీతం విశ్వవిద్యాలయానికి గుర్తింపు తీసుకొచ్చారు. తమిళనాడులోని తిరుచెంగోడ్‌లో ఉన్న కేఎన్ రంగస్వామి సాంకేతిక కళాశాలలో అక్టోబర్ 23 నుంచి నవంబర్ 4 వరకు జరిగే అఖిల భారత అంతర్ డైరెక్టరేట్ డ్రోన్ పోటీలు--2026లో వీరు ఆంధ్రప్రదేశ్, తెలంగాణ డైరెక్టరేట్ తరపున పాల్గొంటున్నారు. గీతం ఎన్‌సీసీ సహాయ అధికారి



లెఫ్టినెంట్ ఎస్. అజయ్ కుమార్ మాట్లాడుతూ, జాతీయ స్థాయి పోటీలకు క్యాడెట్లు ఎంపిక కావడం గర్వకారణమని తెలిపారు. గీతం హైదరాబాద్ ఉన్నతాధికారులు విద్యార్థులను అభినందించి, భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు..

రహీంఖాన్ గూడలో ఇందిరమ్మ ఇళ్ల ఎంపికపై పునఃపరిశీలన చేయాలి

అర్హులైన నిరుపేదలందరికీ న్యాయం చేయాలని డిమాండ్

- సర్పంచ్ నవ్వ శృతి అరవింద్

బీబీనగర్, అక్టోబర్ 27 (ప్రజాకలం): ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక జాబితాను మరోసారి పరిశీలించి, అర్హులైన నిరుపేదలకు న్యాయం చేయాలని రహీంఖాన్‌గూడ గ్రామ సర్పంచ్ నవ్వ శృతి అరవింద్ కోరారు. మంగళవారం గ్రామ పాలకవర్గ సభ్యులు, గ్రామస్థులతో కలిసి మండల ఎంపీడీవో కార్యాలయంలో వినతిపత్రం



అందజేశారు. ఎంపిక చేసిన లబ్ధిదారుల అర్హతలను క్షేత్రస్థాయిలో పునఃపరిశీలించాలని అధికారులను కోరారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు నిజమైన అర్హులకు అందేలా ఎంపిక ప్రక్రియలో పారదర్శకత పాటించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో చిన్నరావులపల్లి సర్పంచ్ కొమిరె శ్రీకాంత్, ఉపసర్పంచ్ మంచాల ప్రభాకర్, మాజీ సర్పంచ్ మంచాల రవికుమార్, మాజీ ఉపసర్పంచ్ రాపాక జంగయ్య యాదవ్, వార్డు సభ్యులు ఎలిమినేటి శంకర్‌రెడ్డి, కడమంచి నిర్మల నరసింహ, మంచాల రేణుక రమేష్, బీఆర్ఎస్ పార్టీ ప్రధాన కార్యదర్శి పంజాల భువనేశ్వర్‌గౌడ్, నాయకులు నోముల రాంరెడ్డి, మంచాల నరహరి, మునుకుంట్ల సత్యనారాయణగౌడ్, ఆల్వాల కాటమయ్యగౌడ్, ఆల్వాల దుర్గయ్యగౌడ్, బద్దం మోహన్‌రెడ్డి, మారబోయిన జగన్, దర్శనం బొబ్బిలి, పబ్బాల కృష్ణ, మారబోయిన మధుసూదన్ తదితరులు పాల్గొన్నారు.

టెలిఫోన్ ఉద్యోగులు "సత్యనిష్ఠ ప్రతిజ్ఞ" చేశారు

నిజామాబాద్,(ప్రజా కలం ప్రతినిధి) అక్టోబరు 27:

అక్టోబర్ 26నుంచి 31వరకు "విజిలెన్స్ అవేర్నెస్ వీక్ -2026" అంతర్గతంగా మహానగర్ టెలిఫోన్ నిగమ్ లిమిటెడ్ (ఎంటిఎన్ఎల్) కు చెందిన అధికారులు ఉద్యోగులు సిబ్బంది వారు సత్యనిస్థ ను ఆచరిస్తామని ప్రతిజ్ఞ చేశారు.



అయితే ముఖ్యంగా ప్రతి పౌరుడు అప్రమత్తంగా ఉండాలని, ఎల్లప్పుడూ నిజాయితీ సత్యనిష్ఠ యొక్క అత్యున్నత ప్రమాణాలకు కట్టుబడి ఉండాలని, అవినీతికి వ్యతిరేకంగా పోరాటానికి తమ మద్దతు అంటూ అభిప్రాయమని అన్నారు. జీవితంలోని అన్ని రంగాలలో నిజాయితీగా చట్ట నియమాలను పాటిస్తాం. లంచం తీసుకోను మరియు ఇవ్వము, అన్ని ప్రజల పనులను నిజాయితీగా పారదర్శకంగా చేస్తామని, ప్రజా ప్రయోజనాల కోసం పని చేస్తాం, తమ వ్యక్తిగత ప్రవర్తనలో నిజాయితీని చూపించి ఆదర్శంగా నిలుస్తాం అంటూ ఉద్యోగులు ప్రతిజ్ఞ చేశారు. ఈ ప్రతిజ్ఞ కార్యక్రమంలో ఎంటిఎన్ఎల్ జోన్-3 నందపాట్కర్ రోడ్ విలే పార్లేకు చెందిన డిప్యూటీ మేనేజర్ కిరణ్ కుమార్, డిజిఎం చెల్లి డిసౌజా, సుంకరి సదానంద్, కాంతి బాలేకర్, ప్రసూన్ ముఖర్జీ, కొక్కు నర్సింగ రావు, ఖర్బారీ బోబాడే, రాజీవ్ మౌర్య, చంద్ర ప్రకాష్ నెగి, విజయ్ మిశ్రా, గజానంద్ షిండే, కోలి మేడం, వృందా గుప్తా, అరుణ్ కిని, సునీల్ యాదవ్ తదితరులు ఉత్సాహంగా పాల్గొన్నారు.

మోర్తాడ్ పోస్టాఫీస్ వద్ద పింఛన్‌దారుల అవస్థలు!

ప్రజలకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలని అధికారులకు విజ్ఞప్తి

నిజామాబాద్,(ప్రజా కలం ప్రతినిధి) అక్టోబరు 27:

నిజామాబాద్ జిల్లా మోర్తాడ్ మండల కేంద్రంలోని పోస్టాఫీస్ వద్ద పింఛన్ల కోసం వచ్చే ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్న పరిస్థితి కనిపిస్తోంది. పింఛన్ కోసం వచ్చిన ప్రజలు పోస్టాఫీస్ ప్రవేశ ద్వారం వద్ద గుమిగూడి ఉండడం, భవనం చుట్టూ పిచ్చిమొక్కలు పెరిగి ఉండడం సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లాల్సిన అంశంగా మారింది. ప్రభుత్వ పింఛన్లపై ఆధారపడి జీవిస్తున్న వృద్ధులు, దివ్యాంగులు, ఇతర లబ్ధిదారులు పింఛన్ తీసుకునేందుకు వచ్చినప్పుడు వారికి తగిన సౌకర్యాలు కల్పించడం సంబంధిత అధికారుల బాధ్యత. ప్రజలు ఇబ్బందులు పడకుండా అవసరమైన ఏర్పాట్లు చేయాలని స్థానికులు కోరుతున్నారు. సంబంధిత పోస్టల్ అధికారులు స్పందించాలి: పోస్టాఫీస్ పరిసరాలను శుభ్రంగా ఉంచడంతో పాటు, పింఛన్ల పంపిణీ సమయంలో ప్రజలకు ఇబ్బందులు కలగకుండా తగిన ఏర్పాట్లు చేయాలి. అవసరమైతే క్రమబద్ధమైన క్యూలైన్, నీడ, తాగునీరు వంటి సౌకర్యాలు కల్పించే అంశాన్ని పరిశీలించాలి. జిల్లా పోస్టల్ ఉన్నతాధికారులు ఈ పరిస్థితిని పరిశీలించి, ప్రజలకు మెరుగైన సేవలు అందేలా తగిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి. ప్రజలకు ఇబ్బందులు లేని పింఛన్ పంపిణీనే లక్ష్యంగా అధికారులు చర్యలు తీసుకోవాలి.



భూ రీసర్వేను పకడ్బందీగా చేపట్టాలి

భూముల వివరాల నమోదులో కచ్చితత్వం పాటించాలి

- కలెక్టర్ అనురాగ్ జయంతి



బీబీనగర్, అక్టోబరు 27 (ప్రజాకలం): భూ రీసర్వే పనులను పకడ్బందీగా నిర్వహిస్తూ భూముల వివరాలను కచ్చితంగా నమోదు చేయాలని జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి అధికారులను ఆదేశించారు. మంగళవారం మండలంలోని అన్నంపట్ల గ్రామంలో కొనసాగుతున్న భూ రీసర్వే పనులను రెవెన్యూ అదనపు కలెక్టర్ వెంకా రెడ్డి, ఆర్డీఓ కృష్ణారెడ్డితో కలిసి ఆయన క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా గ్రామ సరిహద్దుల రీసర్వే పురోగతిపై మండల తహసీల్దార్ శ్యామ్ సుందర్ రెడ్డిని అడిగి వివరాలు తెలుసుకున్నారు. క్షేత్రస్థాయి సిబ్బందితో మాట్లాడి సర్వే నిర్వహణకు అనుసరిస్తున్న విధానాలను పరిశీలించారు. భూముల కొలతలు, సరిహద్దులు, ఇతర వివరాల నమోదులో పూర్తి కచ్చితత్వం పాటించాలని సూచించారు. అనంతరం రైతులు, గ్రామస్థులతో మాట్లాడిన కలెక్టర్.. భూ రీసర్వే ద్వారా భూముల వివరాలు స్పష్టంగా నమోదవడంతోపాటు భూ హక్కులకు భద్రత లభిస్తుందని వివరించారు. సర్వే ప్రక్రియలో రైతులకు ఉన్న సందేహాలను నివృత్తి చేస్తూ పనులను వేగంగా పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. రీసర్వే బృందాలకు రైతులు, గ్రామస్థులు సహకరించి సర్వే విజయవంతంగా పూర్తయ్యేలా చూడాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంబంధిత రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

పెండింగ్ కేసులపై ప్రత్యేక దృష్టి పెట్టాలి

- నేరాల కట్టడికి పటిష్ఠ చర్యలు తీసుకోవాలి

- మహిళలు, వృద్ధులు, పిల్లల భద్రతకు ప్రాధాన్యం

- బీబీనగర్ పోలీస్ స్టేషన్ ను తనిఖీ చేసిన డీఎస్పీ



బీబీనగర్, అక్టోబర్ 27 (ప్రజాకలం): పెండింగ్ కేసులను త్వరిత గతిన పరిష్కరించి, నేరాల నియంత్రణకు పటిష్ఠ చర్యలు తీసుకోవాలని భువనగిరి డీఎస్పీ బి. రవీందర్ పోలీసు సిబ్బందికి సూచించారు. మంగళవారం బీబీనగర్ పోలీస్ స్టేషన్‌ను వార్షిక తనిఖీలో భాగంగా ఆయన సందర్శించి రికార్డులు, కేసుల దర్యాప్తు, నేరాల వివరాలు, సిబ్బంది విధులను పరిశీలించారు. అంతకు ముందు ఇన్స్పెక్టర్ సూర్య నాయక్ ఆయనను స్వాగతం పలికారు.

కేసుల దర్యాప్తులో శాస్త్రీయ ఆధారాలను సేకరించి, నాణ్యతా ప్రమాణాలు పాటిం చాలని డీఎస్పీ సూచించారు. ఫిర్యాదు దారుల తో మర్యాదగా వ్యవహరిస్తూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేయాల న్నారు. సైబర్ నేరాలు, మాదకద్రవ్యాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని, ఓటీపీ, ఏటీఎం పిన్, యూపీఐ పిన్ వంటి వివరాలను ఇతరులతో పంచుకో వద్దని సూచించారు. మహిళ లు, పిల్లలు, వృద్ధుల భద్రతకు ప్రాధాన్యమి వ్వాలని, గ్రామాల్లో బీట్ పోలీసింగ్‌ను సమర్థంగా నిర్వహించాలని ఆదేశిం చారు. అనంతరం పోలీస్ స్టేషన్ ఆవరణలో నూతనంగా ఏర్పాటు చేసిన షటిల్ కోర్టును ప్రారంభించారు. ఇన్స్పెక్టర్, ఎస్ఐలతో కలిసి షటిల్ ఆడారు. క్రీడలు పోలీసులకు శారీరక దృఢత్వంతోపాటు మానసిక ఉల్లాసాన్ని అందిస్తాయని పేర్కొన్నారు. ఈకార్యక్రమంలో ఎస్ఐలు ఎన్. రమేష్, ఎస్. కృష్ణయ్య, ఎం. తేజం రెడ్డి, పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కరువుపై ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలి

- నీటిని వృథా చేస్తే భవిష్యత్తులో ఇబ్బందులే

- సర్పంచ్ దండెం అనిత ప్రభాకర్

- మహాదేవపూర్‌లో ఎల్‌నినో ప్రభావంపై గ్రామసభ



బీబీనగర్, అక్టోబర్ 27 (ప్రజాకలం): ఎల్‌నినో ప్రభావంతో వర్షాభావ పరిస్థితులు ఎదురవుతున్న నేపథ్యంలో కరువు ముప్పును ఎదుర్కొనేందుకు ఇప్పటి నుంచే అప్రమత్తంగా ఉండాలని మహాదేవపూర్ సర్పంచ్ దండెం అనిత ప్రభాకర్ సూచించారు. మంగళవారం గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో నిర్వహించిన గ్రామసభలో నీటి, విద్యుత్తు పొదుపుపై ప్రజలకు అవగాహన కల్పించారు. ప్రతి ఇంటిలో నల్లాలకు ఆన్--ఆఫ్ కుళాయిలు ఏర్పాటు చేసుకోవాలని, ఇంకుడు గుంతలు నిర్మించుకొని వర్షపు నీటిని భూమిలోకి ఇంకేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఉపాధి హామీ పథకం కింద పొలాల్లో పంట కుంటలు తవ్వించుకోవాలని, రైతులు నీటి వినియోగం తక్కువగా ఉండే ఆరుతడి పంటల సాగుకు ప్రాధాన్యమివ్వాలని కోరారు. విద్యుత్తును కూడా పొదుపుగా వినియోగించుకోవాలని తెలిపారు. వర్షాలు సక్రమంగా కురవని పరిస్థితుల్లో నీటి కొరత తీవ్రంగా మారే ప్రమాదం ఉందని, అందుకే ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ చెవుల భవాని కరుణాకర్‌రెడ్డి, దేవాలయ చైర్మన్ కందాడి రమణమ్మ బాల్‌రెడ్డి, వార్డు సభ్యులు, వివిధ శాఖల అధికారులు, పంచాయతీ కార్యదర్శి కిషోర్‌రెడ్డి, గ్రామ పెద్దలు, మహిళా సంఘం ప్రతినిధులు, ఆశా కార్యకర్తలు, గ్రామస్థులు పాల్గొన్నారు.

భూ రీసర్వే పనులను పరిశీలించిన జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి

బీబీనగర్,అక్టోబర్ 27 (ప్రజా కలం)

భూ రీసర్వే ద్వారా భూముల వివరాలు కచ్చితంగా నమోదు కావడంతో పాటు భూ హక్కులకు భద్రత లభిస్తుందని యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి అన్నారు మంగళవారం రోజున బీబీనగర్ మండలం,అన్నంపట్ల గ్రామంలో కొనసాగుతున్న భూ రీసర్వే పనులను జిల్లా కలెక్టర్ రెవెన్యూ అదనపు కలెక్టర్ వెంకా రెడ్డి,ఆర్డీఓ కృష్ణా రెడ్డితో కలిసి పరిశీలించారు.ఈ సందర్భంగా గ్రామ సరిహద్దుల రీసర్వే పురోగతిపై తహశీల్దార్‌ను వివరాలు అడిగి తెలుసుకున్నారు.క్షేత్రస్థాయి సిబ్బందితో మాట్లాడి రీసర్వే నిర్వహణకు అనుసరిస్తున్న విధానాలను పరిశీలించారు. అనంతరం గ్రామ రైతులు, ప్రజలతో మాట్లాడి భూ రీసర్వే ద్వారా భూముల వివరాలు కచ్చితంగా నమోదు కావడంతో



పాటు భూ హక్కులకు భద్రత లభిస్తుందని వివరించారు. రీసర్వే పనులను మరింత కచ్చితత్వంతో నిర్వహించలన్నారు.రీసర్వే బృందాలకు గ్రామస్థులు, రైతులు సహకరించి పనులు త్వరితగతిన పూర్తయ్యేలా చూడాలని కోరారు.ఈ కార్యక్రమంలో తహసీల్దార్ శ్యామ్ సుందర్ రెడ్డి, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.



వైద్య చికిత్సకు రూ.2.50 లక్షల ఎల్ఓసీ అందజేత

బీబీనగర్, అక్టోబర్ 27 (ప్రజాకలం): మండలంలోని పడమటి సోమారం గ్రామానికి చెందిన మండిల పద్మారెడ్డి మెదడుకు సంబంధించిన సమస్యతో బాధపడుతున్న ఆమె ప్రస్తుతం నిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు.మెరుగైన వైద్య చికిత్స కోసం భువనగిరి శాసన సభ్యులు కుంభం అనిల్ కుమార్ రెడ్డి రూ.2.50 లక్షల ఎల్వోసీ మంజూరు చేశారు.మంగళవారం బాధిత కుటుంబానికి ఎల్వోసీ పత్రాన్ని అందజేశారు. వైద్య చికిత్స కోసం ఎల్ఓసి మంజూరు చేయడంతో బాధిత కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల మాజీ జడ్పీటీసీ సందిగారి బస్వయ్య, గ్రామశాఖ అధ్యక్షుడు ఆలేటి బలరాంరావు, యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు గండు రాజు యాదవ్, దేవాలయ మాజీ చైర్మన్లు యర్రబోతు శ్రీనివాసరావు, ఆల్వా వీరారెడ్డి, కుంభం భాస్కర్‌గౌడ్, ఆలేటి రాంకొండల్, కుంభం సుభాష్‌గౌడ్, వాకిటి యాదిరెడ్డి, గండు అంజయ్య యాదవ్, మంద ప్రకాష్, మండిల శావాకాంత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటు నమోదు చేసుకోవాలి-బోనంకూర మల్లేష్

బొమ్మలరామారం,అక్టోబర్ 27 (ప్రజా కలం)

ఖమ్మం--వరంగల్--నల్గొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి జిల్లాలోని అర్హులైన పట్టభద్రులు తమ ఓటును నమోదు చేసుకోవాలని బొమ్మలరామారం మండల బీఆర్ఎస్ పార్టీ నాయకులు బోనంకూర మల్లేష్ కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 2023 నవంబర్ 1వ తేదీ నాటికి గుర్తింపు పొందిన విశ్వవిద్యాలయం నుంచి డిగ్రీ లేదా డిప్లొమా పూర్తి చేసి, కనీసం మూడేళ్లు పూర్తయిన వారు పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటు నమోదుకు అర్హులని తెలిపారు. అర్హత కలిగిన పట్టభద్రులు అవసరమైన ధ్రువపత్రాలతో ఫారం-18 ద్వారా నవంబర్ 6వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.ఓటరు నమోదు ప్రక్రియలో ఎలాంటి ఆలస్యం చేయకుండా సంబంధిత అధికారులను సంప్రదించి అవసరమైన వివరాలు, ధ్రువపత్రాలను సమర్పించాలని కోరారు. పట్టభద్రుల సమస్యలను శాసన మండలిలో ప్రస్తావిస్తూ వారి హక్కుల కోసం పోరాడే ప్రతినిధిని ఎన్నుకునే అవకాశం ఎమ్మెల్సీ ఎన్నికల ద్వారా లభిస్తుందని పేర్కొన్నారు.



ప్రతి అర్హత కలిగిన పట్టభద్రుడు ఓటరు జాబితాలో తన పేరును నమోదు చేసుకుని ప్రజాస్వామ్య హక్కు అయిన ఓటును వినియోగించుకోవాలని బోనంకూర మల్లేష్ పిలుపునిచ్చారు. పట్టభద్రులు పెద్ద సంఖ్యలో ఓటరు నమోదు ప్రక్రియలో పాల్గొని ప్రజాస్వామ్య ఎన్నికల వ్యవస్థను మరింత బలోపేతం చేయాలని కోరారు.

మోర్తాడ్‌లో అర్ధరాత్రి శివాజీ విగ్రహ ప్రతిష్ఠాపన

:ఆరుగురిపై కేసు నమోదు

మోర్తాడ్, అక్టోబరు 25 (ప్రజా కలం):

నిజామాబాద్ జిల్లా మోర్తాడ్ మండల కేంద్రంలో ముందస్తు అనుమతులు లేకుండా ఛత్రపతి శివాజీ మహారాజ్ విగ్రహాన్ని ప్రతిష్ఠించిన ఘటన తీవ్ర కలకలం రేపింది. ఈ వ్యవహారంలో నిబంధనలు ఉల్లంఘించిన ఆరుగురు వ్యక్తులపై పోలీసులు కేసు నమోదు చేశారు.

స్థానికులు, పోలీసుల కథనం ప్రకారం... మోర్తాడ్ పరిధిలోని జాతీయ రహదారి 63 (NH-63) పక్కన శనివారం అర్ధరాత్రి కొందరు వ్యక్తులు ముందస్తుగా ఎలాంటి ప్రభుత్వ అనుమతులు తీసుకోకుండా ఛత్రపతి శివాజీ విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. ఆదివారం ఉదయం ఈ విషయం వెలుగులోకి రావడంతో స్థానికంగా పెద్ద ఎత్తున చర్చనీయాంశంగా మారింది. జాతీయ రహదారుల పక్కన విగ్రహాల ఏర్పాటుకు సుప్రీంకోర్టు నిబంధనలు, ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం ఖచ్చితమైన అనుమతులు అవసరం.

రహదారి భద్రతకు విఘాతం కలిగించేలా, ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించి విగ్రహాన్ని ఏర్పాటు చేసినందుకు గాను మోర్తాడ్ పోలీసులు సుమోటోగా స్పందించారు. ఈ ఘటనకు కారకులుగా గుర్తించిన ఆరుగురిపై వివిధ సెక్షన్ల కింద కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు పోలీసు వర్గాలు తెలిపాయి.



గవర్నర్ కోటా ఎమ్మెల్సీ పదవుల్లో

ఇద్దరు బీసీలకు అవకాశం ఇవ్వాలి

బీసీలకు రాజకీయ ప్రాతినిధ్యం పెంచాలి

: వడ్లకొండ వేణుగోపాల్‌గౌడ్



ఎంపిక చేయాలని కాంగ్రెస్ అధిష్ఠానాన్ని కోరారు.

మూడు నామినేటెడ్ ఎమ్మెల్సీ పదవుల్లో కనీసం రెండు స్థానాలను బీసీలకు కేటాయించి రాజకీయ ప్రాతినిధ్యం కల్పించాలని వేణుగోపాల్‌గౌడ్ డిమాండ్ చేశారు.

వరంగల్, అక్టోబరు 27
(ప్రజా కలం ప్రతినిధి)

గవర్నర్ కోటాలో త్వరలో భర్తీ చేయనున్న మూడు ఎమ్మెల్సీ పదవుల్లో రెండింటిని బీసీలకు కేటాయించాలని బీసీ సంక్షేమ సంఘం ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడు వడ్లకొండ వేణుగోపాల్‌గౌడ్ డిమాండ్ చేశారు. బీసీలకు రాజకీయంగా తగిన ప్రాతినిధ్యం కల్పించడంతోపాటు నిర్ణయాధికారంలో భాగస్వామ్యం కల్పించాలని కోరారు. ఎన్నికల సమయంలో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తామని హామీ ఇచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అనంతరం ఆ దిశగా తగిన చర్యలు తీసుకోవడం లేదని ఆయన విమర్శించారు. కామారెడ్డి డిక్లరేషన్ పేరుతో బీసీలకు హామీలు ఇచ్చి వారి ఓట్లతో అధికారంలోకి వచ్చారని ఆరోపించారు.

రాజకీయ ప్రాతినిధ్యం పెరగాలి

జనాభాలో సగానికి పైగా ఉన్న బీసీలకు రాజకీయ పదవుల్లో ఆశించిన స్థాయిలో ప్రాతినిధ్యం దక్కడం లేదని వేణుగోపాల్‌గౌడ్ ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నికల సమయంలో బీసీలను కేవలం ఓటర్లుగానే పరిగణిస్తున్నారని విమర్శించారు. ఎమ్మెల్యే టికెట్ల కేటాయింపులో ఆర్థిక స్థోమతను సాకుగా చూపి బీసీ అభ్యర్థులకు అవకాశాలు నిరాకరిస్తున్నారని ఆరోపించారు. బీసీలకు రాజకీయ ప్రాతినిధ్యం కల్పించకుండా సామాజిక న్యాయం సాధ్యం కాదని స్పష్టం చేశారు.

'అర్హులైన బీసీలకు అవకాశం'

గ్రాడ్యుయేట్స్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఇద్దరు రెడ్డి సామాజికవర్గానికి చెందిన వారికి టికెట్లు కేటాయించడం ద్వారా బీసీలకు అన్యాయం చేసిందని ఆయన ఆరోపించారు. త్వరలో గవర్నర్ కోటాలో భర్తీ చేయనున్న ఎమ్మెల్సీ పదవుల్లో అర్హత, సామాజిక సేవ, ప్రజా సమస్యలపై అవగాహన, పార్టీ పట్ల నిబద్ధత ఉన్న బీసీ నాయకులను

అర్హులైన ప్రతి ఒక్కరూ ఎమ్మెల్సీ ఓటు నమోదు చేసుకోవాలి

పట్టభద్రుల ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి సామ రామ్మోహన్ రెడ్డిని గెలిపించాలి

మల్కాజిగిరి,అక్టోబరు 27 (ప్రజా కలం ప్రతినిధి):

అర్హులైన ప్రతి ఒక్కరూ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటును నమోదు చేసుకోవాలని మల్కాజిగిరి కాంగ్రెస్ పార్టీ నాయకులు కోరారు. త్వరలో జరగనున్న హైదరాబాద్--రంగారెడ్డి--మహబూబ్‌నగర్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని ఓటరు నమోదు ప్రక్రియను విస్తృతంగా చేపట్టాలని పిలుపునిచ్చారు. మంగళవారం గౌతమ్ నగర్ డివిజన్‌లో మాజీ కార్పొరేటర్



మురుగేష్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటరు నమోదు కార్యక్రమాన్ని మల్కాజిగిరి సర్కిల్ కాంగ్రెస్ నాయకులు ప్రారంభించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, అర్హత కలిగిన ప్రతి పట్టభద్రుడు తమ ఓటును తప్పనిసరిగా నమోదు చేసుకోవాలని సూచించారు. ప్రజాస్వామ్య ప్రక్రియలో పట్టభద్రులు భాగస్వాములు కావాలని, ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని అన్నారు.రాబోయే పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి సామ రామ్మోహన్ రెడ్డిని గెలిపించేందుకు పార్టీ నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలని పిలుపునిచ్చారు. అర్హులైన పట్టభద్రులకు ఓటు నమోదు ప్రక్రియపై అవగాహన కల్పిస్తూ, ప్రతి ఒక్కరూ తమ పేరును ఓటరు జాబితాలో నమోదు చేసుకునేలా కృషి చేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సర్కిల్ అధ్యక్షులు వెంకటేష్ యాదవ్, బీకే శ్రీనివాస్, డివిజన్ అధ్యక్షులు ప్రవీణ్, వినోద్ యాదవ్, వెంకటేష్, బాలరాజు యాదవ్, శ్రీనివాస్, నవీన్, విక్కీ, రామచందర్, మహిళా నాయకురాళ్లు, పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా

- హర్షగూడలో రూ.65 లక్షలతో సీసీ రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేసిన - మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి

మహేశ్వరం, అక్టోబర్ 27, (ప్రజా కలం):

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి అన్నారు. శంషాబాద్ డివిజన్, మంకల్ 67వ వార్డు పరిధిలోని హర్షగూడ గ్రామానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన మాజీ మంత్రి మహేశ్వరం శాసనసభ్యురాలు పట్లోళ్ల సబితా ఇంద్రారెడ్డి కి హర్షగూడ మాజీ ఉప సర్పంచ్ రవి నాయక్ పలువురు పార్టీ నాయకులు, కార్యకర్తలు ఘనంగా స్వాగతం పలికారు.అనంతరం హర్షగూడ గ్రామంలో రూ. 65 లక్షలతో చేపట్టనున్న సీసీ రోడ్ల నిర్మాణ పనులకు మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి శంకుస్థాపన చేశారు. ఈ రోడ్ల నిర్మాణంతో గ్రామంలో రాకపోకలకు ఎంతో సౌకర్యంగా ఉంటుందని, మౌలిక వసతుల



కల్పనకు తమ ప్రభుత్వ హయాంలో ఎంతగానో కృషి చేశామని ఆమె పేర్కొన్నారు.

కరెంట్ సమస్యపై వెంటనే స్పందించిన సబితమ్మ:

హర్షగూడ గ్రామంలో ఉన్న కరెంట్ సమస్యను మాజీ ఉప సర్పంచ్ జటావత్ రవి నాయక్ దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే స్పందించిన సబితమ్మ సంబంధిత డి ఈ కి ఫోన్ చేసి, సమస్యను పరిశీలించి అతి త్వరలో పరిష్కరించాలని ఆదేశించారు. అలాగే గ్రామంలో ఇంకా ఏవైనా సీసీ రోడ్ల సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకురావాలని గ్రామస్తులను కోరారు.ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు జిల్లెల లక్ష్మయ్య మాజీ సర్పంచ్ సాలి లక్ష్మణ్, మాజీ వార్డు సభ్యులు యాదయ్య గౌడ్, జరుపుల రాజు నాయక్, మాజీ కో ఆప్షన్ మెంబర్ రమేష్ రాథోడ్, మాజీ అధ్యక్షులు వర్తయ్య, సురేష్, యువ నాయకుడు రమేష్ రాథోడ్, పార్టీ 67వ డివిజన్ సీనియర్ నాయకులు ఉల్లా వెంకటేష్ యాదవ్, శ్యామల్ రాజు, వెంకట్ రాజ్ రెడ్డి, బంటు రమేష్, హరికృష్ణ రెడ్డి, జగదీష్ యాదవ్, 66వ డివిజన్ మాజీ కౌన్సిలర్ బాధవత్ రవి నాయక్, సపిడి రాజు ముదిరాజ్, మాజీ ఎంపీపి స్నేహ సురేష్ తదితరులు పాల్గొన్నారు.

స్వయం ఉపాధితో యువత ఆర్థికంగా స్థిరపడాలి

రాయల్ సోఫా మేకర్స్‌ను ప్రారంభించిన కాంగ్రెస్ నాయకులు

మల్కాజిగిరి, అక్టోబరు 27 (ప్రజా కలం ప్రతినిధి): యువత స్వయం ఉపాధి రంగంలో ముందుకు సాగుతూ ఆర్థికంగా స్థిరపడాలని మల్కాజిగిరి కాంగ్రెస్ పార్టీ నాయకులు సూచించారు. ఉ



ద్యోగాల కోసం ఎదురుచూడకుండా తమ నైపుణ్యానికి అనుగుణంగా స్వయం ఉపాధి అవకాశాలను అందిపుచ్చుకోవాలని పిలుపునిచ్చారు. మంగళవారం గౌతమ్ నగర్ డివిజన్ పరిధిలోని గౌతమ్ నగర్ ప్రధాన రహదారిపై నూతనంగా ఏర్పాటు చేసిన రాయల్ సోఫా మేకర్స్ దుకాణాన్ని మాజీ కార్పొరేటర్లు వై. ప్రేమ్ కుమార్, మురుగేష్‌తో కలిసి కాంగ్రెస్ పార్టీ నాయకులు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ యువత వ్యాపార రంగంలోకి అడుగుపెట్టి తమ కాళ్లపై తాము నిలబడాలని అన్నారు. స్వయం ఉపాధి ద్వారా జీవనోపాధి పొందాలనుకునే వారికి ప్రభుత్వ పరంగా ప్రోత్సాహకాలు అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు. యువత వాటిని సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. రాయల్ సోఫా మేకర్స్ నిర్వాహకుడు షేక్ మౌలానా మాట్లాడుతూ తమ దుకాణంలో వినియోగదారుల అవసరాలకు అనుగుణంగా అన్ని రకాల సోఫాలను నూతనంగా తయారు చేసి అందించడంతో పాటు పాత సోఫాలకు మరమ్మతులు కూడా చేసి ఇస్తామని తెలిపారు. నాణ్యమైన సేవలతో వినియోగదారుల ఆదరణ పొందేందుకు కృషి చేస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, వ్యాపార ప్రముఖులు, స్థానికులు తదితరులు పాల్గొన్నారు.


రేషన్ డీలర్ల సంక్షేమానికి బీఆర్ఎస్ హయాంలోనే పెద్దపీట

- రూ.5 వేల గౌరవ వేతనం, క్వింటాలుకు రూ.300 కమిషన్ సాధించే వరకు పోరాడాలి

- డీలర్ల న్యాయమైన పోరాటానికి అండగా ఉంటాం: మాజీ మంత్రి హరీష్ రావు

గజ్వేల్:27 అక్టోబర్ (ప్రజా కలం ప్రతినిధి)

రేషన్ డీలర్లకు నెలకు రూ. 5 వేల గౌరవ వేతనం, క్వింటాలుకు రూ. 300 కమిషన్ అందించే వరకు ఐక్యంగా పోరాడాలని మాజీ మంత్రి,సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీష్ రావు పిలుపునిచ్చారు. డీలర్ల న్యాయమైన హక్కుల సాధన కోసం తమ మద్దతు ఎల్లప్పుడూ ఉంటుందని, వారి పోరాటానికి అండగా నిలుస్తామని భరోసా ఇచ్చారు.సిద్దిపేట జిల్లా గజ్వేల్--ప్రజ్ఞాపూర్ పట్టణంలోని ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో మంగళవారం తెలంగాణ రాష్ట్ర రేషన్ డీలర్ల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన శ్రీ'గౌరవ వేతన సాధన సభ' కు హరీష్ రావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఎమ్మెల్సీ డాక్టర్ యాదవ రెడ్డి, పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి,జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి, వంటేరు ప్రతాప్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా వివిధ జిల్లాల నుంచి రేషన్ డీలర్లు భారీ సంఖ్యలో తరలివచ్చారు. ఈ సందర్భంగా సంఘం నూతన అధ్యక్షుడిగా ఎన్నికైన నాయకోటి రాజుతో పాటు కార్యవర్గ సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సభలో హరీష్ రావు మాట్లాడుతూ.గత మూడేళ్లుగా గౌరవ వేతనం కోసం ఎదురుచూస్తున్న రేషన్ డీలర్లకు కాంగ్రెస్ ప్రభుత్వం న్యాయం చేయడం లేదని విమర్శించారు.ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలను నమ్మిన డీలర్లు, అధికారంలోకి వచ్చాక నిరాశకు గురయ్యారని అన్నారు. పేదలకు నిత్యావసర సరుకులు అందిస్తూ ప్రజా పంపిణీ



వ్యవస్థలో కీలక పాత్ర పోషిస్తున్న డీలర్లను ప్రభుత్వం పట్టించుకోకపోవడం బాధాకరమని పేర్కొన్నారు.బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో రేషన్ డీలర్లకు క్వింటాలుకు ఇచ్చే కమిషన్‌ను రూ. 70 నుంచి రూ. 140కు పెంచిన ఘనత కేసీఆర్ ప్రభుత్వానిదేనని హరీష్ రావు గుర్తుచేశారు.డీలర్ల సమస్యలపై ప్రస్తుత ప్రభుత్వానికి కనీస అవగాహన లేదని విమర్శించారు.డీలర్లకు గౌరవ వేతనం,కమిషన్ పెంచకుండా నిర్లక్ష్యం చేస్తున్న ప్రభుత్వం.మరోవైపు నిత్యావసర వస్తువుల ధరలను పెంచి సామాన్యులపై భారం మోపుతోందని ఆరోపించారు.

రూ.600 కోట్ల విలువైన బియ్యం వృథా అయ్యాయని ఆరోపణ

క్షేత్రస్థాయిలో సరైన ప్రణాళిక లేకపోవడంతో సుమారు రూ.600 కోట్ల విలువైన బియ్యం వృథా అయ్యాయని హరీష్ రావు ఆరోపించారు.ప్రజా పంపిణీ వ్యవస్థను సమర్థంగా నిర్వహించడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని ధ్వజమెత్తారు.రేషన్ డీలర్లకు నెలకు రూ. 5 వేల గౌరవ వేతనం, క్వింటాలుకు రూ. 300 కమిషన్ మంజూరు చేసే వరకు పార్టీలకు అతీతంగా ఐక్యంగా ఉద్యమించాలని ఆయన పిలుపునిచ్చారు.డీలర్ల న్యాయమైన డిమాండ్ల సాధన కోసం తమ వంతు సహకారం అందిస్తామని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు,రాష్ట్ర రేషన్ డీలర్ల సంక్షేమ సంఘం నాయకులు,కార్యవర్గ సభ్యులు,రేషన్ డీలర్లు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



కేసీఆర్‌తో జీఎంఆర్ ప్రత్యేక భేటీ..

ఈ నెల 30న సందీప్ రెడ్డి నిశ్చితార్థం.
వేడుకకు రావాలని ఆహ్వానం..

పటాన్‌చేరు, అక్టోబర్ 27 (ప్రజా కలం) ప్రతినిధి

పటాన్‌చేరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి, తెలంగాణ తొలి ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధ్యక్షుడు కల్వకుంట్ల చంద్రశేఖర రావుతో భేటీ అయ్యారు. ఈ నెల 30న హైదరాబాద్‌లో జరగనున్న తన సోదరుడు గూడెం మధుసూదన్ రెడ్డి కుమారుడు గూడెం సందీప్ రెడ్డి నిశ్చితార్థ వేడుకకు హాజరు కావాలని కేసీఆర్‌ను ఆహ్వానించారు. మంగళవారం సాయంత్రం ఎర్రవల్లిలోని కేసీఆర్ ఫామ్‌హౌస్‌లో ఈ భేటీ జరిగింది. మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్ రావుతో కలిసి జీఎంఆర్ కేసీఆర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కుటుంబ వేడుకకు హాజరై నూతన జంటను ఆశీర్వదించాలని కోరారు. అనంతరం విజయదశమి పర్వదినాన్ని పురస్కరించుకొని కేసీఆర్‌కు దసరా శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ భేటీ రాజకీయ వర్గాల్లోనూ ప్రాధాన్యం సంతరించుకుంది..



Corporate .Office :1-7-511/4, Gemini Colony, Near Pochamma Temple, Zamistanpur, HYDERABAD, TELANGANA, 500020 Cell: 9010972526

Printed, Published and owned by **KALAKONDA RAMAKRISHNA**, Printed at **TEJOMAI PUBLICATION**, H.No. 2-24/98/BLN Colony, IDA Uppal Medchal-Malkajgiri, Hyderabad, Telangana-50013
Published from H.No.10-1-7, Bada Bazar, Beside Pothalingaiah Temple, Azam Raod, Nizamabad,Telangana -503001
Editor: **KALAKONDA RAMAKRISHNA**, **PRGI.No. TELTEL/2010/33275,** Cell: 90109 72526, Email:prajakalam2010@gmail.com

పోక్సో చట్టంపై విద్యార్థులకు అవగాహన సదస్సు



తానూర్, అక్టోబర్ 27(ప్రజా కలం): మండలంలోని భోసి జడ్పీహెచ్ఎస్ పాఠశాల లో భైంసా జేఎఫ్సీఎం వెంకటరమణ సుహాస్ ఆధ్వర్యంలో పోక్సో చట్టంపై న్యాయ అవగాహన కార్యక్రమం నిర్వహించారు,వేధింపుల నుంచి రక్షణ, బాలల హక్కులపై న్యాయమూర్తి విద్యార్థులకు వివరించారు,ఇబ్బందులు వస్తే భయపడకుండా తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు లేదా పోలీసులకు తెలపాలన్నారు,ఈ కార్యక్రమంలో ఎస్ఐ షేక్ జుబేర్,పాఠశాల ప్రధానోపాధ్యాయులు,ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

కూసుమంచి పీఎస్‌లో సీపీ ఆకస్మిక తనిఖీ

పెండింగ్ కేసులపై సమీక్ష



పాలేరు అక్టోబర్ 27(ప్రజా కలం న్యూస్) కూసుమంచి పోలీస్‌స్టేషన్‌ను ఖమ్మం పోలీస్ కమిషనర్ సునీల్‌దత్ మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ముందస్తు సమాచారం లేకుండా స్టేషన్‌కు చేరుకున్న ఆయన.. స్టేషన్ నిర్వహణ, సిబ్బంది పనితీరును సమీక్షించారు. ఈ సందర్భంగా ఎస్ఐ సతీష్‌తో మాట్లాడి పలు వివరాలు తెలుసుకున్నారు.స్టేషన్‌లోని రికార్డులు, పెండింగ్ కేసులు, ఎఫ్ఐఆర్‌ల నమోదు విధానం, పరిశీలించారు. సీసీ కెమెరాల పనితీరును తనిఖీ చేయడంతోపాటు రిసెప్షన్, లాకప్ గది, పరిసరాల పరిశుభ్రతను సమీక్షించారు. కేసుల దర్యాప్తులో జాప్యం జరగకుండా, పెండింగ్ కేసులను త్వరితగతిన పరిష్కరించాలని సూచించారు.ఈ సందర్భంగా ఎస్ఐ సతీష్‌కు పలు సూచనలు చేసిన సీపీ.. పోలీస్‌స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారులతో మర్యాదగా వ్యవహరించాలని, బాధితుల సమస్యలను సావధానంగా విని చట్టప్రకారం న్యాయం జరిగేలా చూడాలని ఆదేశించారు. విధుల నిర్వహణలో నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని స్పష్టం చేశారు.

పోలీస్ వాహనాలకు ప్రైవేటు డ్రైవర్లు వద్దు

పోలీస్ వాహనాలకు ప్రైవేటు వ్యక్తులను డ్రైవర్లుగా నియమించుకోవద్దని సీపీ సునీల్‌దత్ స్పష్టం చేశారు. పోలీసు శాఖ నిబంధనలకు అనుగుణంగానే వాహనాలను నడిపించాలని, అనధికార వ్యక్తులకు పోలీసు వాహనాల బాధ్యతలు అప్పగించరాదని సూచించారు. ఈ విషయంలో అప్రమత్తంగా ఉండాలని ఎస్ఐ సతీష్‌కు తెలిపారు.రాత్రి గస్తీని ముమ్మరం చేయాలని, గంజాయి, అక్రమ మద్యం విక్రయాలు, ఇతర అసాంఘిక కార్యకలాపాలపై ప్రత్యేక నిఘా ఉంచాలని ఆదేశించారు. విజిబుల్ పోలీసింగ్ ద్వారా నేరాలను నియంత్రిస్తూ ప్రజలకు మెరుగైన సేవలందించాలని సూచించారు.

ఎమ్మెల్సీ అభ్యర్థి సర్వోత్తమ రెడ్డిని కలిసిన పగడాల లచ్చిరెడ్డి..



తల్లాడ అక్టోబర్ 27 ప్రజా కలం న్యూస్ కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్సీ అభ్యర్థి రాంరెడ్డి సర్వోత్తమ రెడ్డిని తల్లాడ మండలంలోని రంగం బంజర గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు పగడాల లచ్చిరెడ్డి కలిశారు. ఖమ్మం, నల్గొండ, వరంగల్ పట్టభద్రుల ఎమ్మెల్సీ నియోజకవర్గం నుండి ఆయన పోటీ చేస్తున్నారు. ఈ సందర్భంగా ఖమ్మం జిల్లాలో పరిచయ కార్యక్రమాలు ఏర్పాటు చేస్తున్నారు. అందులో భాగంగా లచ్చిరెడ్డి ఆయనను కలిసి మర్యాదపూర్వకంగా కలిసి పలు విషయాలను చర్చించారు. పగడాల లచ్చిరెడ్డి రాష్ట్రమంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి కుటుంబంతోపాటు మాజీ మంత్రి స్వర్గీయ రామ్ రెడ్డి వెంకటరెడ్డి, దామోదర్ రెడ్డి కుటుంబ సభ్యులతో మంచి స్నేహ సంబంధాలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో ఆ కుటుంబం నుండి పోటీ చేస్తున్న సర్వోత్తమ రెడ్డిని ఆయన ప్రత్యేకంగా కలిసి మాట్లాడారు. అందరికీ సుపరిచితుడైన సర్వోత్తమ రెడ్డిని గెలిపించాలని లచ్చిరెడ్డి కోరారు.

అర్నబ్ తుఫాను నేపథ్యంలో అధికారులు, ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

పరిస్థితులకు అనుగుణంగా పాఠశాలలు, అంగన్వాడీ కేంద్రాలకు సెలవులు ప్రకటించాలి

అధికారుల సెలవులు రద్దు, హెడ్‌క్వార్టర్ వదిలి వెళ్లరాదు : జిల్లా కలెక్టర్ దివాకర్ టిఎస్



ఖమ్మం అక్టోబర్ 27(ప్రజా కలం న్యూస్) అర్నబ్ తుఫాను నేపథ్యంలో అధికారులు, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, పరిస్థితులకు అనుగుణంగా పాఠశాలలు, అంగన్వాడీ కేంద్రాలకు సెలవులు ప్రకటించాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ తెలిపారు.స్థానిక వాతావరణ పరిస్థితులను ఎప్పటికప్పుడు పరిశీలించాలని, భారీ వర్షాలు కురిసిన సందర్భాల్లో సంబంధిత మండల విద్యాశాఖ అధికారులు పాఠశాలలకు, సంబంధిత శిశు అభివృద్ధి ప్రాజెక్టు అధికారులు (సీడీపీఓలు) అంగన్వాడీ కేంద్రాలకు సెలవులు ప్రకటించాలని కలెక్టర్ ఆదేశించారు. తుఫాను నేపథ్యంలో జిల్లా అధికారులు, ఇతర సిబ్బందికి మంజూరు చేసిన సెలవులను రద్దు చేస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. ప్రతి ఒక్కరూ విధులకు హాజరై, తమ హెడ్‌క్వార్టర్లలోనే అందుబాటులో ఉండాలని, అనుమతి లేకుండా హెడ్‌క్వార్టర్‌నువిడిచి వెళ్లరాదని ఆదేశించారు.తుఫానుప్రభావాన్ని ఎదుర్కొనేం దుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేస్తూ, ఎలాంటి అత్యవసర పరిస్థితులు ఎదురైనా తక్షణ చర్యలు తీసుకునేందుకు సిద్ధంగా ఉండాలని సూచించారు.

విద్యుత్ అంతరాయాలపై తక్షణ చర్యలు తీసుకోవాలి: భారీ వర్షాలు, బలమైన గాలుల కారణంగా విద్యుత్ స్తంభాలు నేలకొరిగే అవకాశం ఉందని, విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగవచ్చని కలెక్టర్ పేర్కొన్నారు. విద్యుత్ శాఖ అధికారులు అప్రమత్తంగా ఉంటూ, అంతరాయం ఏర్పడిన ప్రాంతాల్లో పరిస్థితులను సమీక్షించి, సాధ్యమైనంత త్వరగా విద్యుత్ సరఫరాను పునరుద్ధరించే చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ప్రజలు విద్యుత్ స్తంభాలు, తెగిపడిన విద్యుత్ తీగలకు దూరంగా ఉండాలని సూచించారు. భారీ వర్షాలు, ఈదురుగాలుల నేపథ్యంలో భారీ వృక్షాలు, చెట్లుకూలిపోయే ప్రమాదం ఉందని, ప్రజలు చెట్ల కింద నిలబడరాదని కలెక్టర్ సూచించారు. పాతబడిన గోడలు, శిథిలావస్థలో ఉన్న భవనాల సమీపంలో ఉండకూడదని, అత్యవసర పరిస్థితుల్లో అధికారులు సూచించిన జాగ్రత్తలను పాటించాలని తెలిపారు.తుఫాను ప్రభావం తగ్గే వరకు ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అధికారులు పరిస్థితులను నిరంతరం పర్యవేక్షిస్తూ ప్రజలకు అవసరమైన సహాయ చర్యలు అందించేందుకు సిద్ధంగా ఉండాలని జిల్లా కలెక్టర్ దివాకర్ ూ తెలిపారు.

సీఎంఆర్ ధాన్యంను మిల్లర్లు అప్పగించాలి

మిల్లర్ లు అవకతవకలకు పాల్పడితే కఠిన చర్యలు

నిబంధనలు ఉల్లంఘిస్తే షోకాజ్ నోటీసుల జారీ -జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్



గద్వాల ప్రతినిధి అక్టోబర్ 27 (ప్రజా కలం)

ప్రభుత్వానికి మిల్లర్లు ఇవ్వాల్సిన సిఎంఆర్ ధాన్యంను సకాలంలో అప్పగించాలని, లేని పక్షంలో కఠిన చర్యలు తప్పవని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ హెచ్చరించారు. మంగళవారం సాయంత్రం కలెక్టర్ కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్లో సివిల్ సప్లై అధికారులు, మిల్లర్లతో జిల్లా కలెక్టర్ సమావేశమై మాట్లాడారు. విజిలెన్స్ అధికారులు ఇటీవలే జిల్లాలోని కొన్ని మిల్లులలో తనిఖీలు నిర్వహించారని, నిబంధనలు ఉల్లంఘించిన ఒక మిల్లును సీజ్ చేయడం జరిగిందన్నారు. కొన్నేళ్లుగా సిఎంఆర్ ధాన్యంను ప్రభుత్వానికి డెలివరీ చేయకుండా నిర్లిప్తంగా కొంతమంది మిల్లర్లు వ్యవహరిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆయా మిల్లుల వారీగా డెలివరీ చేయాల్సిన దాన్యం గురించి కలెక్టర్ మిల్లుల యజమానులతో సమీక్షించారు. గతంలో వేలం వేయబడ్డ దాన్యం విషయంలోనూ ప్రభుత్వంకు నిబంధనల ప్రకారం డబ్బులు చెల్లించాల్సి ఉందన్నారు. పెద్ద ఎత్తున పెండింగ్ ఉన్న మిల్లర్లకు షోకాజ్ నోటీసులను జారీ చేయాలని అధికారులను ఆదేశించారు. సీఎంఆర్ ధాన్యం డెలివరీ పక్కన పెట్టి ప్రైవేటు ధాన్యంను మిల్లింగ్ చేసే వారిపై చర్యలు తీసుకుంటామన్నారు. డిఫాల్టర్స్ కు గతంలోనే జరిమానాలు విధించడం జరిగిందని, బకాయిలను చెల్లించనీ పక్షంలో కేసులు పెట్టడం జరుగుతుందని హెచ్చరించారు. గత ఖరీఫ్, రబీ సీజన్ కు సంబంధించిన సీఎంఆర్ 20 రోజుల్లో డెలివరీ చేయాలని ఆదేశించారు. కొన్నేళ్లుగా పెండింగ్ లో ఉన్న ఆయా మిల్లుల సీఎంఆర్ సమగ్ర వివరాలను 15 రోజుల్లోగా తమకు అందజేయాలని పౌర సరఫరాల శాఖ అధికారులను ఆదేశించారు. ఖరీఫ్ 2026-27 సంవత్సరానికి సంబంధించి బ్యాంకు గ్యారంటీ ఇచ్చే మిల్లులకే ధాన్యం కేటాయింపులు ఉంటాయని, మిల్లర్లు నవంబర్ 15వ తేదీలోగా గ్యారెంటీ ఇవ్వాలన్నారు. ఎల్ నినో పరిస్థితుల్లో ప్రభుత్వానికి పూర్తిస్థాయిలో సిఎంఆర్ ధాన్యం అవసరమవుతుందని తెలిపారు. చౌక ధర దుకాణాల ద్వారా తెల్ల రేషన్ కార్డుదారులకు వచ్చే సంవత్సరం వరకు ప్రతి నెల బియ్యం సరఫరా చేయాల్సి ఉంటుందని, అదేవిధంగా వసతిగృహాలు, విద్యాసంస్థలు, తదితర ప్రభుత్వ అవసరాలకు బియ్యం నిల్వలు తప్పనిసరిగా జిల్లా కలెక్టర్ పేర్కొన్నారు. ఈ సమావేశంలో పౌరసరఫరాల శాఖ మేనేజర్ విమల, ఎన్ఫోర్స్మెంట్ డీటీలు ప్రశాంత్, రాజేష్, ఇతర అధికారులు, రైస్ మిల్లర్స్, తదితరులు పాల్గొన్నారు.

రవాణా రంగ కార్మికుల పిల్లల విద్యకు శ్రీరామ్ ఫైనాన్స్ చేయూత

ఏటా ప్రతిభావంతులైన విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు అందించడం అభినందనీయం

ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి

మహబూబ్ నగర్ ప్రజా కలం ప్రతినిధి అక్టోబర్ 27:

ఆటో డ్రైవర్లు, కమర్షియల్ వెహికల్ డ్రైవర్లు, ట్రాన్స్‌పోర్ట్ వాహనాల డ్రైవర్లు, రవాణా రంగంలో పనిచేస్తున్న కార్మికుల పిల్లలు ఉన్నత విద్యను అభ్యసించేలా ప్రోత్సహించేందుకు శ్రీరామ్ ఫైనాన్స్ సంస్థ చేపట్టిన స్కాలర్‌షిప్‌ల పంపిణీ కార్యక్రమం అభినందనీయమని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే లి యెన్నం శ్రీనివాస్ రెడ్డి అన్నారు. శ్రీరామ్ ఫైనాన్స్ ఆధ్వర్యం లో నగరంలోని రాజా బహదూర్ రెడ్డి కన్వెన్షన్ హాల్ లో ఏర్పాటు చేసిన ఓ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులకు స్కాలర్ షిప్ లను అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రవాణా రంగాన్ని జీవనాధారంగా చేసుకుని జీవిస్తున్న పేద, మధ్యతరగతి కుటుంబాలకు చెందిన ప్రతిభావంతులైన విద్యార్థులను గుర్తించి, ప్రతి సంవత్సరం వారికి స్కాలర్‌షిప్‌లు అందించాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించడం గొప్ప విషయమని పేర్కొన్నారు. మహబూబ్‌నగర్‌లో నిర్వహించిన ఈ కార్యక్రమంలో దాదాపు 750 మంది విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు అందించడం సంతోషకరమన్నారు. కేవలం హైస్కూల్ విద్యార్థులకే పరిమితం కాకుండా ఇంటర్మీడియట్, డిగ్రీ, ఇంజినీరింగ్ విద్యార్థులకు సైతం స్కాలర్‌షిప్‌లు అందించడం ద్వారా ఉన్నత విద్యకు సంస్థ అండగా నిలుస్తోందని తెలిపారు. విద్యార్థుల ప్రతిభను గుర్తించి, వారి చదువుకు ఆర్థిక సహకారం అందించడం వల్ల వారు మరింత ఉత్సాహంతో ముందుకు సాగేందుకు అవకాశం కలుగుతుందన్నారు. కార్పొరేట్ సామాజిక బాధ్యత నిధులను ఖర్చు చేసే సమయంలో సమాజానికి నిజంగా అవసరమైన రంగాలను గుర్తించి, ప్రజలకు దీర్ఘకాలిక ప్రయోజనం చేకూర్చే కార్యక్రమాలకు ప్రాధాన్యతనివ్వాలని ఆయన సూచించారు. ముఖ్యంగా విద్యారంగంపై పెట్టుబడి పెట్టడం ద్వారా భవిష్యత్ తరాలకు మెరుగైన అవకాశాలను కల్పించవచ్చని అన్నారు. ఆర్థిక ఇబ్బందుల కారణంగా ప్రతిభావంతులైన విద్యార్థులు చదువుకు దూరం కాకూడదనే లక్ష్యంతో, రవాణా రంగ కార్మికుల పిల్లలను ప్రత్యేకంగా గుర్తించి వారికి ప్రోత్సాహం అందించడం శ్రీరామ్ ఫైనాన్స్ సంస్థకు సమాజం పట్ల ఉన్న బాధ్యతకు నిదర్శనమని కొనియాడారు. విద్య ద్వారానే కుటుంబాల జీవన ప్రమాణాలు మెరుగుపడటంతోపాటు సమాజంలో సానుకూల మార్పు సాధ్యమవుతుందని పేర్కొన్నారు. విద్య పట్ల ఇంతటి శ్రద్ధ చూపిస్తూ, కోట్లాది రూపాయలను విద్యార్థుల భవిష్యత్తు కోసం వెచ్చించేందుకు ముందుకు వచ్చిన శ్రీరామ్ ఫైనాన్స్ గ్రూప్ యాజమాన్యానికి, సంస్థలో పనిచేస్తున్న సీనియర్ అధికారులు, ఉద్యోగులకు హృదయపూర్వక అభినందనలు తెలిపారు. భవిష్యత్తులోనూ మరిన్ని వినూత్న కార్యక్రమాలను చేపట్టి విద్యార్థుల విద్యాభివృద్ధికి, వారి ఉన్నత లక్ష్యాల సాధనకు సంస్థ అండగా నిలవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో నగర డిప్యూటీ మేయర్ మారేపల్లి సురేందర్ రెడ్డి, ముడా చైర్మన్ లక్ష్మణ్ యాదవ్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు సిరాజ్ ఖాద్రీ, మైత్రి యాదయ్య, కార్పొరేటర్లు గిరి గౌడ్, తిరుమల వెంకటేష్, తాహెర్ , రమేష్ రెడ్డి, తో పాటు శ్రీరాం ఫైనాన్స్ ఉద్యోగులు, విద్యార్థులు వారి తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

జన గణన పొరపాట్లకు తావు లేకుండా ప్రకడ్బందీగా నిర్వహించాలి

జనగణనలో 40 రకాల ప్రశ్నావళి తో వివరాల సేకరణ

జిల్లా స్థాయి, డివిజనల్, ఛార్జ్ అధికారులకు రెండు రోజులపాటు శిక్షణ

తరగతులు నిర్వహణ- జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా



మహబూబ్ నగర్ ప్రజా కలం ప్రతినిధి అక్టోబర్ 27:

జనగణనలో ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా జాగ్రత్తగా,పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా అన్నారు.మంగళవారంజిల్లా గణన అధికారి ఆధ్వర్యంలో జన గణనపై కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా , డివిజనల్ స్థాయి అధికారులు,చార్జ్ ఆఫీసర్లకు (తహసీల్దార్లు), అదనపు చార్జ్ ఆఫీసర్లు (ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్లు) రెండు రోజుల శిక్షణా తరగతుల కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ పాల్గొని దిశా నిర్దేశం చేశారు

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జన గణన రెండో దశ నిర్వహణకు సంబంధించిన షెడ్యూల్, విధివిధానాలు మరియు అధికారుల బాధ్యతల గురించి వివరించారు.

జన గణన రెండో దశను 2027, జనవరి 10వ తేదీ నుంచి ఫిబ్రవరి 28 వ తేదీ వరకు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. సెన్సస్ డైరెక్టరేట్ సూచించిన ప్రకారం

స్వీయ గణన (ూవశ్రీట జుఅబఎవతీఖ్‌అశీఅ): 2027 జనవరి 10 నుంచి జనవరి 24 వరకు,

జన గణన 2027 జనవరి 25 నుంచి ఫిబ్రవరి 28 వరకు నిర్వహించడం జరుగుతుందని,

అలాగే 2027 ఫిబ్రవరి 28 న రాత్రి ఇళ్లు లేని వారిని గణించడం జరుగుతుందని, రివిజనల్ రౌండ్ (=వజఱ-ంఱశీఅ =శీబఅఽ): 2027 మార్చి 1 నుంచి మార్చి 5 వరకు నిర్వహించడం జరుగుతుందని,

జన గణనలో భాగంగా ఎన్యుమరేటర్లు ప్రతి గృహ యజమానిని సంప్రదించి మొత్తం (40) ప్రశ్నలకు సంబంధించిన వివరాలను సేకరిస్తారని,ప్రజలు ఎన్యుమరేటర్లకు సరైన సమాచారాన్ని అందించి జనాభా గణన విజయవంతంగా నిర్వహించేందుకు సహకరించాలని కోరారు.స్వీయ గణన లో జిల్లా లో గ్రామ పంచాయతీ వారిగా పంచాయతీ కార్యదర్శులు చొరవ తీసుకుని నిర్వహించాలని అన్నారు. జనాభా గణన ప్రక్రియను నిర్దేశిత షెడ్యూల్ ప్రకారం సమర్థవంతంగా నిర్వహించేందుకు సంబంధిత అధికారులు సమన్వయంతో పనిచేయాలని సమావేశంలో సూచించారు.

స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్ మాట్లాడుతూ జిల్లాలో మొదటి దశ జన గణన హౌస్ లిస్టింగ్ సర్వే విజయవంతం చేసినట్లే రెండవ దశ జన గణన కూడా విజయవంతం చేయాలని కోరారు.రెవెన్యూ అదనపు కలెక్టర్ జె.ఎల్.బి.హరిప్రియ మాట్లాడుతూ డిజిటల్ పద్ధతి లో మొబైల్ యాప్ ద్వారా వివరాలు నమోదు చేయనున్నట్లు తెలిపారు జన గణన పై వివరాల సేకరణకు చార్జీ అధికారులు, సిబ్బందికి పూర్తి అవగాహన కలిగి ఉండాలని అన్నారు.రెండవ దశ లో స్వీయ గణన పై ప్రజలకు అవగాహన కలిగించాలని అన్నారు. అసిస్టెంట్ కలెక్టర్ అండర్ ట్రైనీ సాయి శివాని,జడ్.పి. సి .ఈ.ఓ వెంకటరెడ్డి,ఆర్.డి.ఓ నవీన్,

జిల్లా విద్యా శాఖ అధికారి విజయకుమారి,సిపిఓ నర్సింహులు హైదరాబాద్ నుండి ట్రైనర్లు దయానంద్ ,శివరామ కృష్ణలు హాజరయ్యారు.

కుమ్మరి సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా అమరవాది సారంగపాణి

- కుమ్మర్ల అభివృద్ధికి అంకితభావంతో కృషి చేస్తా

- రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అమరావతి సారంగపాణి కృతజ్ఞతలు



అక్టోబర్ 28 అయినవోలు:-(ప్రజా కలం ప్రతినిధి) తెలంగాణ కుమ్మర్ల సంఘం 1355/2007 రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో తనకు రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా బాధ్యతలు అప్పగించేందుకు నామకరించి, ప్రోత్సహించిన రాష్ట్ర నాయకులకు, కమిటీ సభ్యులకు అమరావతి సారంగపాణి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.ఈ సందర్భంగా రాష్ట్ర నాయకులు చేతరాజు వెంకటేశ్వర్లు, కొన్నే సిద్ధయ్య, నిలిగొండ లక్ష్మణ్, సముద్రాల యాదగిరి, కోడూరు చంద్రయ్యలకు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. అలాగే తెలంగాణలోని 33 జిల్లాల అధ్యక్షులు, కార్యదర్శులు, 119 నియోజకవర్గాల కన్వీనర్లతో పాటు తనకు సహకరించిన ప్రతి నాయకుడికి పేరుపేరునా కృతజ్ఞతలు తెలిపారు. తనపై నమ్మకంతో అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తానని సారంగపాణి పేర్కొన్నారు. తెలంగాణ కుమ్మర్ల సంఘం అభివృద్ధికి, కుమ్మర్ల ఐక్యతను బలోపేతం చేయడానికి, తరతరాలుగా కొనసాగుతున్న కుమ్మరి కులవృత్తి పరిరక్షణకు, సామాజికంగా, ఆర్థికంగా అభివృద్ధి సాధించేందుకు, సంఘం హక్కుల సాధనకు అంకితభావంతో కృషి చేస్తానని హామీ ఇచ్చారు. మన ఐక్యతే మన బలం.. సంఘటిత పోరాటమే మన హక్కుల సాధనకు మార్గం అని అమరావతి సారంగపాణి పిలుపునిచ్చారు.

విపత్తుల సమయంలో ప్రాణాలు కాపాడేవారే నిజమైన 'ఆపద మిత్రులు' కమాండెంట్ శ్రీనివాస్ రావు



హనుమకొండ అక్టోబర్ 27 ప్రజా కలం ప్రతినిధి వరంగల్ మామునూరు 4వ బెటాలియన్ ఆవరణలో రెండవ బ్యాచ్ 'యువ ఆపద మిత్ర' శిక్షణ కార్యక్రమం ఘనంగా ప్రారంభమైంది. కమాండెంట్ ఎన్.వి.ఎస్. శ్రీనివాస్ రావు ముఖ్య అతిథిగా హాజరై శిక్షణా శిబిరాన్ని అధికారికంగా ప్రారంభించారు.ఈ సందర్భంగా కమాండెంట్ మాట్లాడుతూ... ప్రకృతి వైపరీత్యాలు లేదా ప్రమాదాలు జరిగినప్పుడు మొదటి గోల్డెన్ అవర్‌లో స్పందించే స్థానిక యువతకు సరైన శిక్షణ ఇవ్వడమే ఈ కార్యక్రమం యొక్క ముఖ్య ఉద్దేశ్యమని తెలిపారు.7 రోజుల పాటు సాగే ఈ ప్రత్యేక శిక్షణలో వరంగల్ కి చెందిన 112 మంది ఎన్ఎస్ఎస్ వాలంటీర్స్ (యువతి,యువకులు) అన్ని రకాల విపత్తు నిర్వహణ నైపుణ్యాలను నేర్చుకుని, సమాజానికి రక్షకులుగా నిలవాలని ఆకాంక్షించారు.ఈ 7 రోజుల్లో ఎంపిక చేసిన యువతీ యువకులకు ప్రథమ చికిత్స (ఫస్ట్ ఎయిడ్),సి.పి.ఆర్, ఈత, అగ్నిప్రమాదాలు,వరదల సమయంలో ప్రాణాలను ఎలా కాపాడాలో నిపుణులచే ప్రాక్టికల్ శిక్షణ ఇప్పిస్తారు.విపత్తు సమయాల్లో భయాందోళనలకు గురికాకుండా ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించే పద్ధతులపై లైవ్ డెమోలు నిర్వహిస్తారు.వాలంటీర్లకు ప్రత్యేక గుర్తింపు కార్డులతో పాటు విపత్తు రక్షణ కిట్లను అందజేస్తారు.ఈ ప్రారంభోత్సవ కార్యక్రమంలో అడిషనల్ కమాండెంట్ సి.వంశీ మోహన్ రెడ్డి,అసిస్టెంట్ కమాండెంట్ వీరన్న, రిజర్వు ఇన్స్పెక్టర్స్ రవి, వెంకటేశ్వర్లు,కృష్ణ,బెటాలియన్ పోలీస్ అధికారులు,శిక్షకులు పాల్గొన్నారు.

పోలీసుల త్యాగాలు మరువలేనివి

- కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్



గద్వాల ప్రతినిధి, అక్టోబర్ 27 (ప్రజా కలం):

విధి నిర్వహణలో ప్రాణాలర్పించిన పోలీసుల త్యాగాలు మరువలేనివని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అన్నారు. ప్రజల రక్షణ, భద్రత కోసం పోలీసులు అందిస్తున్న సేవలు ప్రశంసనీయమని పేర్కొన్నారు.

పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా నిర్వహిస్తున్న కార్యక్రమాల్లో భాగంగా మంగళవారం గద్వాల పరేడ్ మైదానంలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని, పోలీసు శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వివిధ అవగాహన స్టాళ్లను జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్, ఎస్పీ శ్రీనివాసరావుతో కలిసి ప్రారంభించారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. పోలీసులు నిరంతరం ప్రజల రక్షణకు ప్రాధాన్యతనిస్తూ విధులు నిర్వహించడం గర్వకారణమన్నారు. పోలీసు అమరవీరుల సంస్మరణ దినం సందర్భంగా ప్రజాహిత కార్యక్రమాలు చేపట్టడం అభినందనీయమని తెలిపారు. విద్యార్థులకు గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌తో పాటు వివిధ అంశాలపై అవగాహన కల్పించాలని స్టాళ్ల నిర్వాహకులకు సూచించారు.జిల్లా ఎస్పీ శ్రీనివాసరావు మాట్లాడుతూ.. ఈ నెల 31వ తేదీ వరకు పోలీసు శాఖ ఆధ్వర్యంలో ఫ్లాగ్ డే కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. విద్యార్థులు, పోలీసులు, పాత్రికేయులు, ఇతర పౌరులకు వ్యాసరచన, ఫొటోగ్రఫీ తదితర పోటీలు నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. షీ టీమ్స్, భరోసా కేంద్రాల ద్వారా సమస్యలు ఎదుర్కొంటున్న మహిళలకు రక్షణతో పాటు అవసరమైన న్యాయ సహాయం అందిస్తున్నట్లు తెలిపారు.

అనంతరం షీ టీమ్స్, భరోసా కేంద్రాలు, డాగ్ స్క్వాడ్, ట్రాఫిక్ భద్రత, మాదకద్రవ్యాల నిరోధం, బాంబు గుర్తింపు, సైబర్ నేరాలపై ఏర్పాటు చేసిన స్టాళ్లను కలెక్టర్, ఎస్పీ విద్యార్థులతో కలిసి పరిశీలించారు.

ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ శంకర్, డీఎస్పీ మొగిలయ్య, పోలీసు అధికారులు, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.